RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:236 హైదరాబాద్, బుధవారం, 16 ఏప్రిల్ 2025 పేజీలు: 12 వెల: 1.00

## పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం(సీఎల్పీ) సమావేశం జరిగింది. శంషాబాద్ నోవాటెల్ హెూటల్‌లో జరిగిన ఈ భేటీలో.. ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. " పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదు" అని సీఎం తేల్చి చెప్పారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. " రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలి" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి తప్పిన ప్రమాదం

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. నోవాటెల్ హెూటల్‌లో సమావేశం పూర్తయిన తర్వాత హెూటల్‌లో కిందకు వస్తుండగా.. సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తు కంటే లోపలికి దిగిపోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది లిఫ్ట్‌ను ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో సీఎంను కిందకు పంపించారు.

## తెలంగాణలో ప్రతిస్మాత్మకంగా కుల గణన: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుల సర్వే జరిపింది. ఇందుకోసం సబ్ కమిటీ ,డెడికేటెడ్ కమిటీ వేసుకొని కాబినెట్ తీర్మానం చేసుకొని స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రెండు వేరు వేరు బిల్లులు చట్టం చేయడం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ బీసీ ల పక్షాన ధన్యవాదాలు. వారం రోజుల్లో బీసీ మేధావులు ,కుల సంఘాలతో సమావేశం ఏర్పాటీ చేసుకొని భవిషత్ కార్యాచరణ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది. శాసన సభలో బీజేపీ ,బీఆర్ఎస్ ఏకగ్రీవం బీసీ రిజర్వేషన్లు పెంచే తీర్మానానికి మద్దతు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు కూడా మద్దతు ఇవ్వాలి. దేశ వ్యాప్తంగా కుల సర్వే రోల్ మోడల్. ఇది అమలు చేయడానికి ప్రక్రియ వేగవంతం చేస్తామని అన్నారు.

శాసన సభలో మద్దతు ఇచ్చినట్టు ఇప్పుడు కూడా బీజేపీ బీఆర్ఎస్ లు మద్దతు ఇవ్వాలి. సుప్రీం కోర్టు తీర్పు మాకు సానుకూలంగా ఉంది.. మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఉంది. పారదర్శకంగా చేసిన సర్వే ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేవు. ఎస్సీ వర్గీకరణ దేశంలోనే చట్టం చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ. ఇది విప్లవాత్మక నిర్ణయం. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నిర్ణయం మేరకు ఈ సమయాన్ని క్షేత్ర స్థాయిలో ముందుకు తీసుకుపోతాం. సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న వడ్లు కి బోనస్ ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తున్నాం. చరిత్రలో ఇన్ని కార్యక్రమాలు కూడా ఏ ప్రభుత్వం చేయలేదు.. కొత్త ప్రభాకర్ రెడ్డి రవాణా శాఖ బిజినెస్ మెన్ అనుకున్న. ప్రభాకర్ రెడ్డి జ్యోతిష్యం చదివినట్టు తెలియదు బిజినెస్ మెన్ అనుకున్న మాకు ప్రజల విశ్వాసం ఇచ్చారు.

## ఆచితూచి అడుగుల్లో గులాబీ దళపతి

హైదరాబాద్, ఏప్రిల్ 15

కేసీఆర్‌కు రాజకీయాలు అనగా చెరువులో చేపలకు ఈత నేర్పడం వంటిది. అంత సహజం, అంత సులభం! తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి, రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఆయన, 2014 నుంచి?2023 వరకు తెలంగాణను ముఖ్యమంత్రిగా నడిపించారు. అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారు. అలాంటి నాయకుడికి ఎప్పుడు, ఎలా రాజకీయం చేయాలో బాగా తెలుసు. అందుకే ఇప్పుడు ఆయన జనంలోకి రాకుండా, నీడలో నిశ్శబ్దంగా తన వ్యూహాలను రచిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచాయి. ఇంకా నాలుగేళ్లకు పైగా అధికారం వారి చేతిలోనే ఉంది. అయితే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ కొంత వెనుకబడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని పథకాలు అమలైనప్పటికీ, ఇంకా చాలా హామీలు నెరవేరాల్సి ఉంది. అంతేకాదు, కాంగ్రెస్‌లో అంతర్గత గ్రూప్ రాజకీయాలు, నాయకుల మధ్య సమన్వయ లోపం కూడా బయటకు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులను కేసీఆర్‌దూరం నుండి గమనిస్తున్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల అసంతృప్తి క్రమంగా పెరుగుతుందని, అది తమకు రాజకీయంగా లాభిస్తుందని ఆయన ఆశిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పాలన ''పక్వానికి'' చేరే వరకు వేచి చూడాలని కేసీఆర్ భావిస్తున్నారట.ఇప్పుడే జనంలోకి వెళ్లి కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉండదని కేసీఆర్ అభిప్రాయపడుతున్నారు. బదులుగా, సరైన సమయంలో, ప్రజల్లో అసంతృప్తి గరిష్ట స్థాయికి చేరినప్పుడు బయటకు వచ్చి మాట్లాడితే, ఆ మాటలు జనంలో బలంగా ప్రతిధ్వనిస్తాయని ఆయన నమ్ముతున్నారు. ఈ వ్యూహంతోనే ఆయన ఇప్పట్లో బహిరంగ సభలు, ర్యాలీలకు దూరంగా ఉంటున్నారు. అయితే, నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, ఆయన రాజకీయంగా నిష్క్రియంగా లేరు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ, బీఆర్ఎస్‌ను బలోపేతం చేసే వ్యూహాలను రూపొందిస్తున్నారు. అదే సమయంలో, తనకు ఇష్టమైన వ్యవసాయాన్ని కూడా పర్యవేక్షిస్తూ సమయాన్ని గడుపుతున్నారు.ఏప్రిల్ 27వ తేదీన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవంజరగనుంది. ఈ సందర్భంగా కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.



ఈ సభలో ఆయన తమ పార్టీ బలాన్ని చాటడంతో పాటు, కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైన తీరును ఎత్తిచూపవచ్చు. అయితే, ఈ సభ తర్వాత ఆయన మళ్లీ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యే అవకాశం ఉందని అంటున్నారు.కాంగ్రెస్‌కు ఇంకా 45 నెలలకు పైగా అధికారం ఉంది. ఈ సమయంలో వారు చేసే తప్పిదాలే బీఆర్ఎస్‌కు రాజకీయంగా లాభిస్తాయని కేసీఆర్ ఆలోచిస్తున్నారు. ఆయన దృష్టి 2026 లేదా అంతకు మించి ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అప్పటి వరకు పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం, యువ నాయకులను ప్రోత్సహించడం, కాంగ్రెస్ బలహీనతలను జనంలోకి తీసుకెళ్లడం వంటి వ్యూహాలపై ఆయన దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.కేసీఆర్‌కు రాజకీయం ఒక పని అయితే, వ్యవసాయం ఒక అభిరుచి. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఆయన వ్యవసాయ కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షిస్తారు. రైతు సంక్షేమం కోసం తీసుకొచ్చిన రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు ఆయన వ్యవసాయం పట్ల అభిమానానికి నిదర్శనం. ఈ విశ్రాంతి సమయంలో కూడా ఆయన తన రైతు మనసును తామరాకు మీద నీటిబొట్టులా ఉంచుకున్నారని సన్నిహితులు చెబుతున్నారు.కేసీఆర్ ఇప్పుడు నిశ్శబ్దంగా ఉండొచ్చు, కానీ ఆయన రాజకీయ ఆటలో ఎప్పుడూ ఆచితూచి అడుగు వేస్తారు. సమయం కోసం వేచి ఉంటూ, పార్టీని బలోపేతం చేస్తూ, కాంగ్రెస్ తప్పిదాలను ఎత్తిచూపే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. 2026 తర్వాత ఆయన రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి.

## నేషనల్ హెరాల్డ్' కేసు..
## ఈడీ ఛార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు

ఢిల్లీ: 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ( అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ(), రాహుల్ గాంధీ( పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ ఓవర్సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిత్రోడా పేర్లను పేర్కొంటూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. దీనిపై ఏప్రిల్ 25న ఢిల్లీ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.



మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. హరియాణాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్న వారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్న వారు ఇక నుంచి తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియను చేస్తున్నామని తెలిపింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (ఢిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది.

## మ్యాన్ హెూల్ క్లీనింగ్‌కు రోబోలు..
## 'మహా' సర్కారు ప్రయత్నం

ముంబయి: మురుగు శుభ్రం చేసేందుకు వెళ్లి మ్యాన్‌హెూల్‌లో కార్మికులు ప్రాణాలు కోల్పోయిన వార్తలు తరచూ చూస్తున్నాం. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి ఆలోచన చేసింది. కార్మికుల ఆరోగ్య పరిస్థితిని దృష్టి ఉంచుకుని రోబోలను రంగంలోకి దింపేందుకు యోచిస్తోంది. అందుకు 100 రోబోలను కొనుగోలు చేసేందుకు ప్రణాళిక చేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సత్ మీడియాకు వెల్లడించారు.



పారిశుద్ధ్య కార్మికుల మరణాలను నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ ఇటీవల విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే పారిశుద్ధ్య పనులపై కేంద్ర సామాజిక, సాధికారత మంత్రిత్వ శాఖ ఆడిట్ నిర్వహించింది. ముంబయి, పుణే, పర్భానీ, సతార...తదితర ప్రాంతాల్లో ఆడిట్ చేయగా.. కార్మికులను రక్షించడంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు విఫలమయ్యారని తేలింది. 2021-24 మధ్య 18 మంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడైంది.

సర్వే చేసిన ప్రాంతాల్లో భద్రతా ప్రోటోకాల్, రక్షణ గేర్, అత్యవసర ప్రతిస్పందన విధానాలు అవసరమైనంత లేవని ఆడిట్‌లో తేలింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం తాజా ప్రకటన చేసింది. "మ్యాన్‌హెూల్స్‌ను శుభ్రం చేసేందుకు 27 మున్సిపల్ కార్పొరేషన్లకు 100 రోబోలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం మ్యానువల్‌గా పనులు కొనసాగుతున్నాయి. దేశీయంగా తయారైన రోబోలు ఇందులో ఉపయోగిస్తున్నాం. వీటి సామర్థ్యం కూడా ఎక్కువే. మురుగును శుభ్రం చేయడంతో పాటు.. వ్యర్థాలను వేరు చేస్తాయి. తొలుత ఛత్రపతి శంభాజీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త రోబోలతో కొన్ని రోజుల పాటు ట్రయల్ జరుగుతుంది. ఫలితాలు బాగుంటే.. అన్ని చోట్ల రోబోలను రంగంలోకి దింపుతాం" అని సంజయ్ శిర్సత్ పేర్కొన్నారు.

## ఢిల్లీలో ఆ వాహనాలకు నో పెట్రోల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15,

మీరు ఢిల్లీలో నివసిస్తుంటే, మీకు 10 సంవత్సరాల పాత వాహనం ఉంటే, మీరు ఈ వార్త తెలుసుకోవడం చాలా ముఖ్యం. కాలుష్యాన్ని నియంత్రించడానికి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. మీ వాహనం పాతదైతే, పెట్రోల్ పంప్ నుండి పెట్రోల్ వేసుకోలేరని గుర్తించుకోండి.పాత వాహనాలకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. 2024 నుండి ఢిల్లీలో 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్/సీఎన్జీ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసినట్లు రవాణా శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిబంధనల పరిధిలోకి వచ్చే వాహనాల సంఖ్య 55 లక్షలకు పైగా ఉంది. అంతేకాకుండా అటువంటి వాహనాలను బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ చేయడం పూర్తిగా నిషేధించింది.ఇప్పుడు కారు యజమానులు ఆశ్రయించగల కొన్ని ఎంపికలు ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ నిషేధం తర్వాత, యజమానులు ప్రైవేట్ పార్కింగ్ స్థలాలను మాత్రమే ఉపయోగించుకోవచ్చు. మీ వాహనం 10 సంవత్సరాలు (డీజిల్) లేదా 15 సంవత్సరాలు (పెట్రోల్, సీఎన్జీ) పూర్తి చేసి ఉంటే, దానిని ఔఆఖీ నుండి బయటకు రావాలంటే ఒక సంవత్సరం లోపు ఎన్వోసీ పొందడం తప్పనిసరి.ఇది కాకుండా, స్క్రాపింగ్ కూడా చివరి ఎంపికగా అందుబాటులో ఉంది. మీరు స్వచ్ఛంద వాహన స్క్రాపింగ్ అప్లికేషన్ ద్వారా మీ వాహనాన్ని స్క్రాప్ చేస్తే కొత్త వాహనం కొనుగోలుపై మీకు మోటారు వాహన పన్ను మినహాయింపు లభిస్తుంది.ఢిల్లీలో పాత వాహనాలను నడిపినా లేదా బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసినా, మీకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు జరిమానా విధించవచ్చు. అలాగే, మీ వాహనాన్ని కూడా జప్తు చేయవచ్చు. ఢిల్లీ ప్రభుత్వం 477 పెట్రోల్ పంపులలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతోంది. ఈ వ్యవస్థ సహాయంతో వాహనాల వయస్సుకు సంబంధించిన డేటా అందుబాటులో ఉంటుంది. మీ వాహనం నిర్దేశించిన పరిమితి కంటే పాతదైతే, దానికి పెట్రోల్/డీజిల్‌ను వేయించుకోలేరని గుర్తించుకోండి.

భారత శక్తి
VOICE OF INDIAN

## లక్ష్మణరేఖ దాటేస్తున్నారా...

దేశానికి రాష్ట్రపతి ఎంత కీలకమో రాష్ట్రాలకు గవర్నర్ పదవి అంతే కీలకం. వీళ్లద్దరూ భారత రాజ్యాంగ బద్ధంగా ప్రభుత్వాలు నడుస్తున్నాయో లేదో చూడాలి తప్ప రాజకీయ పార్టీల్లా పాలిటిక్స్ చేస్తే పనిచేయదని క్లారిటీ ఇచ్చింది. గవర్నర్ల విచక్షణాధికారానికి కత్తెర వేసింది. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న గవర్నర్ల వల్ల అత్యున్నతమైన ఆ ఉన్నత వ్యవస్థకు ఇలాంటి నిబంధనలు విధించాల్సి వచ్చింది. అయితే, ఇకపై ఇలాంటి పరిస్థితిలో మార్పు వస్తుందని అంతా ఆశీస్తున్నారు. గవర్నర్ల నియామకంలో మార్పులు వచ్చినా రాకపోయినా.. ఇప్పుడు, సుప్రీం తీర్పుతో.. గవర్నర్లు దారిలోకి వస్తారనడంలో సందేహం లేదు. ఇక, ఎలాగూ కేంద్రంలో ఉన్న అధికార పార్టీకి కూడా దాదాపు హెచ్చరికలు వెళ్లినట్లే భావించాలి గనుక.. సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా నడుచుకునే సాహసం అయితే చేయరనే అభిప్రాయాలు ఉన్నాయి.ఇండియాలో పాలిటిక్స్ ఎంత పీక్స్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, పాలనలో మాత్రం స్వార్థపూరిత రాజకీయాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే రాజ్‌భవన్‌కు కూడా రాజ్యాంగం అధికారాలు ఇచ్చింది భారత రాజ్యాంగం. ఒకవేళ, ప్రజా ప్రతినిధులు రాజకీయాలు చేస్తున్నా.. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాలకు సక్రమమైన సలహాలు ఇవ్వడానికి రాజ్‌భవన్‌లో ఉండే రాష్ట్రపతికి, గవర్నర్లకు విచక్షణాధికారాలు కూడా కట్టబెట్టింది. అయితే, ఇక్కడ కూడా పొలిటికల్ వ్యవహారాలకే పెద్దపీట వేస్తున్న పరిస్థితి. "నా ప్రభుత్వం ఫలానా పని చేసిందని గర్వగా చెబుతున్నాను" అనాల్సిన గవర్నర్లు ఆ ప్రభుత్వాలతోనే ఫైట్ చేస్తున్నారు.వివాదాస్పద బిల్లులైతే ఓకే గానీ.. పాలనా పరమైన కీలక బిల్లుల్ని కూడా పక్కనపెట్టేస్తోంది రాజ్‌భవన్. కొన్ని సందర్భాల్లో పాలనకు కూడా అడ్డొస్తున్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల్ని రాజ్‌భవన్‌లోనే తొక్కి పెట్టి, కక్ష్యపూరింతంగా వ్యవహరిస్తున్నారు. గవర్నర్‌లను రాజకీయంగా ఉపయోగించుకునే దుస్థితి ఇప్పటిది కాకపోయినప్పటికీ? ఇటీవల కాలంలో ఇది మరింత దిగజారింది. అందుకే, సుప్రీం కోర్టు ఫైనల్ రూల్ ఇచ్చేసింది. ఇకపై బిల్లులను ఇష్టం వచ్చినట్లు ఆపేస్తామంటే కదరదనీ.. గవర్నర్ల విచక్షణాధికారానికి సుప్రీం కోర్టు కత్తెర వేసింది. ప్రజాస్వామ్యాన్ని దాటి గవర్నర్లకైనా? రాష్ట్రపతికైనా సూపర్ అధికారాలు లేవంటూ కుండబద్దలు కొట్టింది.దశాబ్ధంగా దేశంలోని పలు రాష్ట్రాల గవర్నర్ల తీరుపై సుప్రీం కోర్టుకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. అసెంబ్లీలో ఆమోదించి, రాజ్‌భవన్‌కు పంపుతున్న బిల్లులను సంవత్సరాల తరబడి ఆపేస్తున్నారంటూ ఆందోళనలు వచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నుండి కేరళ, తమిళనాడు, తెలంగాణా, పశ్చిమ బెంగాల్, పంజాబ్, జార్ఖండ్ వరకు తమ గవర్నర్లపై ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోపణలు గుప్పించాయి. కొందరైతే ఇంకాస్త ముందుకెళ్లి గవర్నర్‌ను తొలగించమని వినతులు కూడా పెట్టారు. ఆయా రాష్ట్రాలు..'తమ గవర్నర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీల కొమ్ముకాస్తున్నారని' చెబితే? 'గవర్నర్ ఎందులోనైనా కలుగచేసుకుంటారు' అనే స్థాయిలో గవర్నర్లు మాట్లాడారు.అయితే, ఈ పరిస్థితి నాన్ బిజెపి ప్రభుత్వం ఉన్న దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కనిపించింది. కొన్ని రాష్ట్రాల్లో అయితే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కంటే కేంద్రం నామినేట్ చేసిన గవర్నర్‌దే రూలింగ్ అనే లెవల్‌కు వెళ్లింది. దేశంలోని మాజీ న్యాయమూర్తులు కూడా ఈ ధోరణిని రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. వామపక్ష పార్టీలైతే? గవర్నర్ పదవిని "అసంబద్ధం"గా పేర్కొంటూ రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశాయి. ఇక, ఈ యుద్ధానికి ఇప్పుడు ముగింపు వచ్చింది. ఇటీవల, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరుపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీమ్ కోర్టుకు వెళ్లగా.. అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. ఏప్రిల్ 11న ఈ తీర్పు కాపీని బహిరంగపరిచింది కోర్టు.తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ సంచలన తీర్పు ఇచ్చింది. రాష్ట్ర శాసనసభ పంపించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పెట్టే అధికారం గవర్నర్‌కు లేదని తేల్చి చెప్పింది. అలాంటి వీటో అధికారాలు గవర్నర్‌కు ఉండబోవని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పును వెలువరించింది. తమిళనాడు అసెంబ్లీ తీర్మానించి రాజ్‌భవన్‌కు పంపించిన 10 బిల్లులకు సంబంధించి 2020 నుండీ గవర్నర్ ఆర్ఎన్ రవి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉండటం చట్టవిరుద్ధమని ప్రకటించింది.సాధారణంగా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ తన అంగీకారాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఆ బిల్లులు ఉంటేనే గానీ వాటిని పునఃపరిశీలనకు పంపించే అవకాశం దాదాపుగా ఉండదు. అయితే, తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన అనేక బిల్లులను గవర్నర్ రవి ఆమోదించకుండా ఉద్దేశపూరకంగా అడ్డుకుంటున్నారనేది ప్రభుత్వం వాదన. దీన్ని తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేయగా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ తన విధులను నిర్వర్తించడానికి స్పష్టంగా కాలపరిమితి లేదని, ఎలాంటి సమయ పరిమితులు లేనప్పటికీ, తనకు అందిన బిల్లులను ఆమోదించకపోవడం, దీనివల్ల రాష్ట్రంలో చట్టాల రూపకల్పన ప్రక్రియను ఆలస్యం చేయడానికి అంగీకరించినట్టయిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ.. కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం. 'బిల్లులపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఆలస్యం చేయడం ద్వారా రాష్ట్రంలో శాసన నిర్మాణ వ్యవస్థకు గవర్నర్ అవరోధం కలిగించవచ్చన్న అర్థం వచ్చేలా రాజ్యాంగంలోని 200వ అధికరణాన్ని చదువుకోకూడదు' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఆర్టికల్ 200ని ఆర్టికల్ 163తో పాటు చదవాలని కోర్టు వెల్లడించింది. దీని ప్రకారం.. క్యాబినెట్ సలహా మేరకు గవర్నర్ చర్య తీసుకోడానికి కట్టుబడి ఉండాలని'' పేర్కొంది.నిజానికి, గవర్నర్ స్థాయిలో ఉన్నవారికి కోర్టుల నుండి మొట్టికాయలు పడటం.. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పదవిలో ఉన్న వ్యక్తిని రాజ్యాంగబద్ధంగా నడుచుకోమని పదేపదే చెప్పాల్సిరావడం ఆ పదవికి, మొత్తంగా రాజ్‌భవన్‌కే అవమానంగా మారుతున్న పరిస్థితి. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు, రాష్ట్రాల అధికారాలకు తాము అతీతులమన్న తరహాలో వ్యవహరిస్తున్న గవర్నర్లకు ఈ తీర్పు స్పష్టమైన హెచ్చరికే అనుకోవాలి. కాలపరిమితులను దాటితే గవర్నర్ల నిర్ణయాలు కూడా న్యాయసమీక్ష ముందు నిలవాల్సివస్తుందన్న సూచన చాలా మార్పులను తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. ఇది, ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలకు, గవర్నర్లకు మధ్య సఖ్యతను కుదురుస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# వక్ఫ్ బోర్డుపై సుప్రీంకు వైసీపీ...

## తప్పు పట్టిన బీజేపీ

విశాఖపట్టణం, ఏప్రిల్ 15

వక్ఫ్ బోర్డు చట్టం విషయంలో వైఎస్ఆర్‌సీపీ వ్యవహరిస్తున్న తీరుపై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. నాడు అధికారంలో ఉండి ఆంధ్రప్రదేశ్ అంతటా వక్ఫ్ భూములు లూటీ అయినప్పుడు కళ్లుమూసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ముస్లింల రక్షకుల్లా నటిస్తోందని విమర్శించారు. వైఎస్ఆర్‌సీపీ వక్ఫ్ చట్టాన్ని రక్షించడానికి కాదు ? వారి పాలనలో వక్ఫ్ ఆస్తులు కబ్జా చేసిన నేరస్తులను కాపాడడానికే నేడు సుప్రీంకోర్టు లో సవాల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనారిటీలంటే నిజమైన ప్రేమ కాదు , వారిని ఓటు బ్యాంక్ గానే చూస్తున్నారన్నారు. ఇప్పుడేమో కోర్టులను కూడా వాడుకుని తమ పాపాల్ని కడిగేసుకునే ప్రయత్నం చేస్తున్నారని.. ఇది అసహ్యకరమైన రాజకీయ నాటకమని విష్ణు విమర్శించారు. వక్ఫ్ బిల్లును చట్టంగా చేయడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో వైఎస్ఆర్‌సీపీ పిటిషన్ వేసింది. ముస్లిం సమాజం ఆందోళనలను పరిష్కరించడంలో వైఫల్యం, రాజ్యాంగ ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని వైఎస్ఆర్‌సీపీ తెలిపింది. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 13, 14, 25 , 26 లను ఉల్లంఘిస్తుందని పిటిషన్‌లో పేర్కొంది. . ప్రాథమిక హక్కులు, చట్టం ముందు సమానత్వం, మత స్వేచ్ఛ , మతపరమైన వర్గాలు తమ సొంత వ్యవహారాలను నిర్వహించడానికి స్వయంప్రతిపత్తిని రాజ్యాంగం హామీ ఇచ్చిందన్నారు. సెక్షన్ 9 , 14 కింద ముస్లిమేతర సభ్యులను చేర్చడం వక్ఫ్ సంస్థల అంతర్గత పనితీరులో జోక్యంగా పరిగణించాలని.. ఈ నిబంధన బోర్డుల మతపరమైన లక్షణాన్ని, పరిపాలనా స్వచ్ఛను దెబ్బతీస్తుందని వైసీపీ తన పిటిషన్ లో పేర్కొంది. వక్ఫ్ చట్టం-2025 సవరణ బిల్లుపై సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర ముస్లిం సంస్థలు, ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ముస్లిం ఆస్తుల సేకరణకు వ్యతిరేకమని వాదిస్తూ పిటిషన్ వేశాయి. అసదుద్దీన్ ఓవైసీ, తృణమూల్ కాంగ్రెస్ తో పాటు తమిళనాడులో రాజకీయ పార్టీ పెట్టిన విజయ్ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ప్రధానంగా వక్ఫ్ చట్టంలోని సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తాయని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణపై ప్రభావం చూపుతాయని వాదిస్తూ దాఖలు చేశారు. నిజానికి వక్ఫ్ చట్టాన్ని పార్లమెంట్ లో వైఎస్ఆర్‌సీపీ వ్యతిరేకించింది. లోక్ సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే రాజ్యసభలో మాత్రం అనుకూలంగా ఓటేశారన్న ప్రచారం జరుగుతోంది. తాము బిల్లును వ్యతిరేకిస్తామని రాజ్యసభలో వైసీపీ పక్ష నేత సుబ్బారెడ్డి ప్రకటించారు. కానీ విపక్ష సభ్యులు .. వక్ఫ్ బిల్లును వ్యతిరేకించిన వారి ఓట్లు చూస్తే సరిపోలలేదు. మూడు ఓట్లు వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఎక్కువగా వచ్చాయి. అదే సమయంలో వ్యతిరేకించిన వారి ఓట్లు తక్కువగా వచ్చాయి. వైసీపీ సభ్యుల్లో ఒకరైన గుజరాత్ కు చెందిన పరిమిళ్ నత్వానీ బిల్లుకు అనుకూలంగా ఓటేశారని అంటున్నారు. ఆయన ఒక్కరే కాదని.. మరో ఇద్దరు, ముగ్గురు కూడా బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారని అంటున్నారు. విప్ జారీ చేశామని వైఎస్ఆర్‌సీపీ అంటున్నా.. ఓటింగ్ అయిపోయిన తర్వాత జారీ చేశారని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే తాము బిల్లును సమర్థించడం లేదని నిరూపించుకునేందుకు వైసీపీ కోర్టులోనూ పిటిషన్లు దాఖలు చేసినట్లుగా భావిస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లోక్ సభలో..రాజ్యసభలో వక్ఫ్ బిల్లును వ్యతిరేకించింది. కానీ రాజ్యసభ ఓటింగ్ సమయంలో కొంత మంది వైసీపీ సభ్యులు వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఓటేశారన్న ప్రచారం జరిగింది. అయితే తాము విప్ జారీ చేశామని వైసీపీ తెలిపింది. పలు పార్టీలు, వ్యక్తులు ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయగా వారితో పాటు వైసీపీ కూడా దాఖలు చేసింది.

# సజ్జల హవానేనా...



విజయవాడ, ఏప్రిల్ 15

వైసీపీ అధినేత జగన్ అధికారాన్ని కోల్పోయినా ఆయనలో మార్పు రాలేదని స్పష్టంగా తెలుస్తుంది. ఎంత మంది పార్టీ నేతలు వెళ్లింది కారణాలు ఎవరని చెప్పిందీ అందరికీ తెలుసు. అందరి వేళ్లూ చూపించిన వారినే అందలం ఎక్కించుకుంటుంటే ఇక జగన్ వైఖరిలో ఏం మార్పు వచ్చినట్లు? సీట్ల కేటాయింపుల దగ్గర నుంచి ముఖ్యమైన నిర్ణయాల వరకూ.. ఐదేళ్లలో అన్ని శాఖలపై పెత్తనం వెలగబెట్టిన సజ్జల రామకృష్ణారెడ్డికి మరోసారి జగన్ కీలక పదవి కట్టబెట్టడం పార్టీలోనే చర్చనీయాంశమైంది. సజ్జల రామకృష్ణారెడ్డిని పీఏసీ కన్వీనర్ గా నియమించడం జగన్ చేసిన అతి పెద్ద తప్పు అంటూ ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియాలో పెద్దయెత్తున పోస్టులు కనపడుతున్నాయి.. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరించిన తీరు వివాదాలకు నిలయంగా మారింది. నాటి ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తే అది రాజకీయ విమర్శలు అని సరిపెట్టుకోవచ్చు. కానీ పార్టీని వీడి వెళ్లిపోతున్న నేతలందరూ సజ్జల వైపు చూపుతున్నారు. చివరకు జగన్ కు కష్టకాలంలో అండగా ఉండి ఆయనతో పాటు జైలుకు వెళ్లి పదహారు నెలలు గడిపి వచ్చిన విజయసాయిరెడ్డి కూడా కోటరీ అంటూ పరోక్షంగా సజ్జల రామకృష్ణారెడ్డి వైపు చూపారు. అంటే ఆయనపై పార్టీలో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు. పార్టీ నుంచి వెళ్లి పోయేవారు సజ్జల ను కార్నర్ చేస్తున్నారని జగన్ భావిస్తే అంతకంటే మించిన కామెడీ మరొకటి ఉండదు. ఎందుకంటే జగన్ కు తెలియకుండా సజ్జల రామకృష్ణారెడ్డి అనేక పనులు ఐదేళ్లలో చక్కపెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యమైన పదవుల నియామకం నుంచి పార్టీ ఇన్ ఛార్జుల మార్పు వరకూ అంతా సజ్జల చెప్పినట్లే జరిగిందంటారు. జగన్ వద్దకు కనీసం వెళ్లేందుకు కూడా సజ్జల అంగీకరించేవారు కాదు. అంతా తన వద్దనే సర్దుబాటు చేసి మంత్రులను, ఎమ్మెల్యేలను పంపేవారు. జగన్ తనకు చెప్పారంటూ నేతలకు చెబుతుండటంతో అది నిజమేనని నమ్మిన నేతలు మౌనంగానే వెనక్కు వెళ్లిపోయేవారు. అలాగే క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు జగన్ దృష్టికి తీసుకెళ్లకుండా సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకున్నాన్న విమర్శలు కూడా ఫ్యాన్ పార్టీలో వినిపించాయి.అలాంటి సజ్జల రామకృష్ణారెడ్డి గత ఎనిమిది నెలలుగా కొంత దూరంగా ఉంటున్నారు. అయితే జగన్ కూడా ఆయనను దూరం పెట్టారులే అని అందరూ అనుకున్నారు. కానీ పీఏసీ కమిటీ కన్వీనర్ గా నియమించడంతో జగన్ వద్ద సజ్జల రామకృష్ణారెడ్డి హవా ఏమాత్రం తగ్గలేదన్నది మరోసారి స్పష్టమయింది. సజ్జల వల్ల పార్టీకి ప్రయోజనం లేకపోగా, నష్టమేనని అందరూ చెబుతున్నప్పటికీ జగన్ మాత్రం మొండిగా వ్యవహరించడం పట్ల వైసీపీ సీనియర్ నేతలు సయితం ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్ల కాలంలో ఉన్న పరిస్థితులు వైసీపీలో ఏం మారలేదనడానికి సజ్జల రామకృష్ణారెడ్డి నియామకమే నిదర్శనమని అంటున్నారు. మరి సజ్జల వల్ల ఉపయోగం జగన్ కు మాత్రమే తెలుసా? ఆయన వైఖరిలో మార్పు రాదన్నది ఈ నియామకంతో వెల్లడయింది.

మండిపడుతున్న సీనియర్లు

నమ్మకం.. ఈ మాట ఎంత దూరమైనా తీసుకెళ్తుంది. నమ్మకం ఉండాలి తప్ప.. అదే నమ్మకాన్ని గుడ్డిగా ఫాలో కాకూడదు. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి చేస్తోంది అదే. ఏకంగా పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి చేతిలో పెట్టేశారు. తాను పార్టీ అధినేతగా కొనసాగుతుండగా.. పార్టీలో అత్యంత విలువైన రాజకీయ వేదికగా ఉన్న పొలిటికల్ అడ్వైజరీ కమిటీకి సజ్జల వారిని చైర్మన్ చేశారు. అంటే తన తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని అంటూ సంకేతాలు ఇచ్చారు. అయితే సజ్జల వల్లే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందన్నది మెజారిటీ నేతల అభిప్రాయం. కానీ జగన్మోహన్ రెడ్డి దానిని విశ్వసించలేదు. సజ్జల రామకృష్ణారెడ్డి పై నమ్మకం పెట్టుకొని ఏకంగా పొలిటికల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టారు.సజ్జల రామకృష్ణారెడ్డి ఎక్కడో సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ గా ఉండేవారు. అటువంటి వ్యక్తిని తెచ్చి పార్టీ కార్యక్రమాలను అప్పగించారు. పార్టీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వంలోనూ కీలక బాధ్యతలు కట్టబెట్టారు. చివరకు పార్టీలో కూడా విశేష హక్కులు కల్పించారు. కానీ జగన్మోహన్ రెడ్డి తో నడిచిన నేతలకు ఇది మింగుడు పడని విషయం. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీనియర్లు సజ్జల విషయంలో భిన్నభిప్రాయాలతో ఉన్నారు. అసలు రాజకీయాలతో సంబంధం లేని సజ్జలను తమపై రుద్దడాన్ని ఎక్కువమంది వ్యతిరేకిస్తున్నారు. గత ఐదేళ్ల వైసిపి అధికారంలో ఉండేటప్పుడు ఏ నిర్ణయం అయినా చెల్లి పోయింది. కానీ ఇప్పుడు సజ్జలను తమపై వేయడం ఏమిటన్న అభిప్రాయం సీనియర్లలో ఉంది.తెలుగుదేశం పార్టీకి పోలిట్ బ్యూరో ఉంది. దానిలో దాదాపు 30 మంది వరకు సభ్యులు ఉన్నారు. దానికి అధ్యక్ష పదవి అంటూ లేదు. పార్టీ అధినేత చంద్రబాబు.. పొలిట్ బ్యూరో సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఆయన మార్గదర్శకంలోనే అత్యున్నత సమావేశంలో రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారు. కానీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ లో అందుకు భిన్నం జరుగుతోంది. ఏకంగా ఆ కమిటీ అధ్యక్ష బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించారు జగన్. ఇది ఎంత మాత్రం వైసీపీ సీనియర్లకు రుచించడం లేదు. సజ్జల తీరు వల్లే పార్టీ ఓడిపోయింది అన్నది ఎక్కువమంది అభిప్రాయం. అటువంటి వారంతా ఇప్పుడు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రభుత్వం పై పెత్తనం చేశారు సజ్జల రామకృష్ణారెడ్డి. ఆయన కుమారుడు భార్గవరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని చూసేవారు. ఈ ఇద్దరు తండ్రి కుమారులు ఆర్థికంగా బలపడ్డారు. కానీ పార్టీకి మైనస్ చేశారు అన్నది సీనియర్ నేతల అభిప్రాయం. అందుకే సీనియర్లు సజ్జల తాజా నియామకాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎవరి తీరుతో ఓటమి చెందామో.. అటువంటి వ్యక్తికి బాధ్యతలు ఇవ్వడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మొత్తానికైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సజ్జల నియామకం వివాదానికి దారి తీసినట్టు ఉంది.

# ఏపీకి వచ్చేస్తున్న ఫ్రీ బస్సులు

విజయవాడ, ఏప్రిల్ 15,

ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనపడుతుంది. ఆర్టీసీపై భారం పడకుండా ఎలక్ట్రికల్ త్తు బస్సులను రాష్ట్ర ప్రభుత్వం రెడీ చేస్తుంది. అయితే ఈ పథకం త్వరలోనే అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు తెలసింది. అందుకోసమే అంతా సిద్ధం చేసిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని నిర్ణయించి ఈ మేరకు ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మొదటి దశలో కొన్ని బస్సులను కొనుగోలు చేసిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు పంపుతూనిర్ణయం తీసుకుంది. తక్కువ ఖర్చుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు పథకం పై వివిధ రాష్ట్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఆర్టీసీపై భారం పడకుండా ఉండేందుకు కొన్నిముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. గత ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఎన్నికల ప్రచారంలో స్పష్టమైన ఇచ్చిన హామీ అమలు చేయకపోతే మహిళల్లో వ్యతిరేకత వస్తుందని భావించిన ప్రభుత్వం త్వరలోనే ఈ పథకాన్ని అమలుచేయాలని భావిస్తూ ఎలక్ట్రికల్ బస్సులను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల ఉచిత ప్రయాణం పెద్దగా ఖర్చు లేకుండానే, భారం ఆర్టీసీపైనా, ప్రభుత్వంపైన పడకుండానే నామమాత్రంగా వ్యయంఅవుతుందని ప్రభుత్వం అంచనాలు వేస్తుంది. నగరాలకు కేటాయించి...




అందులోనూ కొన్ని నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు భిన్నంగా తీసుకుంది. ఉచిత బస్సు ప్రయాణం జిల్లాల వరకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎక్కువగా సిటీ బస్సుల్లో ఎక్కువ మంది ఉచితంగా నిత్యం తిరిగే అవకాశముందని భావించిన ప్రభుత్వం మొదటి దశలో 750 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తుంది. ఇందులో వంద బస్సులు విశాఖపట్నానికి కేటాయించారు. మరో వంద బస్సులు విజయవాడకు ఇచ్చారు. గుంటూరుకు వంద, నెల్లూరుకు వంద, కర్నూలుకు యాభై బస్సులతో పాటు కాకినాడ, రాజమండ్రి, కడప మరియు అనంతపురం డిపోలకు 50 బస్సులు కేటాయించనున్నారు. తిరుపతితో పాటుమంగళగిరి డిపోలకు 50 బస్సులు కేటాయించారు. ఈ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్లు సంబంధిత డిపోలలో ఏర్పాటు చేయనున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్నచో?ట ఈ బస్సుల కేటాయింపు చేస్తూ భారం తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది

====================

## పుల్లయ్య బంజర గ్రామానికి చెందిన రైతు దంపతులు బొల్లం రామయ్య, చంద్రకళ ఆవేదన చూస్తే కడుపు తరుక్కుపోతున్నది.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

అకాల వర్షాలు, సాగు నీటి గోస, కరెంట్ కష్టాలను ఎదుర్కొని కౌలుకు తీసుకున్న 18 ఎకరాల్లో వరి సాగు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వ రూపంలో విపత్తు రైతన్నను నట్టేట ముంచింది.

కొండంత సంబురంతో పంటను కొనుగోలు కేంద్రానికి తరలించి 20 రోజులు గడిచినా ప్రభుత్వం పంట కొనుగోలు చేయలేదు.దీంతో అకాల వర్షం ఆ రైతన్నను నిండా ముంచింది. కష్టపడి పండించిన ధాన్యమంతా తడిసి ముద్దయింది.

ప్రభుత్వం ధాన్యం కొనకపోగా, పరిహారం కూడా చెల్లించకపోవడంతో తడిసిన ధాన్యం రాశి ముందు రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నదని మాజీమంత్రి హరీష్ రావు అన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవటం లేదని చెప్పడానికి ఈ రైతుల కన్నీటి దృశ్యమే ప్రత్యక్ష సాక్ష్యం.రైతుల జీవితాల్లో కాలం తెచ్చిన విపత్తు కాదు, కాంగ్రెస్ తెచ్చిన విపత్తు ఇది.నిన్నటిదాకా సాగునీరు ఇవ్వక సావగొట్టారు.కరెంట్ కోతలతో పంటలను ఎండగొట్టారు.కష్టించి పండించిన ధాన్యాన్ని కొనకుండా నేడుఅకాల వర్షాలపాలు చేసి ఆగం చేస్తున్నారు.నమ్మి ఓటేసినందుకు.. రైతుల గొంతు కోస్తున్నకాంగ్రెస్ సర్కారు దుర్మార్గ వైఖరిని యావత్ తెలంగాణ గమనిస్తున్నది.మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ పాలకులారా రైతన్న గోస ఇకనైనా పట్టించుకోండి. వారి కన్నీటి కష్టాలు తీర్చండి.

# నేటి విద్యార్థులను రేపటి భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల

ఏలూరు, ఏప్రిల్, 15:

నేటి విద్యార్థినీ, విద్యార్థులను రేపటి భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అన్నారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు 2 కోట్ల విలువైన ప్రయోగ పరికరాలను అందించే కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ పి.. ధాత్రిరెడ్డి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ లతో కలిసి స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ విద్యా ద్వారానే అభివృద్ధి సాధ్యమని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతిలో ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో మన దేశం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదన్నారు. పాఠశాలల స్థాయి నుండి విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించాలని, ప్రతీ విషయాన్నీ తెలుసుకోవాలనే ఉత్సుకతను విద్యార్థులలో రేకెత్తినప్పుడే వారు జీవితంలో ముందుకు వెళ్తారన్నారు. విద్యా, వైద్యం రంగాలలో ప్రజలకు ఉత్తమ సేవలందించడం ప్రభుత్వ ప్రాధాన్యతన్నారు. రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్ విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నారని, విద్యార్థులకు మంచి చదువుకునే వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. విద్యా బోధనలో ప్రయోగశాలలో నేర్చుకున్న విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు పేరుకుమాత్రమే ఉండేవన్నారు. , ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చి ప్రతీప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు, క్రీడామైదానాలు, అదనపు తరగతి గదులు వంటి మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు . తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్య అభ్యసించానని, తాను చదివిన పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ అందించానన్నారు. ఏలూరు జిల్లాలోని ప్రతీ మండలంలోనూ 2 ఉన్నత పాఠశాలలలను గుర్తించి, ఒకొక్క పాఠశాలకు 4 లక్షల రూపాయలు విలువ చేసే ప్రయోగ పరికరాలు అంధిస్తున్నానన్నారు. వీటిని చక్కగా వినియోగించుకుని విద్యార్థులు విద్యని అభ్యసించి అభివృద్ధిలోకి రావాలని, అదేసమయంలో సెల్ ఫోన్ లో సామజిక మాధ్యమాలకు బానిస కావద్దన్నారు.

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంపొందించే విధంగా 2 కోట్ల రూపాయలతో ప్రయోగ పరికరాలు అందించడం అభినందించదగిన విషయమన్నారు. జిల్లా పరిషత్ ద్వారా 50 లక్షల రూపాయలతో విజయకేతనం పుస్తకాన్ని విద్యార్థులకు అందించామని, వీటి వినియోగంతో పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెరిగిందన్నారు.

ఇంచార్జి జిల్లా కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి మాట్లాడుతూ క్లాస్ రూమ్ లో విన్న పాఠాలతో పాటు ప్రయోగాల ద్వారా తెలుసుకున్న జ్ఞానం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఏ రంగంలో అభిరుచి ఉందొ తెలుసుకుని, ఆ రంగంలో వారికి ఉత్తమ విద్యను అందించి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇంతటి ఉన్నత స్థానానికి చేరుకున్నానని, ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఉపాధ్యాయులు ఉ ంటారన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయి లక్ష్యాలను నిర్దేశించుకునేలా ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్య పరచాలన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇంటర్మీడియట్ లో హెచ్.ఈ.సి., సీఈ.సి.,కోర్స్ లను ప్రవేశపెట్టాలని, అదేవిధంగా క్రీడామైదానాన్ని ఏర్పాటు చేయాలనీ కోరాగా, పరిశీలించి వెంటనే ఏర్పాటుచేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా పాఠశాలలో ప్రయోగశాలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన షేక్ షాజితా, ఎండి. మొబినా లను దుశ్శాలువాతో ఎంపీ సత్కరించారు.

ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు అందరూ కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఇంచార్జ్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ లను దుశ్శాలువాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాఠశాల విద్యార్థినులతో సెల్ఫీ దిగి, ప్రతీ ఒక్కరి వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), డీఈఓ వెంకట లక్ష్మమ్మ,సర్వశిక్షా అభియాన్ ఏపిసి పద్మకుమార్, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ ఎం ఆర్ పెదబాబు, స్థానిక కార్పొరేటర్ టి. అరుణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ కుమార్, పూజారి నిరంజన్, ప్రభృతులు పాల్గొన్నారు.

## నగరి బస్టాండ్ లో అగ్నిమాపక వారోత్సవాలు

నగరి అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నగరి బస్టాండ్ లో విన్యాసాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అగ్నిమాపక వారోత్సవాలు నగరి బస్టాండ్ ప్రాంగణంలో ఫైర్ అవేర్నెస్ గ్యాస్ అవేర్నెస్ వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి సబ్ డిస్టిక్ డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సయ్యద్ అజీజ్ అహ్మద్ హాజరయ్యారు . అగ్నిమాపక సిబ్బంది నిర్వహించిన వారోత్సవాలు అగ్నిమాపక కేంద్ర అధికారి సుబ్బరాజ్ ఆధ్వర్యంలో జరిగింది.

# లిక్కర్ స్కాంలో రహస్యంగా విచారణ

నెల్లూరు, ఏప్రిల్ 15,

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాంలో కీలక నిందితుడిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి కోసం సిట్ బృందాలు గాలింపు ప్రారంభించాయి. హైదరాబాద్‌లో అరెటా హాస్పిటల్‌తో పాటు మరికొన్ని చోట్ల సిట్ బృందాలు సోదాలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో రాజ్ కసిరెడ్డి ఇల్లు, ఆఫీసుల్లోనూ సోదాలు చేస్తున్నారు. దాడుల్లో పాల్గొంటున్న సుమారు 10 నుంచి 15 సిట్ బృందాలు పాల్గొంటున్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డి లిక్కర్ స్కాంపై సిట్ విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఆయన ముందస్తు బెయిల్ విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించినా విచారణకు హాజరు కావడం లేదు. ఏపీ మద్యం స్కాంలో సైలెంట్‌గా సీఐడీ సిట్ తన తాను పని చేసుకుపోతోంది. కీలక పాత్రధారులకు నోటీసులు జారీ చేస్తోంది. వారంతా కోర్టుకు వెళ్తున్నారు. కానీ హైకోర్టులో మాత్రం సానుకూల ఫలితం రావడం లేదు. ఏపీ లిక్కర్ స్కాంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంటూ విజయసాయిరెడ్డి గతంలో ప్రకటించారు. రాజ్ కసిరెడ్డిపై సీఐడీ ఎప్పుడో దృష్టి పెట్టింది. నోటీసులు జారీ చేసింది. ఆయన నోటీసులను తాజాగా హైకోర్టులో సవాల్ చేశారు. తనపై దూకుడైన చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసి ఆయన పిటిషన్ డిస్మిస్ చేసింది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి జగన్ ఐటీ సలహాదారుగా నియమించారు. ఏపీ లిక్కర్ స్కాంపై సీఐడీ చాలా లోతుగా దర్యాప్తు చేసింది. చాలా విషయాలు వెలుగులోకి తెచ్చిందని చెబుతున్నారు. ఏపీబీసీఎల్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మొత్తం వ్యవహారాలపై రోజుల తరబడి స్టేట్ మెంట్ ఇచ్చారు. న్యాయమూర్తి ముందు కూడా వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ స్కాంలో కీలకంగా ఉన్న వారి గుట్టు అంతా బయటపడుతోందని చెబుతున్నరా?. ఇప్పటికే మిథున్ రెడ్డికి ఈ స్కాంలో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఆయన సుప్రీంకోర్టు నుంచి రిలీఫ్ తెచ్చుకున్నారు. వైసీపీ హయాంలో లిక్కర్ పాలసీపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి . వైసీపీ గెలవగానే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. మద్యనిషేధం పేరిట దుకాణాలు తగ్గిస్తామని చెప్పి ఈ నిర్ణయం తీసుకున్నారు. అనూహ్యంగా బయట దొరికే బ్రాండ్ల మద్యం మొత్తం ఏపీలో బ్యాన్ చేశారు. కేవలం కొన్ని కంపెనీలు.. అది కూడా ఏపీ లోనే మద్యం అమ్మే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చారు. అవన్నీ వైసీపీ నేతలవన్న ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిపై దర్యాప్తు ప్రారంభించింది. ఈడీ కూడా విచారణ చేయాలని సిఫారసు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కు సంబంధించి హైదరాబాద్ లో ఏపీ సిట్ బృందాలు సోదాలు జరుపుతున్నాయి. రాజ్ కసిరెడ్డి కోసం హైదరాబాద్ లో గాలిస్తున్నాయి. రాయదుర్గం పోలీసుల సాయంతో అరెటా ఆసుపత్రిలో ఏపీ సిట్ బృందాలు సోదాలు చేశాయి. రాజ్ కసిరెడ్డి




కుటుంబసభ్యులు అరెటా ఆసుపత్రిలో డైరెక్టర్లుగా ఉన్నారు. విచారణకు హాజరుకాకుండా కసిరెడ్డి హైదరాబాద్ లో తలదాచుకున్నట్లు సిట్ అనుమానిస్తోంది.ఏపీ లిక్కర్ స్కామ్ లో రాజ్ కసిరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు గుర్తించాయి. జూబ్లీహిల్స్ తో పాటు గచ్చిబౌలి, ఫైనాన్స్ డిస్ట్రిక్ లో ఏపీ సిట్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. రాజ్ కసిరెడ్డి దేశం దాటి వెళ్లకుండా ఇప్పటికే ఎల్‌ఓసీ ఇచ్చారు ఏపీ పోలీసులు. సిట్ విచారణకు హాజరుకావాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ తప్పించుకుని తిరుగుతున్నారు రాజ్ కసిరెడ్డి. జూబ్లీహిల్స్ లోని రాజ్ కసిరెడ్డి నివాసానికి ఏపీ సిట్ బృందం నోటీసులు అంటించనుంది.

## వైఎస్ వివేకా హత్య కేసు - నిందితుడు ఉదయ్‌కుమార్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ

వివేకా హత్య కేసు నిందితుడు గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఉదయ్‌కుమార్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని వివేకా కుమార్తె సునీత వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. వివేకా హత్య కేసులో ఉదయ్‌కుమార్‌రెడ్డి పాత్రపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆరా తీశారు.

వివేకా హత్య జరిగిన తర్వాత గాయాలు కనపడకుండా కట్లు కట్టి తప్పుడు ప్రచారం చేసిన వారిలో ఉదయ్ కూడా ఉన్నారని సునీత తరఫు న్యాయవాదులు ధర్మాసనానికి తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్లను అవినాష్‌రెడ్డి, ఇతర నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లకు జత చేస్తామని వెల్లడించింది. గత పిటిషన్లతో ఈ వ్యాజ్యాన్ని జత చేయాలని ఆదేశించిన ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం, తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఆసుపత్రిలో రోగి మృతి..బంధువుల అందోళన

హైదరాబాద్

లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో హై కేర్ హాస్పిటల్ లో రోగి మృతి చెందడం వివాదస్పదమయింది. కార్వాన్ భాంజావాడిలో ఉండే ఎల్లయ్య ఆయాసంగా ఉందని లంగర్ హౌస్ హై కేర్ హాస్పిటల్ కి చెక్ అప్ కోసం వచ్చాడు. వైద్యులు ఈసీజీ చేసిన పిమ్మట ఎలాంటి ప్రమాదం లేదని 24 గంటలు అబ్జర్వేషన్ లో పెట్టాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. కాసేపు గడిచాక వ్యక్తి ఆరోగ్యం మరింత క్షీణించుకోగా తమ వద్ద కార్డియో స్పెషలిస్ట్ లేదని వెంటనే తీసుకొని పోవాలని బంధువులను కోరారు. అంతలోనే సదరు వ్యక్తి మృతి చెందడంతో హాస్పిటల్ ఎదుట పెద్ద ఎత్తున మృతుడి బంధువులు చేరుకొని ధర్నా నిర్వహించారు. .

# 19వతేదీన ఏం జరగబోతోంది... విదేశీ టూర్ లలో కార్పొరేటర్లు

విశాఖపట్టణం, ఏప్రిల్ 15,

స్టీల్ సిటీలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. వైసీపీకి విశాఖలో మరో షాక్ తగిలింది. ఊహించినట్లుగానే ఆ పార్టీ నుంచి కార్పొరేటర్లు ఒక్కరొక్కరుగా చేజారిపోతున్నారు. తాజాగా వైసీపీ కార్పొరేటర్ తిప్పల వంశి జనసేన గూటికి చేరారు. మాజీ మంత్రి జనసేన నాయకుడు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు. 74వ వార్డు కార్పొరేటర్ గా కొనసాగుతున్న వంశీ వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనయుడు.తిప్పలనాగిరెడ్డి తొలి నుంచి వార్డు అభివృద్ధిపై తమకు నిధులు కేటాయించడం లేదన్న అసంతృప్తితో రగిలిపోతున్నారంట. నిధుల కేటాయింపు విషయమై వంశీ కౌన్సిల్ సమావేశాల్లో పలు సందర్భాల్లో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐనా ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో చివరకు పార్టీ మారాలని నిర్ణయించుకొని జనసేనలో చేరిపోయారు. వంశీ జనసేనలో చేరడంతో గ్రేటర్ పీఠం కూటమి కైవసం చేసుకోబోతుందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమయం దగ్గర పడుతుండడంతో నగరంలో పాలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. ఈనెల 19న అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఓటింగ్ జరగనుంది. దీంతో కొద్దిరోజులుగా క్యాంపు రాజకీయాలు ఊపందుకున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గి మేయర్ పీఠం దక్కించుకుంటామని టిడిపి బలంగా చెబుతోంది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పదవిని నిలుపుకుంటామని వైసీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. రెండు పార్టీలు క్యాంప్ రాజకీయాలకు తెరలేపాయి. కొంతమంది కార్పొరేటర్లను విదేశాలకు తరలించినట్లు జోరుగా ప్రచారం కూడా సాగుతోంది. అయితే మేయర్ పీఠం కైవసం చేసుకోవడానికి 74 మంది సభ్యుల అవసరంకాగా..ఇప్పటికే కూటమికి 70 మంది సభ్యులు సహకారం ఉంది.వీరితో పాటు మరో ఐదుగురు వైసీపీ సభ్యులు తమతో టచ్ లో ఉన్నారని పలు సందర్భాల్లో కూటమి నేతలు చెబుతున్నారంట. దీనికి తగ్గట్టుగానే వంశీ పార్టీ మారడంతో వైసీపీ వర్గాల్లో టెన్షన్ స్టార్ట్ అయిందట. దీంతో కార్పొరేటర్లు జారిపోకుండా శ్రీలంకలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అటు కూటమి సైతం మలేసియాలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. జనసేన సైతం కౌలాలంపూర్ లో స్పెషల్ క్యాంపును ఏర్పాటు చేసిందట. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని వైసీపీ దక్కించుకుంది. 98 డివిజన్లు ఉన్న గ్రేటర్ విశాఖలో..58 డివిజన్లలో వైసీపీ విజయం సాధించింది. టిడిపి 29 స్థానాలకు పరిమితం అయింది. జనసేన మూడు చోట్ల గెలిచింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చాలామంది వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరారు. టీడీపీతో పాటు జనసేనలోకి అధిక సంఖ్యలో చేరడంతో కూటమి బలం పెరిగింది.దీనికి తోడు కూటమికి చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు ఉన్నారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా వారు సైతం ఓటింగ్ కు వచ్చే అవకాశం ఉంది. అయితే వైసీపీ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చాలామంది కార్పొరేటర్లు..ముఖం చాటేస్తున్నారంట. బహిరంగంగానే తాము కూటమికి మద్దతు తెలుపుతామని కొంతమంది చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఈనెల 19న జరిగే అవిశ్వాస తీర్మానం ఓటింగ్ లో కూటమి నెగ్గడం ఖాయమనే చర్చ నడుస్తోంది. మరి 19న జరిగే అవిశ్వాస తీర్మానంతో విశాఖ నగర పొలిటికల్ సీన్ మారుతుందా లేదా? ఆ రోజు అసలేం జరుగుతుందో చూడాలి.

# భర్తే...యముడు... ఇంట్లో చెప్పకుండా రెండేళ్లు మేనేజ్

విశాఖపట్టణం, ఏప్రిల్ 16,

వారిద్దరి కులాలు వేరు.. మనసులు కలిశాయి.. పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయ్యారు. పెళ్లి జరిగి రెండేళ్లు అయ్యింది. ఈ విషయాన్ని భర్త తల్లిదండ్రులకు చెప్పకుండా మేనేజ్ చేశాడు. భార్య గర్భవతి అయ్యింది. రేపో మాపో పండంటి బిడ్డకు జన్మ ఇవ్వనుంది. అంతలో కట్టుకున్న భార్యని ఆ లోకం నుంచి పంపించేశాడు భర్త. సంచలన రేపిన ఈ ఘటన విశాఖ సిటీలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన కథనం ప్రకారం.. దువ్వాడకు చెందిన జ్ఞానేశ్వర్, సిటీలోని ఓ ప్రాంతానికి చెందిన అనూషను ప్రేమించాడు. అనూష తల్లికి చూపు మందగించింది. నాలుగేళ్ల కిందట తండ్రి చనిపోయాడు. ఆ ఇంటికి ఆమె పెద్ద దిక్కు అయ్యింది. మూడేళ్ల కిందట జ్ఞానేశ్వర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే వీరిద్దరు కులాలు వేరు వేర్వేరుజ్ఞానేశ్వర్ రెండు ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు నడుపుతున్నాడు. డబ్బులకు కొదవలేదు. పెళ్లి జరిగి మూడేళ్లు గడిచినా భార్యను తల్లిదండ్రులకు పరిచయం చేయలేదు జ్ఞానేశ్వర్. పెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకుండా సిటీలో ఉ ద్యోగం చేస్తున్నానని వారిని నమ్మించాడు. అత్తమామల వద్దకు వెళ్దామని భార్య ఎప్పుడు అడిగినా రకరకాల కారణాలు చెప్పి తప్పించుకునేవాడు.భార్య అనూష గర్భవతి అయ్యింది. ప్రస్తుతం ఎనిమిదో నెల. వచ్చేవారంలో ఆమెకి డెలివరీ డేట్ ఇచ్చారు డాక్టర్లు. ఇప్పుడున్న సమయంలో భార్య డెలివరీ అయితే తల్లిదండ్రులతో లేనిపోని సమస్యలు వస్తాయని భావించాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భార్యని ఏదోవిధంగా చంపేయడమే బెటరని నిర్ణయానికి వచ్చాడు.భార్యను వదిలించుకునేందుకు రకరకాల స్కెచ్‌లు వేశాడు. తనకు క్యాన్సర్ వచ్చిందని ఒకసారి, విడాకులు తీసుకుని వేరే పెళ్లి చేసుకోవాలని భార్యను కన్వీన్స్ చేసే ప్రయత్నం చేసేవాడు. అందుకు భార్య ససేమిరా చెప్పింది. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి.గర్భిణిగా ఉన్న అనూషకు నెలలు నిండాయి. సోమవారం ఆమెని ఆసుపత్రిలో చేరాల్సి ఉంది. అక్కడే తన స్కెచ్‌ని పక్కాగా అమలు చేశాడు జ్ఞానేశ్వర్. ఆసుపత్రికి తోడు తీసుకెళ్లేందుకు అమ్మమ్మను రెండు రోజుల కిందట ఇంటికి పిలిచాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తలు కలిసి నిద్రపోయాడు. ఇదే సరైన సమయమని భావించాడు భర్త.సోమవారం వేకువజామున నిద్రలో ఉన్న భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. తెల్లారిపోయింది.. మనుమరాలు నుంచి కనీసం ఉలుకు పలుకు లేదు. దీంతో వాళ్ల అమ్మమ్మ కంగారుపడి జ్ఞానేశ్వర్‌ను పిలిచింది. పైకి ఏమీ తెలియనట్టు స్థానికులతో కలిసి భార్యను కేజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.దీనిపై స్థానికుల్లో అనుమానాలు మొదలయ్యాయి. చివరకు ఈ వ్యవహారం పోలీసుల వద్దకు చేరింది. జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పీఎం పాలెం పోలీసులు. దీంతో అసలు విషయం బయటపడింది. ప్రేమ పేరుతో అనూషను నమ్మించి మోసం చేశానని తెలిపాడు. ఆమెని వదిలించుకునే ప్రయత్నంలో హత్య చేసినట్టు అంగీకరించాడు.

## ఐదు రోజులపాటు విదేశీ పర్యటనలో చంద్రబాబు కుటుంబం

అమరావతి17 వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు విదేశాల కు ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం వెళుతుంది. ఈనెల 20 వ తేదీన సీఎం చంద్రబాబు 75 వ వజ్రోత్సవ జన్మదినోత్సవం సందర్భంగా కుటుంబం తో విదేశాలకు వెళతారు. 75 వ జన్మదినోత్సవానికి అమరావతి లో ఉంటే ఎక్కువ హడావుడి చేసే అవకాశం కు తావివ్వకూడదన్న ఆలోచనలో సీఎం వున్నట్లు సమాచారం. ఏటా కుటుంబం తో ఐదు రోజుల పాటు విదేశాల్లో గడిపే ఆనవాయితీ నేపద్యం కూడా. 17 వ తేదీ ఉదయం 1.15 గంటలకు ఢిల్లీ ఎయిర్పోర్ట్ నుంచి విదేశాలకు వెళ్లి 21 వ తేదీ అర్ధరాత్రి తిరిగి రానుంది ముఖ్యమంత్రి కుటుంబం. చంద్రబాబు వెంట లోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్ కుడా వెళ్లనున్నారు

# వైభవంగా లేడీ అఘోరి పెళ్లి:

హైదరాబాద్

లేడీ అఘోరి అలియాస్ శ్రీనివాస్ పెళ్లి చేసుకున్న వీడియో సోషల్ మీడియా లో ఇప్పుడు వైరల్ గా మారింది. ఆంధ్రప్రదేశ్ కు చెందిన వర్షిని అనే యువతని లేడీ అఘోరి పెళ్లి చేసుకుంది,

దీంతో తెలుగు రాష్ట్రాల్లో లేడీ అఘోరీ అలియాస్ శ్రీనివాస్ అంశం హాట్ టాపిక్‌గా మారింది..ఇప్పటికే పలు వివాదాలకు మూల కారణమైన అఘోరీ మరో సంచలనానికి తెర లేపింది. ఈ క్రమంలోనే ఏపీకి చెందిన వర్షిణి అనే యువతిని గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి చేసుకుంది.ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఓ చిన్న ఆలయంలో అఘోరీ, వర్షిణీ మెడలో తాళికట్టగా..ఇద్దరూ ఒకరికొకరు దండలు మార్చుకున్నారు. అనంతరం తలంబ్రాలు పోసుకోవడంతో పాటు ఏడడుగులు కూడా కలిసి నడిచిన దృశ్యాలు ఆ వీడియోలో దర్శనమిచ్చాయి.

అక్కడే ఉన్న పలువురు భక్తులు ఉత్సహంగా భక్తి పాటలు పాడుతూ వారిని ఆశీర్వదించారు.కాగా నందిగామలో వివస్త్రగా ఉన్న సమయంలో వర్షిణీ ముందుకొచ్చిన అఘోరీకి సాయం చేసింది. అనంతరం వారి మధ్య పరిచయ కాస్త ప్రేమగా మారింది.

ఈ క్రమంలోనే అఘోరీ, వర్షిణీని గుజరాత్‌లోని సౌరాష్ట్రకు తీసుకెళ్లింది. అయితే, తమ కుమార్తెకు లేనిపోని మాయమాటలు చెప్పి అఘోరీనే ఎత్తుకెళ్లాడంటూ వర్షిణీ కుటుంబ సభ్యులు రెండు రాష్ట్రాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆ తర్వాత కుటుంబ సభ్యులే స్వయంగా గుజరాత్‌కు వెళ్లి వర్షిణీకి నచ్చజెప్పి ఇంటికి తీసుకువచ్చారు. కొన్నాళ్లు బాగానే ఉన్న వర్షిణీ మళ్లీ ఇంట్లో నుంచి చెప్పాపెట్ట కుండా వెళ్లిపోయింది రెండు రోజుల క్రితం అఘోరీ తో మళ్లీ పెళ్లితో దర్శనమి చ్చింది.

==============================

# వృద్ధురాలిని చంపి.. మృతదేహంపై డాన్సు చేసి?

మేడ్చల్ ఏప్రిల్ 15,

కుషాయిగూడలో కిరాతకం బయటపడింది. ఒక యువకుడు 70 ఏళ్ల వృద్ధురాలిని చంపి మృతదేహంపై డాన్సులు చేసాడు. మృతదేహంపై డాన్సులు చేస్తూ సెల్ఫీ వీడియో తీసాడు. సెల్ఫీ వీడియోలని తన మిత్రులందరికీ షేర్ చేసాడు. ఒంటరిగా ఉంటున్న కమలను యువకుడు ఉరివేసి హత్య చేసాడు. హంతకుడు కమలాదేవి కి చెందిన షాపులో రెంటుకు ఉంటున్నాడు. అద్దె విషయంలో యువకున్ని వృద్ధురాలు కమలాదేవి మందలించింది. దాంతో ఆమెపై యువకుడు కక్ష పెంచుకున్నాడు. 11వ తేదీన వృద్ధురాలని చంపి తాళం వేసి పారిపోయాడు. ఇంట్లోంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని రికవరీ చేసుకొని పోస్టుమార్టం కోసం పంపారు. యువకుడు పంపిన వీడియో బెంగళూరులో వైరల్ కావడంతో పోలీసులకు సమాచారం చేరింది. హంతకుడికోసం పోలీసులు గాలిస్తున్నారు.

# బెదిరించే వాళ్ల పేర్లు పింక్ బుక్ లో రాసుకుంటున్నాం

బాన్సువాడ

ఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేసారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు.బాన్సువాడలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆమె పాల్గోన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటాం. బెదిరింపులకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదని అన్నారు. కేసులు పెట్టించే పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఎవరైనా ఊరుకునేదే లేదు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదు. వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు ఎవరు దిగొచ్చినా కూడా భయపడేవాళ్లెవరూ లేరు ఇక్కడ . మాట తప్పడమే... మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలి. ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలి . తెలంగాణ గడ్డ మీద అగ్గిపెట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నలిగిపోయిన ఆత్మగౌరవాన్ని రెపరెపలాడించింది బీఆర్ఎస్ పార్టీ. స్వతంత్ర దేశంలో లక్ష్యాన్ని చేరిన ఒకేఒక పోరాటం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమం మాత్రం. వీరులు మాత్రమే లక్ష్యం చేరే వరకు పోరాటం చేస్తారు... అది కేసీఆర్ తో మాత్రమే సాధ్యమైంది. ప్రజాస్వామ్య పంథాను నమ్ముకొని హింసాయుతంగా పోరాటం చేసి తెలంగాణ సాధించాము. త్యాగాలతో తెలంగాణ కోసం కేసీఆర్ మొదటి అడుగు వేశారని అన్నారు.

కేంద్ర మంత్రి పదవిని సైతం గడ్డిపోచలా వదిలేసిన ఘనత కేసీఆర్ ది. ఎవరో భిక్షపెడితేనో, ఎవరో దయదలచి ఇస్తే తెలంగాణ రాలేదు. కేసీఆర్ త్యాగం, కృషి, పోరాటపటిమ వల్ల తెలంగాణ సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెలంగాణలో కటిక చీకటి వస్తుంది, నక్సలైట్ల రాజ్యం వస్తుంది అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత వెలుగు జిలుగుల తెలంగాణను తయారు చేసుకున్నాం.బ కోటి ఎకరాల మాగాణను తయారు చేసుకున్నాం. సాగు నీళ్ల పన్ను మాఫీ చేసిన వ్యక్తి కేసీఆర్. రైతు బంధు, రైతు బీమా వంటి అనేక కార్యక్రమాలను కేసీఆర్ చేపట్టారు. చివరి గింజ వరకు వడ్లు కొని చరిత్ర సృష్టించింది కేసీఆర్ అని అన్నారు.

# మంత్రి రాంప్రసాద్ రెడ్డిపై విమర్శలు తగదు

కడప మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పై మంత్రి కుటుంబం పై అసత్య నిరాధారణ ఆరోపణలు చేయడం వైసీపీ మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి కి తగదని లక్కిరెడ్డిపల్లి టిడిపి మండల ఇంచార్జ్ మదన్మోహన్, టిడిపి నాయకులు హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో వైసిపి మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి వ్యతిరేకంగా టిడిపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి విసిరిన సవాలను తాము స్వీకరిస్తున్నామన్నారు. వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు మా మంత్రి అవసరం లేదని తామే సిద్ధమన్నారు. 2024 ఎన్నికల్లో నువ్వు వైసీపీ నుంచి 11 కోట్లు డబ్బులు తీసుకున్నావనీ రాయచోటి వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తమ నాయకుడు 40 లక్షలు రూపాయలు తీసుకున్నాడని నిరూపించేందుకు వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేయడానికి నువ్వు సిద్ధమా అంటూ మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డికి సవాల్ విసిరారు. తమ నాయకుడి నీతి, నిజాయితీ గురించి రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కూడా మీరు మీ పనులు మీరు చేసుకుంటూ పోయారన్నారు. తమ నాయకుడు ఎవ్వరి కాళ్లు పట్టుకుని టికెట్ తెచ్చుకోలేదన్నారు. మీరు ఎవరి కాళ్లు పట్టుకొని నాలుగు సార్లు ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్నారో చెప్పాలంటూ రమేష్ కుమార్ రెడ్డి ని సూటిగా ప్రశ్నించారు. ప్రజా ఆదరణ, సమర్థమంత నాయకుడు కాబట్టే అధినేత చంద్రబాబు నాయుడు తమ నాయకుడికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారన్నారు. వైసిపికి పంచుకోటగా ఉన్న రాయచోటిలో తమ నాయకుడికి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారన్నారు. మంత్రి చేపట్టే అభివృద్ధి ని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారనీ ఇకమీదట మంత్రి పై, మంత్రి కుటుంబం పై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు.

==============================


# ఏపీలో ఐదు చోట్ల రోప్ వేలు

కర్నూలు, ఏప్రిల్ 15,

ఏపీలో( కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే సీ ప్లేన్ తో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలను కలుపుతూ మార్గాన్ని ఏర్పాటు చేసింది. విజయవంతంగా సి ప్లేన్లను నడుపుతోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి రాష్ట్రవ్యాప్తంగా రోప్ వేల నిర్మాణం పై ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎందుకు సంబంధించి నేషనల్ హైవే లాజిస్టిక్ అథారిటీతో ఒప్పందం చేసుకుంది రాష్ట్ర ప్రభుత్వం.రోప్ వేలు ఇప్పటికే విశాఖ నగరంలో అందుబాటులో ఉన్నాయి. నగరంలోని కైలాసగిరి వద్ద వీటిని ఏర్పాటు చేశారు. పర్యాటకులను సైతం ఆకట్టుకుంటున్నాయి. అయితే తాజాగా ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం, నంద్యాల జిల్లాలోని అహోబిలం, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. రూప్ వేలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును తీసుకొస్తోంది కూటమి ప్రభుత్వం.2014లో టిడిపిఅధికారంలోకి వచ్చింది. ఆ సమయంలోనే ఈ ప్రాజెక్టుల కోసం ప్లాన్ చేసింది. అప్పటిలో నివేదికలను సైతం రూపొందించింది. అయితే తర్వాత వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో కొంత కదలిక వచ్చింది. ఇప్పటికే పర్యాటక శాఖ అధికారులు కొన్ని ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. ఒకటి రెండు చోట్ల డిపిఆర్లను సైతం తయారు చేశారు. జాతీయ రహదారుల లాజిస్టిక్ అథారిటీతో మాట్లాడిన తర్వాత రూప్ వేల నిర్మాణానికి అడుగులు వేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు భావిస్తున్నారు. అవసరం అనుకుంటే ప్రభుత్వం సైతం నిధులు వెచ్చించేందుకు ఆలోచన చేస్తోంది. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పాలనలో పర్యాటక రంగానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవు. ఆ శాఖలో అభివృద్ధి కూడా అంతంతమాత్రంగానే ఉండేది. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంపై దృష్టి పెట్టడం విశేషం. మరోవైపు రాష్ట్రంలో డ్రోన్ రంగంలో పెట్టుబడిదారులు, వ్యాపారులు, ప్రజలను అనుసంధానం చేసేందుకు ఏపీ డ్రోన్ మార్ట్ పేరిట ఓ పోర్టల్ ను డ్రోన్ కార్పొరేషన్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. డ్రోన్ల తయారీ రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తగిన ప్రతిపాదనలతో రావాలని సంస్థ కోరింది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం డ్రోన్ల హబ్ గా అమరావతిని తీర్చిదిద్దాలని భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది

# అశోక్ గజపతి రాజుకు గవర్నర్ గిరీ.?

విజయవాడ, ఏప్రిల్ 15,



కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంకీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా ఏపీ విషయంలో అత్యంత శ్రద్ధతో ఉంది. మోదీ నేతృత్వంలో వరుసగా మూడుసార్లు ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. అయితే గత రెండుసార్లు ఏపీకి ఎటువంటి ప్రాధాన్యం దక్కలేదు. అయితే ఈసారి మాత్రం ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు ప్రధాని మోదీ. ఎన్డీఏ లో టిడిపి కీలక భాగస్వామి కావడమే అందుకు కారణం. అయితే ఈసారి రాజకీయంగా కూడా ఏపీకి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తున్నారు. గవర్నర్ పోస్ట్ ఒకటి టీడీపీకి కేటాయించాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ తరుణంలో గవర్నర్ పోస్ట్ ఎవరికి ఇస్తారు? అన్నది హాట్ టాపిక్ అవుతోంది.తెలుగుదేశం పార్టీలోగవర్నర్ పోస్ట్ కు ఇద్దరు పెద్దలు వేచి చూస్తున్నారు. అందులో పూసపాటి అశోక్ గజపతిరాజు ఒకరు. మరొకరు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు. ఇద్దరు నేతలు సమకాలీకులే. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వారే. ఆ ఇద్దరు నేతలు ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. వారసులను బరిలో దించి రిలాక్స్ అయ్యారు. ఇద్దరు కూడా గౌరవప్రదమైన పదవి విరమణ కోరుకుంటున్నారు. గవర్నర్ పోస్టును ఆశిస్తున్నారు. ఇప్పటివరకు రాజకీయాల్లో మునిగిపోయిన వారు.. రాజ్ భవన్ లో అడుగు పెట్టాలని ఆశపడుతున్నారు.అయితే విశ్వసనీయ సమాచారం మేరకు అశోక్ గజపతిరాజు వైపు చంద్రబాబు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం గవర్నర్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్రం నుంచి సంకేతాలు వచ్చాయి. తమిళనాడు గవర్నర్ రవిని పక్కన పెడుతున్న తరుణంలో అక్కడ మంచి వ్యక్తిని గవర్నర్ గా నియమించాలన్నది కేంద్ర ప్రజల ప్లాన్. అందుకు అశోక్ గజపతి రాజు అయితే సరిపోతారని ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అశోక్ విషయంలో చంద్రబాబుతో పాటు లోకేష్ సానుకూలంగా ఉన్నారు. పార్టీని ఇరుకున పెట్టేలా ఎప్పుడు అశోక్ గజపతిరాజు వ్యవహరించలేదు. పార్టీతో పాటు అధినేత పట్ల విధేయతతోనే ఉన్నారు. అందుకే అశోక్ పెద్దరికాన్ని గౌరవించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది.మరోవైపు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పేరు గవర్నర్ పోస్ట్ కు పరిశీలనలోకి ఉంది. ఇటీవల ఎమ్మెల్సీగా ఉన్న యనమల పదవీ విరమణ పొందారు. పార్టీతో పాటు అధినేతతో గ్యాప్ ఉందన్నది ఒక ప్రచారం. ఈ తరుణంలో స్వీయ చరిత్రను రాసుకున్నారు యనమల రామకృష్ణుడు. అందులో ఎన్టీఆర్ కంటే చంద్రబాబు పాలనా దక్షుడు అంటూ కొనియాడారు. కానీ ఎందుకో దీనిపై స్పందించలేదు చంద్రబాబు. కనీసం లోకేష్ సైతం నోరు తెరవలేదు. పైగా యనమల కుమార్తె దివ్య పై ఫిర్యాదులు వస్తున్నాయి. అందుకే యనమలను వదిలించుకునేందుకు చంద్రబాబు సిద్ధపడినట్లు ప్రచారం నడుస్తోంది. అయితే యనమల మాత్రం పార్టీతో విభేదాలు పెట్టుకొని అనవసరంగా ఇబ్బందులు పడకూడదని భావిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే ఇద్దరు సీనియర్ల లో ఒక్కరి వైపు మాత్రమే చంద్రబాబు మొగ్గుచూపుతుండడం విశేషం.

# 1,213 ఎకరాల్లో గులాబీ సమావేశం

వరంగల్, ఏప్రిల్ 15,

14ఏళ్ల ఉద్యమం.. పదేళ్ల అధికారం.. ఇప్పుడు ప్రతిపక్షంగా కదనోత్సాహం.. మొత్తంగా గులాబీసేన 25వసంతాలు పూర్తి చేసుకుంటోంది. అధికార పార్టీగా పదేళ్లపాటు పండగలా ఆవిర్భావ వేడుకలు చేసుకున్న కారు పార్టీ.. ఇప్పుడు విపక్షంగా రజోత్సవ వేడుకలకు సిద్ధమవుతోంది. ఉద్యమకాలం నుంచి సెంటిమెంటల్‌గా కలిసొచ్చిన వరంగల్, కరీంనగర్ జిల్లాలనే.. ఈ వేడుకలకు వేదికగా ఎంచుకున్న గులాబీపార్టీ.. అక్కడి నుంచే మరో అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకుంది. ఉమ్మడి జిల్లాల మధ్య పొలిమేరల్లోనే మహాసభ నిర్వహణకు జోరుగా ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఈసారి బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు? రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఉద్యమ పార్టీగా, అధికారపక్షంగా ఇంతకు ముందు ఒకెత్తు.. ఇప్పుడు ప్రతిపక్షంగా మరో ఎత్తు. అందులోనూ 25ఏళ్ల రజతోత్సవ పండగ. అందుకే, మహాసభ నిర్వహణ ద్వారా.. తెలంగాణ నలుమూలల నుంచి కార్యకర్తలను, ప్రజలను రప్పించాలని చూస్తోంది గులాబీ సేన. అధికారంలో ఉండి ఉంటే ఆ రేంజ్ వేరేలా ఉండేది. కానీ ఇప్పుడు ప్రతిపక్షంగా.. ఎన్నో అడ్డంకులను అధిగమించి అనుకున్న స్థాయిలో మహాసభను విజయవంతం చేయడం పెద్ద టాస్క్ అనే చెప్పాలి. అందుకే, బీఆర్ఎస్ సభ ఇప్పుడు అటు రాజకీయవర్గా?ల్లోనూ, ప్రజల్లోనూ హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే అన్ని జిల్లాలోనూ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న గులాబీ హైకమాండ్? అధికారం ఉన్నా, లేకున్నా.. బహిరంగసభల నిర్వహణలో మనల్ని కొట్టేటోడు లేరన్నట్టుగా మనోధైర్యాన్ని పార్టీ శ్రేణుల్లో నింపే ప్రయత్నం చేస్తోంది.ఆవిర్భావం నుంచి నేటి దాకా.. ఎన్నో ఒడిదుడుకుల్ని చూసిన బీఆర్ఎస్‌కు.. ఓటములు కొత్తకాకపోవచ్చు. కానీ, ఇటీవల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన వరుస ఓటములు.. పార్టీ శ్రేణుల్లో తీవ్రనిరాశను నింపాయనే చెప్పాలి. అప్పట్నుంచి అధినేత కేసీఆర్ అడపాదడపా ఫామ్‌హౌజ్‌కు వచ్చిన నాయకులను ఉద్దేశించి మాట్లాడటమే తప్ప? బయటకు మాత్రం రాలేదు. దీంతో ఏప్రిల్ 27న జరగబోయే పార్టీ 25 వసంతాల వేడుకలో ఆయన ఏం మాట్లాడబోతున్నారనే ఆసక్తి గులాబీ శ్రేణులతో పాటు, ప్రజలు, అటు ప్రత్యర్థివర్గాల్లోనూ వ్యక్తమవుతోంది.ఉద్యమ ఆరంభం నుంచి బీఆర్ఎస్‌కు వెన్నంటి నిలిచిన కరీంనగర్, వరంగల్ జిల్లాలంటే.. గులాబీసేనకు విపరీతమైన సెంటిమెంట్. ఏ ఉప ఎన్నికలు వచ్చినా.. ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా.. ఇక్కణ్నుంచే సింహనాదం పూరించేవారు కేసీఆర్. గతంలో ఇక్కడ బీఆర్ఎస్ నిర్వహించిన సభలు సక్సెస్ అయిన తీరు కూడా అదే రుజువు చేస్తున్నాయ్. అందుకే అదే సెంటిమెంట్‌ను కంటిన్యూ చేస్తూ? వరంగల్ ? కరీంనగర్ జిల్లాల పొలిమేరల్లోనే ఈ మహా బహిరంగసభకు సన్నాహాలు చేస్తోంది బీఆర్ఎస్. దీని ఏర్పాటు మొదలు నిర్వహణవరకు.. అన్ని బాధ్యతలూ వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలకు అప్పగించిన అధినేత.. ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నారు.ఔఊ 563, ఎల్కతుర్తి గ్రామ శివారులోని 1,213 ఎకరాల్లో బీఆర్ఎస్ బహిరంగ సభ జరగనుంది. ఇందులో 159 ఎకరాల్లో సభా ప్రాంగణం ఉంటే.. మిగితా స్థలాన్ని పార్కింగ్, భోజనశాలలు, ఇతర సదుపాయాలను కల్పించేందుకు వాడుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలను, సాధారణ ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను, ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేస్తోంది బీఆర్ఎస్ అధినాయకత్వం. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతుండటంతో.. ఈ మహాసభ ఃఖీకు మంచి బూస్టింగ్ అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సెంటిమెంట్ ప్లేసులో సభ.. కొత్తగా వచ్చిన కష్టాలనుంచి గట్టెక్కిస్తుందా అన్నది కూడా ఆసక్తిరపుతోంది. మరో భారీ విజయానికి ఇక్కడే నాందివేసుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్‌కు, ఆ పార్టీ శ్రేణులకు.. అధినేత ఏం చెబుతారో, తదనంతర రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి.

# అంబెద్కర్ విగ్రహానికి చెప్పులు

కాకినాడ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘోర అవమానం జరిగింది.ఏపీలోని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో అంబేద్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేశారు.అది గమనించిన అంబేద్కరిస్టులు, దళిత సంఘాలు రోడ్డెక్కి తీవ్ర ఆందోళనలు చేపట్టారు.నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల డిమాండ్ చేస్తున్నాయి. సమస్య తీవ్రతను గుర్తించిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# క్యాతనపల్లి బ్రిడ్జి ప్రారంభమైంది.. ప్రజానీకం మురిసింది..

## రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.

క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజల దశాబ్దాల కళ నేడు నెరవేరింది..క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభమైన వేల పుర ప్రజానీకం మురిసింది. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశి కృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా హాజరై బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ వంశి కృష్ణ మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు బ్రిడ్జి సమస్య ప్రధాన అంశంగా ఉండేదని, ఎమ్మెల్యే గా వివేక్ గెలిచిన సంవత్సర కాలంలో బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన మాటప్రకారం ప్రజల కోరిక నెరవేర్చామని తెలిపారు. కరోనా సమయంలో నిలిచిన అజ్ని ప్యాసింజర్ రైలును పునరుద్ధరించడం జరిగిందని పేర్కొన్నారు. సింగరేణిలో కాక వెంకటస్వామి మొదలు పెట్టిన పెన్షన్ స్కీంను నేడు పది వెలకు పెంచాలని సంబంధిత మంత్రికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, త్వరలోనే పెన్షన్ పెరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అజ్నీ రైలును రవీంద్రకఖని రైల్వే స్టేషన్ లో నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. అనంతరం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వేంకస్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన మూడు నెలల్లోనే బ్రిడ్జిని ప్రారంభించాలని దృఢంగా ఉన్నప్పటికీ గుత్తేదారుడుకి రావల్సిన నిధులు, భూ నిర్వాసితులకు అందాల్సిన నష్ట పరిహారం పూర్తి స్థాయిలో రాకపోవడంతో కొంత ఆలస్యమైందని, వెంటనే వారికి రావల్సిన నిధులు మంజూరు చేయించి పనులను వేగవంతం చేయడం, బ్రిడ్జిని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.ఈ మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైయినేజీలు, మంచినీటి సౌకర్యార్థం కొరకు స్పెషల్ డెవలప్మెంట్ నిధులు మంజూరు చేపించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. అలాగే విద్యా, వైద్య రంగానికి పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో రెండు వంద కోట్ల రూపాయలతో నూతన ఓరవడితో విద్యాలయాన్ని నిర్మిస్తామని తెలియజేశారు. అలాగే సన్నబియ్యం, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, ఐదు వందల రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వడంతో పాటు, రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువకులకు నాల్గు లక్షల రూపాయల రుణాలను త్వరలోనే మంజూరు చేస్తానని, ప్రతి నిరుద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్, మాజీ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, నాయకులు గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్, యాకూబ్ అలీ, నీలం శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు షెడ్యూల్ తయారు చేయండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి

భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు అన్ని మండలాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం భూ భారతి నూతన రెవెన్యూ చట్టం, ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో భూ మాత నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పనతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలపై సమగ్రమైన నోట్స్ తయారు చేయాలని ఆయన స్పష్టం చేశారు. నూతన చట్టం ప్రకారం మాత్రమే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, సక్సేషన్లు, సాదా బైనామ చేయాలని తెలిపారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై రెవెన్యూ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కొరకు వచ్చే ప్రజలతో గౌరవప్రదంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. హెల్ప్ డెస్క్ కు వచ్చే ప్రజల వివరాలు రిజిష్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ములుగు, ఖమ్మం నారాయణపేట, కామారెడ్డిలలో ఒక్కొక్క మండలాన్ని ఎంపిక చేసిందని తెలిపారు మే నెలలో మన జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాల్సి ఉంటుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉంటుందని తెలిపారు. వేసవి దృష్ట్యా అవగాహన సదస్సులు నిర్వహణ లో అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికలో పూరెస్టు ఆఫ్ ది పూర్ కుటుంబాలను ఎంపిక చేయాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామం నుండి లబ్ధిదారుల జాభితా తయారు చేయాలని అట్టి జాబితా ప్రకారం విచారణకు గెజిటెడ్ అధికారులను విచారణ అధికారులుగా నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి గెజిటెడ్ అధికారికి 200 మంది లబ్ధిదారుల జాభితా ఇవ్వడం జరుగుతుందని, ప్రతి రోజు కనీసం 25 మంది లబ్ధిదారుల విచారణ చేపట్టి ఇట్టి ప్రక్రియను 8 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాభితా అందజేయాలని, 22 నుంచి 30 తేదీ వరకు ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హుల ఎంపిక చేయాలన్నారు.

# యువతి మృతి.. బంధువుల అందోళన

నల్గొండ

నిడమానూరు (మం) బొక్క మంతల పాడు గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ధర్మారపు మల్లేశ్వరి అనే యువతి హైదరాబాద్ లో మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన కుక్కల జాన్ రెడ్డి అనే యువకుడితో కలసి సహజీవనం చేసిందని ఆమెను కాదని జాన్ రెడ్డి మరొక యువతిని పెళ్లి చేసుకోవడం తో మల్లేశ్వరి మృతి చెందింది. మల్లేశ్వరీ మృతి చెందిద లేక చంపారా అనుమానం తో యువకునీ ఇంటి ముందు మృత దేహం తో మల్లేశ్వరి బందువులు ఆందోళన చేసారు. ఇంట్లో ఎవ్వరు లేకపోవడం తో మృత దేహం ను ఇంట్లో ఉంచి ఆందోళన చేసారు.

# ఎపి సీఎం చంద్రబాబు పై మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు హాట్ కామెంట్స్

విజయవాడ

ఏపీలో హైపర్ లూప్ రైలుకు డీపీఆర్ చేయమని చెప్పడం చంద్రబాబు అనాలోచిత...తొందరపాటు చర్య అని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. పెద్ద పెద్ద ధనవంతులకు , కార్పొరేట్లను బాగుచేయడం కోసం ఇలాంటివి చేయడం సరికాదు . గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో పేదలను గాలికి వదిలేశారు. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్లకు మేలు జరిగేలా పనిచేస్తున్నారు . మీ నిర్ణయాల వల్ల ప్రజలు , రైతులు , విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. 58 వేల ఎకరాలుంటే మళ్లీ 44 వేల ఎకరాలు తీసుకోవడం దేనికి . మీ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఈ 44 వేల ఎకరాలు తీసుకుంటున్నారా చంద్రబాబు. పొలం ఉన్న రైతు అమ్ముకోలేడా... రైతు తరపున మీరు అమ్ముతారా. ప్రభుత్వం ఉన్నది ...రియల్ ఎస్టేట్ వాళ్లను బాగుచేయడానికా అని ప్రశ్నించారు.

40 అంతస్తుల బిల్డింగ్ లు ప్రజలకు ఒరిగేదేంటి . ప్రజలకు కావాల్సింది ఎత్తైన భవనాలు కాదు మంచి పరిపాలన . ప్రజలకు మేలు చేయకుండా మెట్రో రైలు జపం చేయడమెందుకు . ఏపీలో ఉన్న ఆరు ఎయిర్ పోర్టులు సరిపోవా...మళ్లీ కొత్తవి పెట్టడం దేనికి . అమరావతిలో 5 వేల ఎకరాల్లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు ఎవరడిగారు...ఎవడికి కావాలి . శ్రీకాకుళం జిల్లాలో ఎయిర్ పోర్టు కావాలని ఎవరడిగారు . శ్రీకాకుళంలో నాలుగైదు ఎకరాలున్న వాళ్లు కూడా బెజవాడలో తాపీ పనులు చేసుకుంటున్నారు. శ్రీకాకుళంలో కావాల్సింది ఎయిర్ పోర్టు కాదు..పంటలకు సాగునీరు . ఉద్దానంలో కిడ్నీ వ్యాధితో రోజుకొకరు చనిపోతుంటే నీకు కనిపించడం లేదా . చంద్రబాబు ఆలోచనలో ఇప్పటికైనా మార్పు రావాలని నేను కోరుతున్నా నని అన్నారు.

పి4 గురించి తర్వాత ముందు సూపర్ సిక్స్ గురించి మాట్లాడండి చంద్రబాబు . కేంద్రం ఇచ్చేది కాకుండా రైతులకు 14 వేలు ఇస్తామన్నారు...ఏమైపోయింది ఆ హామీ. మెట్రోరైళ్ల పై ఉన్న శ్రద్ధ రైతుల పై ఎందుకు లేదు చంద్రబాబు. కృష్ణానదిలో 4500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ కట్టడానికి మీకు అసలు బుద్ధుందా అని అన్నారు.

పి4 విధానం అంటున్నారు మంచిదే . డబ్బున్నవాళ్లు పేదలకు సాయం చేయడం ఈరోజు కొత్తగా వచ్చింది కాదు. రాష్ట్రంలోనే అతిపెద్దవైన మూడు విద్యాసంస్థలు మీ నాయకులవే. మీకు చేతనైతే నారాయణ , భాష్యం విద్యాసంస్థల్లో పది శాతం పేద విద్యార్థులకు సీట్లు ఇప్పించండి. పేదల కోసం హెరిటేజ్ నుంచి మీరేమీ ఇవ్వరా...?? మీ హెరిటేజ్ నుంచి మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పాలు...పెరుగు..మజ్జిగ ప్యాకెట్లైనా ఇవ్వొచ్చు కదా . పేదల కోసం హెరిటేజ్ కూడా మేలు చేస్తుందని ప్రజలకు తెలియజేయండి. మీరు చేస్తే మిమ్మల్ని చూసి మరికొంతమంది సాయం చేసేందుకు ముందుకు వస్తారని అన్నారు.

# అపరేషన్ కగార్ పేరిట నరమేధం ప్రజాసంఘాల ఐక్యవేదిక

కడప దేశంలోని బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీల మీద నరమేధాన్నీ కొనసాగిస్తున్నదని ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు.కడప ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గోపాల్, వరుహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాయలసీమ కార్మిక సమాఖ్య నాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను హత్యగావిస్తుందని ఆరోపించారు. ముఖ్యంగా మావోయిస్టుల అణిచివేత పేరుతో అన్యం పుణ్యమెరగని అడవి బిడ్డలపై తీవ్రమైన అంచవేతకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవుల నుంచి ఆదివాసీలను, వాళ్లకు అండగా ఉన్న మావోయిస్టులను తరిమేయడం ద్వారా అడవులను బడా కార్పోరేట్లకు అప్పగించాలన్న కుట్ర దాగి ఉందని తెలిపారు. లక్షల కోట్ల విలువైన సహజమైన ఖనిజ సంపాదను, ప్రకృతి సంపదని కార్పోరేట్ కంపెనీలకి దోచిపెట్టడానికి ఈ హత్యాకాండని ప్రభుత్వం చేపట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఆయా రాష్ట్రాల్లోని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహకరించడం విచారకరమన్నారు. ఆయుధాలు పట్టుకున్న వాళ్ళతో చర్చలు చేయమంటున్న కేంద్ర ప్రభుత్వం అదే ఆయుధాలు పట్టుకున్న ఆర్ఎస్ఎస్ కనులలో పని చేస్తుందని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్, విహెచ్పి, బజరంగదళ్ బహిరంగంగా నడివీధుల్లో మారణాయుధాలతో బయోత్పాతాలు సృష్టిస్తుంటే ఒక్క కేసు లేదన్నారు. ఆర్ఎస్ఎస్ కి రాజ్యాంగం మీద నమ్మకం లేదని తీవ్రంగా విమర్శలు చేశారు. అందుకనే ఆర్ఎస్ఎస్ దేశానికి స్వాతంత్రం రాలేదని, జాతీయ జెండాను ఎగరేసేది లేదని, రాజ్యాంగాన్ని అంగీకరించేది లేదని బిస్మించుకొని ఇన్నాళ్లు ఉన్నదన్నారు. అదే ఆర్ఎస్ఎస్ కనుసనల్లో పనిచేస్తున్న బిజెపి ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెబుతుందని తెలిపారు.

# గ్రూప్ వన్ వివాదాలు...ఫుల్ స్టాప్ ఎప్పుడు

హైదరాబాద్, ఏప్రిల్ 15,

తెలంగాణలో 2024 అక్టోబర్‌లో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఈ పరీక్షల్లో 563 పోస్టుల కోసం 31,383 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. అయితే, ఫలితాల్లో అనేక అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయని, ఇది భారతదేశంలోనే అతిపెద్ద పరీక్షా కుంభకోణంగా ఉండవచ్చని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు ఆరోపిస్తున్నారు. ఒకే హాల్ టికెట్ వరుసలో ఉన్న వందలాది మంది అభ్యర్థులకు ఒకే మార్కులు రావడం, కొన్ని పరీక్షా కేంద్రాల నుంచి అసాధారణ సంఖ్యలో టాపర్‌లు రావడం వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి.తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలు 2025 ఏప్రిల్‌లో విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఒకే హాల్ టికెట్ వరుసలో ఉన్న 654 మంది అభ్యర్థులకు ఒకే మార్కులు, మరో వరుసలో 702 మందికి ఒకే మార్కులు రావడం సంచలనం రేపింది. ఈ అసాధారణ ఫలితాలు పరీక్షల మూల్యాంకనంలో పారదర్శకత లోపించిందని, సాంకేతిక లేదా మానవ తప్పిదాలు జరిగి ఉండవచ్చని అనుమానాలకు దారితీశాయి.హైదరాబాద్‌లోని కొన్ని పరీక్షా కేంద్రాల నుంచి అసాధారణ సంఖ్యలో టాపర్‌లు రావడం మరో వివాదాస్పద అంశం. కేవలం రెండు కేంద్రాల నుంచి 74 మంది టాపర్‌లు రావడం, 15 కేంద్రాల నుంచి అన్ని ర్యాంకులు రావడం సందేహాలను రేకెత్తించాయి.


బీఆర్ఎస్ నాయకుల ఆరోపణల ప్రకారం, 563 పోస్టుల్లో టాప్ 500 ర్యాంకుల్లో ఒక్క తెలుగు మీడియం విద్యార్థి కూడా చోటు సంపాదించలేదు, ఇది మూల్యాంకనంలో పక్షపాతం ఉందనే అనుమానాలను బలపరిచింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ ఫలితాలను "భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద పరీక్షా కుంభకోణం"గా అభివర్ణించారు. ఆయన ఈ అనుమానాస్పద ఫలితాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులకు తెలంగాణ యువత పట్ల చిత్తశుద్ధి ఉంటే, వారు వెంటనే ఈ కుంభకోణంపై సీబీఐ విచారణకు మద్దతు ఇవ్వాలని ఆయన సవాలు విసిరారు.మూల్యాంకనంలో మూడవ దశ తనిఖీ జరగలేదని, రెండవ దశ మూల్యాంకనం కాంట్రాక్ట్ సిబ్బంది చేతిలో జరిగిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇది ప్రొఫెసర్‌లు లేదా శాశ్వత సిబ్బంది చేయాల్సిన పనిని అనధికార వ్యక్తులకు అప్పగించినట్లు చెప్పారు. పరీక్షలకు సంబంధించిన డేటా లీక్ అయినట్లు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు అవసరమని డిమాండ్ చేశారు.

ఈ వివాదాస్పద ఫలితాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో వందలాది గ్రూప్-1 అభ్యర్థులు నిరసనలు చేపట్టారు. ఈ ఫలితాలను రద్దు చేసి, పారదర్శకంగా మళ్లీ మూల్యాంకనం చేయాలని వారు డిమాండ్ చేశారు. అశోక్ నగర్, సివిల్ సర్వీసెస్ కోచింగ్ కేంద్రాలకు కేంద్రంగా ఉండడంతో, ఈ నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కొందరు అభ్యర్థులను నిర్బంధించి, వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు, దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందించారు.రాజకీయ మద్దతు: బీఆర్ఎస్‌తో పాటు, బీజేపీ నాయకులు కూడా అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. గతంలో బీజేపీ నాయకుడు బండి సంజయ్ కూడా గ్రూప్-1 అభ్యర్థుల నిరసనలకు మద్దతు ప్రకటించారు, అయితే సీబీఐ విచారణపై బీజేపీ నుంచి స్పష్టమైన స్పందన ఇంకా రాలేదు.తెలంగాణ గ్రూప్-1 పరీక్షల చుట్టూ గతంలో కూడా అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. 2022, 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరీక్షలు పేపర్ లీక్ ఆరోపణలతో రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో, 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలపై కూడా అనుమానాలు రావడం రాష్ట్రంలో యువతలో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. 2024లో జరిగిన గ్రూప్-1 పరీక్షలకు ముందు జీవో 29పై కూడా తీవ్ర వివాదం చెలరేగింది. ఈ జీవో రిజర్వేషన్ నిబంధనలను మార్చిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై సుప్రీం కోర్టులో కేసు కొనసాగుతోంది. గతంలో జరిగిన పేపర్ లీక్ ఘటనలు, ఇప్పుడు ఫలితాల్లో అనుమానాస్పద అంశాలు టీజీపీఎస్సీ నిర్వహణలో పారదర్శకత లోపించిందనే ఆరోపణలను బలపరుస్తున్నాయి. ఈ విషయాన్ని రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది. అదే సమయంలో, బీజేపీ కూడా ఈ వివాదంపై స్పందించాల్సిన ఒత్తిడిలో ఉంది, ఎందుకంటే అభ్యర్థులు బీజేపీ మద్దతు కోరుతున్నారు. ఈ వివాదం రాష్ట్రంలో ఉద్యోగార్థులను నిరాశపరిచింది. గత 13 ఏళ్లలో గ్రూప్-1 పరీక్షలు కేవలం రెండుసార్లు మాత్రమే జరగడం, ప్రతీసారి వివాదాలు తలెత్తడం వల్ల యువతలో ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతోంది.

# నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం -సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16న నిర్వహిస్తారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ



దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటక ప్రదర్శనతోపాటు నాటకానికి సంబంధించిన అనేక అంశాలపై సదస్సులు జరగాలని, నాటక కళాకారుల జయంతులను వర్ధంతులను నిర్వహించడం ద్వారా ప్రజల్లో నాటక కళ పట్ల ఉత్సాహం, విలువలు పెరుగుతాయని, వీటన్నింటిని సమతుల్యం చేసేలా ఉండేందుకు నాటకరంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలుగు నాటక కళాకారులు భావించారు. అయితే, ఏ రోజును నాటకరంగం దినోత్సవంగా చేయాలన్న అంశంపై అనేక చర్చలు జరిగాయి. అనేకమంది అనేక పేర్లూ, తేదీలు సూచించారు.

దీనికి 2000వ సంవత్సరంలో బీజం పడింది. 2000వ సంవత్సరంలో కొంతమంది యువనాటక కళకారులతో కలిసి డా. పెద్ది రామారావు ఆధ్వర్యంలో యవనిక త్రైమాసిక నాటకరంగ పత్రిక ప్రారంభమయింది. నాలుగేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలో ప్రపంచ, భారతీయ, తెలుగు నాటకరంగాలకు సంబంధించి నాటక ముఖ్యులు, ఔత్సాహికులు రాసిన అనేక వ్యాసాలను యవనిక ప్రచురించడంతోపాటు నాటకరంగ కార్యక్రమాలు, నాటకోత్సవాలను కూడా నిర్వహించింది. నాటకరంగాన్ని మరింత పటిష్టపరచడంకోసం ఇతర దేశాల, రాష్ట్రాల నాటకరంగానికి ఉన్నట్లుగా తెలుగు నాటకరంగానికి కూడా ఒక దినోత్సవం ఉంటే బాగుంటుందని భావించి, "ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవం" శీర్షికతో 2000 ఏప్రిల్-జూన్ ప్రత్యేక యవనిక సంచికను ప్రచురించింది. యవనిక ఆలోచనకు "ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక" సహకారం తోడైంది. తెలుగు నాటక కళాకారులంతా నాటకరంగ దినోత్సవ ఏర్పాటుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శింపచేశాడు. అంతేకాకుండా తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించాడు. ఆధునిక తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలను అందించిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని నాటక సంస్థలు 2001 నుండి తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపాయి. ఈ క్రమంలో డా. కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా, కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ 2007 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ. విడుదలచేసింది. 2007, ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటకరంగ దినోత్సవం జరుపబడింది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేసిన నాటక కళాకారులకు సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు, బిరుదులు అందజేస్తారు.

# వేలానికి గోల్కొండ రాయల్ డైమండ్..

హైదరాబాద్, ఏప్రిల్ 15,

ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.అప్పట్లో ఇండోర్ మహారాజు వద్ద ఈ ఉంగరం ఉండేదని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ జ్యుయెలరీ చీఫ్ రాహుల్ కడాకియా అన్నారు. ఇటువంటి ఉంగరం ఎన్నడూ వేలానికి రాలేదని తెలిపారు. వేలంలో ఇది రూ.300 కోట్లు ? రూ.430 కోట్ల మధ్య అమ్ముడుపోవచ్చని చెప్పారు.ఇలాంటి చాలా అరుదైన, విలువైన వజ్రాలు జీవితకాలంలో ఒకసారి మాత్రమే వేలానికి వస్తాయని రాహుల్ కడాకియా అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ అయిన తమ క్రిస్టీస్ 259 సంవత్సరాలుగా పనిచేస్తోందని తెలిపారు. ఇన్నేళ్లుగా క్రిస్టీస్ ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ, ముఖ్యమైన వజ్రాలను విక్రయించిందని అన్నారు.తమ వేలంలో గతంలో అమ్ముడైన ప్రసిద్ధ గోల్కొండ వజ్రాలకు ఉదాహరణలుగా పలు డైమండ్ల పేర్లను ఆయన వివరించారు. ఆర్చ్‌డ్యూక్ జోసెఫ్ డైమండ్, ప్రిన్సీ డైమండ్, విట్టెల్స్‌బాచ్ డైమండ్ వంటివాటిని అమ్మామని చెప్పారు. రాజ వారసత్వం, అసాధారణ రంగు, పరిమాణంతో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ప్రపంచంలోనే అత్యంత అరుదైన నీలి రంగు వజ్రాలలో ఒకటని రాహుల్ కడాకియా ఒక ప్రకటనలో తెలిపారు.క్రిస్టీస్ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. 'ది గోల్కొండ బ్లూ' డైమండ్ ఒకప్పుడు ఇండోర్ మహారాజా యశ్వంత్ రావు హోల్కర్ ఎఎకు చెందింది. 1923లో మహారాజ తండ్రి ఈ వజ్రంతో కూడిన ఒక బ్రాస్లెట్‌ను తయారు చేయాలని ఫ్రాన్స్‌కు చెందిన ప్రసిద్ధ లగ్జరీ ఆభరణాల బ్రాండ్ చౌమెట్‌కి ఆర్డర్ ఇచ్చారు. అంతకు ముందు అదే ఆభరణాల సంస్థ నుంచి "ఇండోర్ పియర్స్" అనే రెండు గోల్కొండ వజ్రాలను ఆయన కొనుగోలు చేశారు.దశాబ్ద కాలం తర్వాత మహారాజు ప్రసిద్ధ ఫ్రెంచ్ లగ్జరీ ఆభరణాల కంపెనీ మౌబౌసిన్‌కు మరో ఆర్డర్ ఇచ్చారు. ఈ కంపెనీ 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను రీడిజైన్ చేసి ఇండోర్ పియర్ వజ్రాలతో పాటు హారంలో చేర్చింది.న్యూయార్క్‌కు చెందిన హ్యారీ విన్‌స్టన్ అనే ప్రసిద్ధ ఆభరణాల వ్యాపారి 1947లో 'ది గోల్కొండ బ్లూ' డైమండ్‌ను కొన్నారు. ఆయన ఈ నీలి వజ్రాన్ని అదే పరిమాణంలో ఉన్న మరొక తెల్ల వజ్రాన్ని వాడుతూ బ్రూచ్‌ను తయారు చేశారు. తరువాత ఆ బ్రూచ్ బరోడా మహారాజుకు చేరింది. కొంతకాలం తర్వాత ఆ బ్రూచ్ ఆ రాజకుటుంబం ఒక ప్రైవేట్ వ్యక్తికి అమ్మింది. ఇప్పుడు అదే వజ్రం జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్ డెస్ బెర్గ్స్‌లో వేలానికి ఉండనుంది.

# మహిళా సాధికారత కోసమే స్త్రీ సమ్మిట్ ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్

వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశం లభించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులుకు ఫ్రీ లోన్లు ఇస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక గ్రూపులకు 20 వేల కోట్లకు పైగా లోన్లు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తాజ్ దక్కన్ హోటల్ లో నిర్వహించిన స్త్రీ సమ్మిట్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు భట్టి. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం. మహిళా సాధికారత కోసమే స్త్రీ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒకవైపు స్త్రీలను దేవతలుగా చూస్తేనే మరోవైపు కంట్రోల్ చేయాలనే ప్రయత్నం తరతరాలుగా జరుగుతూనే ఉందని అన్నారు. హిందూ కోడ్ బిల్లుతోనే మహిళా సాధికారత ప్రారంభం అయ్యిందని, అంబేద్కర్ వల్లే మహిళలకు హక్కులు లభించాయని గుర్తు చేశారు. మహిళలకు వారతసత్వ హక్కులు లభించాయని తెలిపారు. తెలంగాణలో మహిళలకు ఫ్రీ బస్ స్కీం సక్సెస్ ఫుల్ గా నడుస్తోందని అన్నారు. సోలార్ ప్లాంట్ నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామని, దీంతో సోలార్ ప్లాంట్ నిర్వహణలో మహిళలకు భాగస్వామ్యం లభించిందని అన్నారు. ఇలాంటి స్త్రీ సమ్మిట్ లతో మహిళా సాధికారత సాధించవచ్చుని పిలుపునిచ్చారు.

# వ్యవసాయ పరికరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

మైలవరం

మైలవరం మండలం చిలుకూరువారి గూడెంలో సబ్సిడీపై రైతులకు మంజూరు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను మైలవరం శాసనసభ్యుడు వసంత వెంకట కృష్ణప్రసాదు మంగళవారం ప్రారంభించారు. తరువాత గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది

దుబ్బాక

దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పై సంచలన వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామి కవేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారు.

తొగుటలో జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో కొత్త ప్రభాకరెడ్డి మాట్లాడారు. అవసరమైతే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని,ఆ ఖర్చును తాము భరిస్తామంటు న్నారు. పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారు, కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని అన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. రాజకీయాల్లోకి వచ్చాక సిన్సియర్ ఉంటే కుదరడం లేదని దురుసుగా ఉంటే ఎలా ఉంటుందో చూపిస్తనని అన్నారు.

# బీఆర్ఎస్ పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

యాదాద్రి

బీఆర్ఎస్ 25 ఏళ్లు పూర్తిచేసుకుని రజితోత్సవ వేడుకలకు ముస్తాబవుతున్న వేళ.. గులాబీ శ్రేణులు సభకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో..యాదాద్రి జిల్లా, వలిగొండ మండలం, వేములకొండ లోని మత్స్యగిరి లక్ష్మీనరసింహ ఆలయం నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ ఆలయం వరకు బీఆర్ఎస్వీ నాయకులు చేపట్టిన పాదయాత్రను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, పైల్ల శేఖర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 27 న వరంగల్ జరిగే సభ సక్సెస్ కావాలని చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని.. పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు.

# డాక్యుమెంట్ రైటర్ల నిరసన

యాదాద్రి

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ ద్వారా రోజుకి కేవలం 48 రిజిస్ట్రేషన్ చేయాలని, ఆన్లైన్ లో స్లాట్ బుక్ చేసుకునే విధానం ద్వారా డాక్యుమెంట్ రైటర్స్ జీవనోపాది కోల్పోతున్నామని డాక్యుమెంట్ రైటర్స్ అన్నారు.

నూతన విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ర సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసారు. సబ్ రిజిస్టర్ కు వినతిపత్రం అందజేసారు. మంగళవారం నుండి శనివారం వరకు డాక్యుమెంట్ రైటర్ సేవలు నిలిపివేయునట్లు తెలిపారు.

# చార్జీల పేరుతో కోతలు

వరంగల్, ఏప్రిల్ 15,

అధిక ధర ఆశ చూపి రైతులను తమ వద్ద వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేలా రప్పించి.. తర్వాత చార్జీల పేరుతో కోతలు పెడుతూ రైతులకు కుచ్చుటోపి పెడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలో వ్యాపారులు కొందరు మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా మార్కెట్ బయట వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు తెర లేపారు.మార్కెట్లో వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులకు కిందటి రోజు లభించిన ధరలకు క్వింటాలుకు 100 నుండి 200 రూపాయలు అధికంగా చెల్లిస్తామని మార్కెట్ కు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకువచ్చే వాహనాలను మార్గమధ్యలోనే అడ్డుకొని తమ ట్రేడింగ్ కంపెనీలు, మిల్లులకు తీసుకెళ్తున్నారు. అధిక ధర ఆశతో వారికి సరుకులను విక్రయించడానికి మొగ్గు చూపిందే తడువు వెంటనే సదరు వాహనాన్ని వే బ్రిడ్జి కాంటా పై తూకం వేయించి తీసుకురావాలని చెబుతున్నారు.వే బ్రిడ్జి తూకం చార్జీ 50 రూపాయలు రైతే చెల్లించి తూకం వేయించి సదరు వ్యాపారికి చెందిన మిల్లు, ట్రేడింగ్ కంపెనీ వద్దకు వాహనాన్ని తీసుకు వెళ్ళగానే అక్కడ నేరుగా లిఫ్ట్ చేయిస్తున్నారు. వే బ్రిడ్జి లో నిర్దేశించిన వే మెంట్ ప్రకారం ప్రకారం ముందుగా నిర్ణయించిన ధరతో లెక్క చూసి రైతుకు డబ్బులు చెల్లించకుండా 30 కిలోలు తరుగు కింద మినహాయించుకుని, ఆ తరువాత బస్తాలకు లెక్క గట్టి ఒక్కో బస్తాకు దడువాయి, హమాలీ, కూలీ పేరుతో 16 నుంచి 25 రూపాయల వరకు చార్జీల పేరుతో కోత పెట్టి డబ్బులు చెల్లిస్తున్నారు.ఎక్కడ కూడా కార్మికుల ప్రమేయం లేకుండానే రైతే నేరుగా తాను పండించిన పంటను ట్రాక్టర్ లేదంటే ఇతర వాహనాల్లో తీసుకువచ్చి వే బ్రిడ్జి కాంట వేయించి ట్రేడర్ వద్దకు తీసుకువచ్చి దిగుమతి చేస్తుండగా చార్జీల పేరుతో మినహాయింపులు చేసుకోవడం విశేషం.దీనికి తోడు నగదు చెల్లింపులు చేస్తున్నామని విక్రయించిన వ్యవసాయ ఉత్పత్తుల విలువలో ఒక శాతం నగదు మినహాయించుకుంటున్నారు. అటు చేయని పనికి చార్జీలు, తరుగు పేరుతో 30 కిలోలు, నగదు చెల్లింపు పేరుతో ఒక శాతం కోత పెడుతుండడంతో ముందు చెప్పిన అధిక ధర.. అన్నదాతకు.. అల్లికి అల్లి.. సున్నకు సున్న.. అన్న చందంగా మారుతోంది. గ్రామాల నుండి కేసముద్రం మార్కెట్ కు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకువచ్చే వాహనాల డ్రైవర్లకు కొందరు ట్రేడర్లు మామూళ్ళు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నేరుగా తమ వద్దకే వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి రైతుకు నచ్చజెప్పి తమకు విక్రయించేలా సహకరించిన డ్రైవర్లకు 150 నుండి 200 రూపాయలు చెల్లిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.మామూళ్లకు ఆశపడ్డ డ్రైవర్లు కొందరు నేరుగా సదరు ట్రేడింగ్ కంపెనీ వద్దకే వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళ్లి ఇక్కడైతే మంచి ధర లభిస్తుంది వెంటనే డబ్బులు ఇస్తారని రైతులకు నచ్చజెప్పి సరుకులను దంపు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు తగ్గిస్తున్న వ్యాపారులు, నేరుగా కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు 'రాస్తామాల్' పేరుతో మార్కెట్ కు చెల్లించాల్సిన పన్ను చెల్లింపులు చేస్తున్నారు. 2023 - 24 సంవత్సరంలో 'రాస్తా మాల్' ద్వారా మార్కెట్ ఆదాయం 95 లక్షల రూపాయలు రాగా, 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో కోటి 17 లక్షలకు పెరగడం, అదే సమయంలో కేసముద్రం మార్కెట్ 'గంజ్' ఆదాయం గత ఏడాది రెండు కోట్ల 88 లక్షలు రాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు కోట్ల 42 లక్షలకు పడిపోవడం మార్కెట్ బయట పెరిగిన కొనుగోళ్ల తీరుకు సాక్ష్యంగా నిలుస్తోంది.

ప్రచారం మినహా చర్యలు లేవు

మార్కెట్ బయట వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా నిలువరించాల్సిన మార్కెట్ కమిటీ, అధికారులు ఇటీవల దిద్దుబాటు చర్యలు చేపట్టామని ప్రకటించినప్పటికీ కేవలం కంటి తుడుపుగా ఆటోల ద్వారా గ్రామాల్లో మార్కెట్లోనే సరుకులు విక్రయించాలని ప్రచారం చేయడం మినహా మార్కెట్ బయట కొనుగోలు నిలువరించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.కేసముద్రం వ్యవసాయ మార్కెట్ జాతీయ ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ విధానం ఈ - నామ్ పరిధిలో కొనసాగడంతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా జాతీయస్థాయిలో విశిష్ట సేవలకు 'బెస్ట్ ఎక్సలెన్సీ' అవార్డు అందుకున్నది. అటువంటి మార్కెట్ లో రోజురోజుకు సరుకుల రాబడి తగ్గిపోయి మార్కెట్ ప్రతిష్ట, ప్రభావం కోల్పోయే పరిస్థితికి చేరువవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

# ఎస్బిఐ బ్యాంకు లో భారీ అగ్నిప్రమాదం

వికారాబాద్

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కరన్ కోట్ ఎస్బిఐ బ్యాంకు నందు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 9.30 నిమిషాలకు బ్యాంకు సెక్రటరీ గార్డు బ్యాంకు తాళాలు తీసి చూడగా ఒకసారిగా పోగలు వ్యాపించాయి దీంతో సెక్రెటరీ గార్డు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో ఉన్నత అధికారులు వచ్చి చూసేసరికి భారీగా మంటలు బ్యాంకు వ్యాపించ సాగాయి దీంతో అధికారులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కోడంగల్ నుంచి ఫైర్ ఇంజన్ రావడం జరిగింది దీంతో మంటలు ఆర్పడం కొనసాగుతుంది అయితే బ్యాంకులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా మరి ఏదైనా ఉందా అనేది ఇంకా తెలియాల్సి ఉంది అయితే బ్యాంకులో సరైన ప్రమాణాలు లేకపోవడం మని మరికొందరు అనుమానిస్తున్నారు బ్యాంకు పై భాగంలో ఇటీవల థర్మ కోల్ షీట్స్ తో పై కప్పు ఫర్నిచర్ గా ఏర్పాటు చేశారని దీని ద్వారా కూడా మంటలు అధికంగా వ్యాపించాయని పలువురు అనుమానిస్తున్నారు దీంతో పొగ ఆ ప్రాంతమంతా వ్యాపించడంతో వాహనదారులు కూడా ఇబ్బంది పడ్డారు.

# పెద్దపల్లిలో నేతల సైలెంట్...

కరీంనగర్, ఏప్రిల్ 15,

పెద్దపల్లి జిల్లా అంటే గుర్తొచ్చేది ఇద్దరు నేతలు. ఒకరు గతంలో పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దాసరి మనోహర్ రెడ్డికాగా? మరొకరు ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ రమణారావు.. గతంలో ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా వ్యవహరించేవారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచేది.నీ అవినీతి బాగోతం బయటకు తీస్తా అంటే?నీ అవినీతి అవినీతి బాగోతం కూడా బయటకు తీస్తానంటూ ఇద్దరు నిత్యం ఉప్పు-నిప్పులా ఉండేవారు. వీరిద్దరి మధ్య ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో జిల్లా రాజకీయాలు హీటెక్కేవి. ఇదంతా 2023కు ముందు ఇద్దరి మధ్య జరిగిన పొలిటికల్ వార్. సీన్ కట్ చేస్తే.. 2023లో గులాబీ పార్టీ దారుణంగా ఓడిపోయింది.పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా జిల్లాను ఏకచక్రాధిపత్యంగా ఏలిన దాసరి మనోహర్ రెడ్డి ఓడిపోయారు. కాంగ్రెస్ నేత చింతపల్లి విజయ రమణారావు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. కాలం మారింది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ గెలుపుతో పెద్దపల్లి జిల్లా రాజకీయాలు కూడా ఒక్కసారిగా మారిపోయాయి.అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కయ్యానికి సై అంటూ కత్తులు దూసుకున్న ఇద్దరు నేతలు ఇప్పుడు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డి ఒక్కసారిగా దూకుడు తగ్గించారు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారట. ఏదైనా పార్టీ ప్రోగ్రామ్స్ ఉంటే అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారంట. అంతేకాదు క్యాడర్ కు సైతం అందుబాటులో ఉండడంలేదట. రాజకీయంగా మునుపటిలా దూకుడును ప్రదర్శించడంలేదట.ప్రత్యర్థులపై చేసే విమర్శల్లో వాడీవేడి లేకుండా చప్పగా సాగుతున్నాయంట ఆయన ప్రెస్ మీట్లు. కనీసం పార్టీ కార్యక్రమాల్లో అయినా యాక్టీవ్ గా ఉంటున్నారంటే అదికూడా లేదట. ఒక్క ఓటమితో మనోహర్ రెడ్డి తీరులో ఇంతలా మార్పు వచ్చిందేంటి అంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పదేళ్ల పాటు రాజ్యమేలిన మనోహర్ రెడ్డి.. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పైన గానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపైగాని పల్లెత్తు మాట కూడా అనకుండా ఎందుకు సైలెన్స్ గా ఉంటున్నారనేదే ఇప్పుడు ఎవరికీ అంతుచిక్కడంలేదట.మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ పైనే పార్టీ నేతలు తలా ఒకరకంగా చర్చించుకుంటున్నారట. 2023కు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డిపై.. చింతపల్లి విజయ రమణారావు నిత్యం ఏదో ఒక ఇష్యుపై ఆరోపణలు చేస్తుండేవారు.. భూ ఆక్రమణలు, అక్రమ దందాలపై బహిరంగంగానే విమర్శలు చేశారు. అయితే ఎన్నికల తరువాత ఇప్పుడు ఒక్కసారిగా సీన్ మారి పోయింది. పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతపల్లి విజయ రమణా రావు పెద్దపల్లి గెలవడంతో? మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మౌన ముద్రలోకి వెళ్లారు. అందుకు కారణం కూడా లేకపోలేదు అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కూడా మనోహర్ రెడ్డి భూ ఆక్రమణల భాగోతం బయట పెడతానంటూ ఎమ్మెల్యే విజయ రమణా రావు హెచ్చరించారు. బంధంపల్లి చెరువుతో పాటు, మనోహర్ రెడ్డికి సంబంధించిన స్కూళ్లు, హాస్టళ్ల లెక్కలు తీస్తానంటూ బహిరంగంగానే ప్రకటించారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే..తనకే నష్టం జరుగుతుందని భావించి మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ అయ్యారనే గుసగుసలు జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తున్నాయి.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మనోహర్ రెడ్డి భూ ఆక్రమణలు బయట పెడతా.. విద్యా సంస్థలను కొలిపిస్తానంటూ హాట్ కామెంట్స్ చేసిన ఎమ్మెల్యే విజయ రమణరావు కూడా ఒక్కసారిగా సైలెన్స్ అయ్యారంట. మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే మౌనంపై వహించడం వెనుక ఏం జరిగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడి నుండి అధికారం చేపట్టే వరకు విజయ రమణ హెచ్చరికలకే పరిమితమవడం వెనుకున్న మతలబు ఏంటనే సందేహాలు జిల్లా రాజకీయ నేతల్లో వ్యక్తమవుతున్నాయంట.ఇద్దరి మధ్య రాజీ ఏమైనా కుదిరిందా అంటూ రకరకాల పొలిటికల్ గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయంట. మరి భూ ఆక్రమణదారుల భరతం పడతానంటూ ఎమ్మెల్యే చేసిన శపథం.. మాజీ ఎమ్మెల్యే సైలెన్స్‌గా ఉండేంత స్థాయికి వెళ్లడం వెనుక ఏదో మతలబు జరిగే ఉంటుందంటూ పెద్దపల్లి రాజకీయ వర్గాలు సెటైర్లు వేసుకుంటున్నారట. మరి రాబోయే రోజుల్లో కూడా వీరిద్దరి మధ్య ఇలాగే సైలెన్స్ వాతావరణం కంటిన్యూ అవుతుందా లేక ఏదైనా వ్యవహారం బెడిసికొట్టి మళ్లీ మొదటికొస్తుందా అనేది వేచి చూడాలి.

# ఆసక్తికరంగా కల్వకుంట్ల ఫ్యామిలీ పాలిటిక్స్

నిజామాబాద్, ఏప్రిల్ 15,

వరంగల్‌లో బీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్లీనరీ సభపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సైలెంట్ అయ్యారు. ఆమెకు పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానం లేదా? అందుకే సన్నాహక సమావేశాలకు గైర్హాజరు అవుతున్నారా? ప్రస్తుతం గులాబీపార్టీ శ్రేణుల్లో ఇవే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. దానికి తగ్గట్లే నిజామాబాద్ జిల్లా నేతల సమావేశాలకు సైతం ఆమె హాజరుకావడం లేదు. పార్టీ పరంగా సరైన ప్రాధాన్యత లేకపోవడంతో ఆమె సొంత ప్లాట్ ఫాం జాగృతితో యాక్టీవిటీస్ చేస్తున్నారనే చర్చజరుగుతుంది. ఇక ముమ్మందు కూడా మరింత దూకుడు పెంచాలని కవిత ఆలోచిస్తున్నట్లు సమాచారం.గులాబీ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 27న వరంగల్ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభను విజయవంతం చేసేందుకు గులాబీపార్టీ సకల ఏర్పాట్లు చేస్తోంది. ఎక్కడికక్కడ పార్టీ కేడర్‌ను సైతం పార్టీ నాయకులు సన్నద్ధం చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ జనం తరలింపుపై సలహాలు, సూచనలు తీసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎవరికివారు బిజీగా ఉన్నారు. కానీ కవిత మాత్రం పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు, వరంగల్ సభ ఏర్పాట్లకు సంబంధించి సైలెంట్‌గా ఉన్నారు.ఇంతకూ వేడుకలను ఆహ్వానం అందలేదా?.. కావాలని పార్టీ ఆమెను పక్కన పెట్టిందా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడు పార్టీలో యాక్టివ్ గా ఉండే కవిత పార్టీ సభ విషయంలో ఎందుకు స్పందించడం లేదనేది ఆమె క్యాడర్‌కే అంతుపట్టడం లేదంట. గ్రేటర్‌లో జరుగుతున్న పార్టీ సన్నాహక సమావేశాల్లో సైతం పాల్గొనడం లేదు. కావాలని ఆహ్వానించడం లేదా? లేకుంటే ఆమె తెలంగాణ జాగృతి సంస్థ ప్రోగ్రామ్స్‌తో బిజీగా ఉండటంతో పాల్గొనడం లేదా? అసలు పార్టీలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన కవిత 2019లో ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. తిరిగి 2021 నవంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించారు. ఆ జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి పట్టుకుంది. కేడర్ , నేతలతోనూ పరిచయాలు ఉన్నాయి. పార్టీ సన్నాహక సమావేశాలు అన్ని జిల్లాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని నియోజకవర్గాల్లోనూ జరుగుతున్నాయి. అయితే కవిత మాత్రం ఇప్పటివరకు వెళ్లలేదు. పార్టీ కేడర్ ను సభకు సన్నద్ధం చేయడం లేదు.అంతేకాదు ఇటీవల వారం రోజులపాటు ఉమ్మడి జిల్లాల ముఖ్య నేతలతోనూ ఎర్రవెల్లి ఫాం హౌజ్ లో కేసీఆర్ అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. ఆ సమావేశాలకు సైతం కేసీఆర్ కుమార్తె వెళ్లలేదు. ఇప్పుడు సొంత జిల్లా నిజామాబాద్ లో జరుగుతున్న సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. దాంతో ఆమెకు పార్టీ సమావేశాలు నిర్వహించమని చెప్పలేదా? ఆ జిల్లా అధ్యక్షుడు ఆహ్వానించడం లేదా? అసలు పార్టీ పెద్దలే ఆమెను దూరం పెడుతున్నారా? అనేది తెలంగాణ జాగృతి కార్యకర్తల్లో తీవ్ర గందరగోళానికి కారణమవుతుంది. అయితే పార్టీ సమావేశాలు నిర్వహించమని ఆదేశాలు లేకపోవడంతోనే కవిత ఆ జిల్లాకు వెళ్లడం లేదంట కవిత సొంత ప్లాట్‌ఫాం జాగృతితో యాక్టవిటీస్‌ను ముమ్మరం చేశారు. తెలంగాణ కళలు, సంస్కృతిపై జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి.. ప్రాచుర్యం కల్పించేందుకు 2006 ఆగస్టులో ఆమె తెలంగాణ జాగృతి సంస్థని ఏర్పాటు చేశారు. నాటి నుంచి జాగృతి సంస్థ బతుకమ్మ ఉత్సవాలతో పాటు సేవాకార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తుంది. ప్రస్తుతం బీసీ, మహిళ అంశంతో ముందుకు సాగుతుంది. 42శాతం రిజర్వేషన్లపై పోరాటం సాగిస్తూనే మరోవైపు పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ప్రతిష్టించాలన్న డిమాండ్‌తో ప్రతిజిల్లాలో ధర్నాలు, నిరసనలు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు.ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏవి దృష్టికి వచ్చినా వాటిపై గళం వినిపిస్తున్నారు. జాగృతితో పాటు పూలే ఫ్రంట్ తో కార్యచరణ కొనసాగిస్తున్నారు.నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ యోచనను స్వాగతిస్తున్నట్లు కవిత ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్యాంక్ బండ్‌పై విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేయడం అభినందనీయమన్నారు. అలాగే అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అదలా ఉంటే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా మండలిలో ప్రభుత్వం కులగణన తప్పుల తడకగా ఉందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. కానీ కవిత మాత్రం మండలిలోనే ఉండటం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వానికి ఆమె సపోర్టు చేస్తున్నారనే ప్రచారం సైతం జరిగింది.కవిత తీసుకుంటున్న నిర్ణయాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. అసెంబ్లీలో పూలే విగ్రహం కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని సహకరించాలని వామపక్షాల మద్దతు కోరుతున్నారు. సీపీఎం జాగృతి కార్యక్రమాలకు మద్దతు ఇస్తామని, కానీ బీఆర్ఎస్ పార్టీగా చేస్తే మాత్రం ఇవ్వబోమని ఖరాఖండిగా చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. మరోవైపు సీపీఐ పార్టీ మద్దతు సైతం కూడగడుతున్నారు. ఆ పార్టీ నేతలతోనూ ఒకటి రెండ్రోజుల్లో భేటీ కాబోతున్నట్లు సమాచారం. జాగృతి చేసే కార్యక్రమాలకు కలిసి వచ్చే పార్టీలన్నింటితోనూ ముందుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజాసమస్యలపై పోరాటాల్లో మరింత దూకుడు పెంచేందుకు కవిత సిద్ధమవుతున్నారంట. గతంలో ఎన్నడూ లేని విధంగా సొంతంగా రాజకీయంగా ఎదగాలని, తన సత్తా ఏంటో చూపాలని భావిస్తున్నట్లు సమాచారం. అందుకే ఒక వైపు జాగృతి, మరోవైపు పూలే ఫ్రంట్ తో ప్రజలకు దగ్గరై, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కీలక నేతగా ఎదిగేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆమె అనుసరిస్తున్న వ్యూహాలే స్పష్టం చేస్తున్నాయంటున్నారు. ఎఅందులో భాగంగానే జాగృతి కమిటీలు గ్రామస్థాయిలో ఏర్పాటు చేసి సంస్థను పటిష్టం చేయాలని ప్లాన్ చేస్తున్నారంట. మొత్తమ్మీద కల్వకుంట్ల ఫ్యామిలీ పాలిటిక్స్ ఆసక్తికరంగా తయారయ్యాయిప్పుడు.

# రాజధానిలోని అనంతవరం లో మంత్రి నారాయణ పర్యటన

అమరావతి

మంత్రి నారాయణ రాజధానిలోని అనంతవరంలో పర్యటించారు. అమరావతి నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్ కోసం కొండలను మంత్రి, సీఆర్డీయే, మైనింగ్ శాఖల అధికారులు పరిశీలించారు.

మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకంతో రాజధాని పనుల ప్రారంభానికి ఆటంకాలు వచ్చాయి. న్యాయపరమైన సమస్యలు అధిగమించేందుకు 8 నెలలు పట్టింది. 68 పనులకు సంబంధించి 42360 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఈ పనులన్నీ ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. అమరావతి పనులకు అవసరమైన గ్రావెల్ కోసం గనుల శాఖ 851 ఎకరాలు సీఆర్డీయే కు కేటాయించింది. గతంలో అనంతవరం కొండను సీఆర్డీయే కు కేటాయించారు...అయితే గత ప్రభుత్వంలో 8 మీటర్ల లోతు వరకూ తవ్వేశారు. ఇక్కడ భూమిని కూడా ఏదోక అవసరానికి ఉపయోగించాలని చూస్తున్నాం. రాజధాని లో ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ కట్టాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడ లను కలిపి మెగాసిటీ గా చేయాలనేది లక్ష్యం. ఎయిర్పోర్ట్ కోసం కనీసం 5 వేల ఎకరాలు అవసరం. ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకుంటే 30 వేల ఎకరాలు అవసరం. భూసేకరణ చేస్తే రిజిస్ట్రేషన్ ధర పై రెండున్నర రెట్లు మాత్రమే వస్తుంది. భూసేకరణ ద్వారా తీసుకుంటే రైతులు నష్టపోతారని...సమీకరణ చేయాలని స్థానిక ఎమ్మెల్యే లు కోరారు. ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తాం. రాజధానిలో 92 పనులను 64,912 కోట్లతో చేస్తున్నామని అన్నారు.

# జేఎన్టీయూ లో హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన

హైదరాబాద్

కూకట్పల్లి జేఎన్టీయూలో తమ జీతాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళనకు దిగారు. విధులకు హాజరుకాకుండా జేఎన్టీయూ క్యాంపస్ లో విధులు బహిష్కరించారు. రెండేళ్లుగా పోరాడుతున్న 500 రూపాయలు పెంచి పనులు చేయమంటున్నారని ఆరోపిస్తున్న సిబ్బంది ఈనెల 1000 రూపాయలు పెంచుతామని పెంచకుండా యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు.

కార్మిక చట్టం ప్రకారం నెలకు 21000 వేతనం ఇవ్వాలని జేఎన్టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# బావిలో దూకి తల్లికొడుకులు ఆత్మహత్య

సూర్యాపేట

చిలుకూరు మండలం కొత్త కొండాపురంలో దారుణం జరిగింది. వ్యవసాయ బావిలో దూకి తల్లికొడుకు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లి బుడిగం వీరమ్మ, కుమారుడు నాగేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెండు రోజుల క్రితం వీరమ్మ అన్న దొంగరి నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందాడు. తమ బాగోగులు చూసేవారు లేరని ఆందోళనతో మనస్థాపం చెంది తల్లి కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

# హై టెన్షన్ వైర్లు తాకి డ్రైవర్ మృతి

రంగారెడ్డి

శంషాబాద్ పరిధిలోని గగన్ పహాడ్ లో విషాదం జరిగింది. ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గగన్ పహాడ్ పారిశ్రామిక వాడ లో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం తో హై టెన్షన్ వైర్లు తగిలి కంటైనర్ లారీ డ్రైవర్ హరిహర రాయ్ మృతి చెందాడు. మృతుడు బీహార్ వాసిగా గుర్తించారు. డ్రైవర్ తన కంటైనర్ వాహనంతో గగన్ పహాడ్ వద్ద పారిశ్రామిక వాడ కు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గత కొద్ది రోజుల క్రితం కంపెనీ ప్రాంతంలో అధికారులు సిమెంట్ రోడ్డు వేసారు. రోడ్డు ఎత్తు పెరగడంతో కంటైనర్ కి హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ హరిహర రాయ్ మృతి చెందాడు. ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తక్కువ ధరకే స్టీల్, సిమెంట్...

నల్గొండ, ఏప్రిల్ 15,

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఇండ్లులేని నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఈ పథకాన్ని ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఈ పథకం కింద సొంత స్థలం ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం నాలుగు విడతల్లో ఆర్థిక సహాయం అందిస్తారు. ఒక్కో లబ్ధిదారునికి మొత్తం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం లభిస్తుంది. మొదటి విడతగా పునాది కోసం రూ. లక్ష, ఆ తర్వాత గోడల నిర్మాణం, పైకప్పు నిర్మాణం, చివరగా ఇళ్లు పూర్తి అయిన ఇలా నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు అకౌంట్లలో జమ చేస్తారు.ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. మొదటి దశలో అత్యంత నిరుపేదలకు, అర్హులకు మాత్రమే గృహాలను కేటాయించాలని అన్నారు. ఈ పథకం పారదర్శకంగా, నిరుపేదలకు న్యాయం చేసేలా అమలు కావాలని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్లపై శనివారం సాయంత్రం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు అత్యంత జాగ్రత్తగా పనిచేయాలన్నారు. కమిటీలు తయారు చేసిన అర్హుల జాబితాను తహశీల్దార్, ఎంపీడీవో, ఇంజినీర్‌లతో కూడిన మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేసి, ధృవీకరించాలని సూచించారు.ఒకవేళ అనర్హులకు ఇండ్లు కేటాయించబడినట్లు తేలితే వెంటనే ఇందిరమ్మ కమిటీకి తెలియజేసి, ఆ స్థానంలో అర్హులైన వారికి గృహం మంజూరు చేయాలన్నారు. పథకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు. దందాలకు పాల్పడే వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలన్నారు. అనర్హులు ఇండ్లు నిర్మించుకున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలతో పాటు, వారు పొందిన నిధులను వసూలు చేయాలన్నారు. లబ్ధిదారుల సౌకర్యం కోసం అదనపు సదుపాయాలను కల్పించాలన్నారు. గృహ నిర్మాణంలో లబ్ధిదారులు తమ అవసరాలకు అనుగుణంగా 50 శాతం అదనపు స్థలాన్ని నిర్మించుకునే అవకాశం కల్పించాలని సీఎం సూచించారు.ఇందిరమ్మ ఇండ్లకు సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపే లక్ష్యంతో రూపొందింది కాబట్టి ఈ పథకం అమలులో పారదర్శకత, నిజాయితీ ప్రధానంగా ఉండాలన్నారు. అర్హులైన వారికి మాత్రమే ఈ గృహాలు దక్కేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

మంచిర్యాల , ఏప్రిల్ 15: చిన్న నిర్లక్ష్యంతోనే పెద్దపెద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వేసవికాలం వచ్చిందంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా పరిసర ప్రాంతాల్లో ఆకులు, గడ్డి పొదల్లో నిర్లక్ష్యంగా స్మోకింగ్ చేసి వదిలేసిన బీడీ, సిగరెట్లే ఎక్కువ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పెద్దపెద్ద షాపింగ్ మాల్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఎక్కువ డంపింగ్ యార్డులు, గుడిసెలులో తరుచుగా అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. గోదాములు, గిడ్డంగులు వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే తాత్కాలిక నిర్మాణాలు, పందిర్లు గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా ఎండిన గడ్డినే వాడుతారు. గడ్డివాములు గుడిసెలకు దూరం లేకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు గాలికి నిప్పురవ్వలు చెలరేగి ఎక్కువ ఆస్తినష్టం సంభవిస్తుంటాయి. పట్టణాల్లో షాపింగ్ మాల్స్‌లు నిర్మించినప్పుడు ఫైర్ ఇంజిన్ చుట్టు తిరిగేలా కనీసం ఐదు మీటర్లు రోడ్డును ఉంచి నిర్మాణాలు చేపట్టాలి. కానీ పట్టణాల్లో అవేమి పట్టించుకోకుండా ఇష్టారీతిన భవనాలు నిర్మిస్తున్నారు. దానివల్ల ప్రమాదం సంభవించినప్పుడు ఫైర్ ఇంజన్ వెళ్లలేకపోవడంతో ఆస్తినష్టం ఎక్కువగా జరుగుతుంది. ఇంటిలో గ్యాస్‌కు సంబంధించిన పరికరాలు వాడినప్పుడు మహిళలు జాగ్రత్తలు పాటించాలి. అలాకాకుండా నిర్లక్ష్యంతో ఒక్కొసారి గ్యాస్ పేలే అవకాశాలు కూడా ఉంటాయి. దీని వల్ల కూడ అగ్ని ప్రమాదాలు సంభవించే అకాశాలు ఉన్నాయి.

మంచిర్యాల ఫైర్ స్టేషన్‌లో 15 మంది సిబ్బంది ఉన్నారు. ఒక ఫైర్ స్టేషన్ ఆఫీసర్, ఇద్దరు ఫైర్‌మెన్‌లు, ఇద్దరు డ్రైవర్ ఆపరేటర్లు, పది మంది ఫైర్‌మెన్స్ ఉన్నారు. రెండు ఫైర్ ఇంజిన్లు పనిచేస్తున్నాయి. జిల్లాలో ఐదు మండలాలు మంచిర్యాల పరిధిలోకి వస్తాయి. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్, హాజీపూర్, దొనబండ, లక్షెట్టిపేట, మందమర్రి ఫైర్ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. మండలాలు ఎక్కువగా ఉన్నందున మరికొంత మంది సిబ్బందితో పాటు మరొక్క ఫైర్ స్టేషన్ అందుబాటులోకి తెస్తే ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫైర్ అధికారులు తరుచు షాపింగ్ మాల్స్, సినిమా టాకీస్, పెట్రోల్ బంక్, రద్దీ ప్రదేశాల్లో షాపింగ్‌మాల్‌లు ఎక్కువగా తనిఖీలు చేస్తూ ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి.. ఎలాంటి పరికరాలు వాడాలనే దానిపై అధికారులు అవగాహన కల్పిస్తే ప్రమాదాలను నివారించవచ్చు. పారిశ్రామిక ప్రాంతాల్లో భవనాలకు తప్పనిసరిగా ఎన్‌వోసీ తీసుకోవాలి. పాతకాలం బిల్డింగ్‌లకు ఫైర్ సేఫ్టీ లేకుండానే నిర్మాణాలు చేపట్టడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమస్య ఎక్కువగా అవుతుంది. ఫైర్ ఇంజన్ లోపలికి రాకుండా ఉండడం వల్ల అగ్నిప్రమాదాల నివారణ ఒక సవాల్‌గా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు జిల్లా కేంద్రంలో అన్నింటిని పరిగణలోకి తీసుకొని ఎన్‌వోసీ అందజేయాలి. అప్పుడే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.

ఎక్కువగా ప్రమాదాలు నిర్లక్ష్యం వల్లనే సంభవిస్తాయి. మామిడితోటలు, ఇతర తోటల వద్ద ఎండిన గడ్డి, రాలిన ఎండు ఆకులు ఎక్కువగా ఉంటాయి. స్మోకింగ్ చేసి వాటిని పడేయడం వల్ల ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే గడ్డిని, ఆకులను ఎప్పటికప్పుడు తొలగించాలి. ఫైర్ గ్యాప్‌ను పాటించాలి. షాపింగ్ మాల్స్‌లో ఎక్కువగా ఓవర్‌లోడ్ వల్ల షార్ట్‌సర్క్యూట్ అవుతుంటాయి. ఎప్పటికప్పుడు వైరింగ్ కరెక్టు ఉందా లేదా ఓవర్‌లోడ్ లేకుండా చూసుకోవాలి. అలాంటప్పుడే ప్రమాదాలు నివారించుకోవచ్చు. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సును కల్పిస్తున్నాం. ఎక్కడైన ప్రమాదాలు సంభవిస్తే స్టేషన్ ఫైర్ అధికారి ఫోన్ 8712699195, ఫైర్‌స్టేషన్ నంబర్ 8712699194 నంబర్లలో సంప్రదించాలి.

మంచిర్యాల నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అగ్ని ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# భగీరథ బాధలు తీరేదెన్నడు?

మహబూబాబాద్, జిల్లాలోని కొన్ని గ్రామాలు, పట్టణ శివారుల్లోని వివిధ ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాక ఆ ప్రాంత ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలపై ఆధారపడుతున్నారు. జిల్లాకు తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేసే పాలేరు జలాశయంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన నీరు నిల్వ ఉన్నప్పటికీ స్థానికంగా అధికారుల పర్యవేక్షణ, నిర్వహణలోపంతో పలు గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీ, పైపుల పునరుద్ధరణలో జాప్యంతో సాంకేతిక కారణాలతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. బావులు, చేతిపంపులు, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిపై ఆధారపడి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

జిల్లాకు రూ. కోటి నిధులు మంజూరు

అధికార యంత్రాంగం క్షేత్ర పరిశీలన చేసి నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించింది. జిల్లాలో నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ నీటి వనరుల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు రూ. 5.48 కోట్ల అంచనాలతో నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం జిల్లాకు రూ. కోటి నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో లీకేజీల పునరుద్ధరణ, పైపులైన్లు, చేతిపంపులు, బోరుబావుల మరమ్మతులు, బావుల పూడికతీత, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఆ నిధులను వెచ్చించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా అవసరాల మేర తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ కృష్ణారెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించినట్లు పేర్కొన్నారు.

# మాతంగి ప్రభాకర్ రావు దంపతులను ఘనంగా సన్మానించిన సుతారి శ్రీనివాసరావు



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్ 15:హుజూర్ నగర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్నేహశీలి, సౌజన్య మూర్తి, ఉత్తమోపాధ్యాయులు, సామాజిక సేవాతత్పరుడు, మానవతావాది, విద్యారత్న, దళితరత్న అవార్డు గ్రహీత మాతంగి ప్రభాకర్ రావు పదవీవిరమణ వీడ్కోలు మహోత్సవం, నియోజకవర్గ స్థాయిలో, అక్షర సన్మానోత్సవం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ప్రముఖులందరూ పాల్గొన్నారు. వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గులాబీల గజమాలతో, శాలవతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈసందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడిజిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని కొనియాడారు, అటువంటి వృత్తిలో కొనసాగి పదవీవిరమణ చేస్తున్న మాతంగి ప్రభాకర్ రావు దంపతులను కొనియాడుతూ ఘనంగా సన్మానించడం జరిగింది. పేద విద్యార్థులకు తనవంతు సేవలందించారు. పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకొని, తన వంతు కృషిచేసినారని తెలిపారు.

# బాల విద్యతో భవిష్యత్ కు బంగారు బాట: సీడీపీవో జయరాం నాయక్



గుమ్మడిదల, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 15: :గుమ్మడిదల మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీవో జయరాం నాయక్ పాల్గొని మాట్లాడారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అదేవిధంగా మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని టీచర్లను ఆదేశించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా చిన్నారులు ప్రత్యేక దుస్తులు ధరించారు. ప్రయివేటుకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలు బాల విద్య ద్వార బాలల భవితకు బంగారు బాటలు వేసే విధంగా ముందుకు సాగుతున్నాయని అన్నారు. తల్లి దండ్రులు ఈ విషయాన్ని గ్రహించి తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్ కుమార్ పాల్గొని మాజీ సర్పంచ్ తులసి దాస్ తో కలిసి చిన్నారులకు మెమోంటోలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ కవిత, మాజీ వార్డు సభ్యురాలు లలిత, మంద భాస్కర్ రెడ్డి, ఎలుక కృష్ణ అంగన్వాడీ టీచర్లు పోచమ్మ, శైలజ, గిరిజ ,పుష్ప, మంగమ్మ లతో పాటు తల్లి తండ్రిలు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి.

## విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పి నరసింహ



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) ఏప్రిల్ 15:సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ ను సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆకస్మికంగా తనిఖీ చేసినారు.పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించి ఫిర్యాదుల నిర్వహణను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదును రిజిస్టర్ నందు నమోదు చేయాలని ఫిర్యాదుదారులతో గౌరవంగా, మర్యాదగా నడుచుకుంటూ వారికి పోలీసు సేవలపట్ల నమ్మకం కలిగేలా త్వరితగతిన ప్రాథమిక దర్యాప్తు పూర్తిచేసి బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ నిర్వహణ, వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలు ఇతర సామాగ్రి పరిశీలించారు. సిసి కెమెరా కంట్రోల్ సెంటర్ ను పరిశీలించారు, పట్టణంలో సిసి కెమెరాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలి, సిసి కెమెరాల యొక్క ఉపయోగం ప్రజలకు వివరించాలని తెలిపారు. రౌడీ షీటర్స్ పై, ల్యాండ్ గ్రాబర్స్ పై నిఘా ఉంచి ఇలాంటి వారి నుండి ప్రజలకు ఇబ్బందులు కలిగినట్లు పిర్యాదులు వస్తె వ్యక్తులు ఎంతటివారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

అలవాటుగా నేరాలకు పాల్పడే వారిపై, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ప్రజల రద్దీ వాహనాల రద్దీ దృష్ట్యా పోలీస్ శాఖ అత్యంత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వాహనాలు నడుపుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేసే విధంగా పెద్ద శబ్దాలతో వాహనాలు నడిపే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని వాహనాలు సైతం సీజ్ చేయాలని తెలిపారు.పట్టణంలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పల్పడేవారిపై, బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలి అన్నారు. రాత్రిళ్ళు పెట్రోలింగ్ నిర్వహిస్తూ కొత్త వ్యక్తులు, అనుమానస్పద వ్యక్తుల కదలికలు గమనించాలని అన్నారు. జాతీయరహదారి వెంట ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపితే ఎన్ఫోర్స్మెంట్ కేసులు చేయాలని ఆదేశించారు.పోలీసు సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు, ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియపరచాలి, అందరూ కలిసి పని చేయాలన్నారు. పట్టణ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, ఎస్ ఐ లు ఆంజనేయులు, సైదులు, ప్రవీణ్, ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు



ఖమ్మం, అకాల వర్షం, ఈదురుగాలులు అన్నదాతల రెక్కల కష్టాన్ని కడగండ్ల పాల్జేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కళ్లెదుటే నష్టపోతుండటంతో బాధితులు కంటతడిపెడుతున్నారు. బోనస్‌పై వస్తుందనే ఆశతో సన్నాలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెడుతున్నారు. అక్కడ కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతుండటంతో నిరీక్షించాల్సి వస్తోంది.

ఖమ్మం జిల్లాలో యాసంగి సీజన్‌లో 2.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సన్నాలు 1.89 లక్షల మె.ట., దొడ్డు రకాలు 70 వేల మె.ట. రావొచ్చని అంచనా వేశారు. ధాన్యం సేకరణకు ఈనెల 1న 344 కేంద్రాలు ప్రారంభించినట్లు అధికారులు ప్రకటించారు. గత రెండు వారాల్లో సన్నాలు 2 వేల మె.ట., దొడ్డు రకాలు మరో 200 మె.ట. మాత్రమే కొనుగోలు చేశారు. లక్ష్యం మేర సేకరణ ముందుకు సాగడం లేదు. కాంటాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. బస్తాలను మిల్లులకు తరలించేందుకు మరింత సమయం పడుతోంది.

వర్ష సూచనతో భయం.. భయం

గత కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వడగండ్ల వానలు పడుతున్నాయి. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రాశుల్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులుపెడుతున్నారు. టార్పాలిన్ పట్టాలు అరకొరగా ఉండటంతో బయట అద్దెకు తెచ్చుకోవాల్సి వస్తోంది. తడిసిన పంటను ఆరబెట్టుకునేందుకు ఇంటిల్లిపాది రేయింబవళ్లు కష్టపడుతున్నారు. మరో మూడ్రోజుల పాటు వర్షసూచన ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా కొనుగోళ్లలో వేగం పెంచాలని అధికారులను కోరుతున్నారు.

బోరున విలపిస్తున్న మహిళా రైతు పేరు చంద్రకళ. కల్లూరు మండల కేంద్రానికి చెందిన చంద్రకళ దంపతులు 18 ఎకరాలు కౌలుకు తీసుకుని ధాన్యం పండించారు. కొనుగోలు కేంద్రం వద్ద 20 రోజుల క్రితమే ఆరబోసుకున్నారు. ఒక్క బస్తా కూడా అమ్మలేదు. ఆదివారం కురిసిన వర్షానికి చాలా ధాన్యం కొట్టుకుపోవటంతో విలపిస్తున్నారు.

# అప్రమత్తంగా లేకుంటే.. ఇంట్లో‘కారు’చీకట్లే

కాజీపేట

ఇలా జాగ్రత్తపడండి..

ఇంటి ముందు, లేదా సెల్లార్‌లో పార్కింగ్ చేసినప్పుడు తప్పకుండా తాళం వేసుకోవాలి.

ఆధునిక సౌకర్యాలు ఉన్న కారులో లాక్‌కు సంబంధించిన అనేక ఫీచర్లు ఉంటాయి. అన్ని కార్లలో ఉండేలా ప్రభుత్వం నిబంధన పెట్టాలి.

లాక్ చేయనప్పుడు లేదా ఎవరైనా తలుపులు తీసే ప్రయత్నం చేసినప్పుడు రక్షణ అలారం మోగే ఫీచరు తప్పనిసరి.

ఇంటివద్ద పార్కింగ్ ప్రాంతంలో సీసీ కెమెరాలను బిగిస్తే ఎప్పటికప్పుడు భద్రంగా చూసుకోవచ్చు. పిల్లలు కారు వద్ద ఏం చేస్తున్నారనేది గమనించొచ్చు.

కొందరు బేసిక్ మోడల్ వాహనాన్ని కొని దానికి లాక్‌కు సంబంధించిన అదనపు ఫీచర్లను ఏర్పాటు చేసుకుంటారు. ఇలాంటివి తలుపు తీసినా, వేసినా కొద్ది సేపటికే ఆటోమేటిక్‌గా లాక్ అవుతాయి. ఇది కూడా ప్రమాదమే.. లాక్ కావడానికి సమయం ఉండాలి.

ప్రయాణం చేస్తున్నప్పుడు చిన్న పిల్లలను వెనకవైపు కూర్చోపెట్టాలి. చైల్డ్ లాక్ వేసుకోవాలి.

పార్కింగ్ చేసినప్పుడు చిన్నారులను కారులో పడుకోపెట్టడం, లేదా వారిని అందులో ఉంచి తాళం వేయడం చేయొద్దు. తప్పనిసరి అనుకుంటే వారితోపాటు పెద్దలను ఉంచి.. తాళం వేయొద్దు. లేదా అందులో ఉన్న పెద్దలకు తాళం చెవి ఇచ్చి ఏసీ ఆన్‌లో పెట్టాలి.

నడుపుతున్నప్పుడు ఏసీ బటన్ పక్కన ఎయిర్ రీసర్క్యులర్ అనే బటన్‌ను ఆన్ చేసి పెట్టాలి. ఇది లోపలి గాలిని బయటకు పంపుతుంది.

తప్పకుండా బ్యాక్ కెమెరాలు, సెన్సర్లు ఉండేలా చూసుకోవాలి. వెనక్కు తీస్తున్నప్పుడు చిన్నారులు ఉంటే తెలుస్తుంది. యజమానికి కూడా భద్రతను ఇస్తాయి.

ఇప్పుడు పెద్ద కార్లలో స్కైరూఫ్ ఉంటోంది. వేగంగా వెళుతున్నప్పుడు స్కైరూఫ్ ద్వారా పిల్లలు పైకి వెళ్లకుండా చూడాలి.

అద్దం కొంత తీసి ఉండాలి

కారును పార్కింగ్ చేసినప్పుడు ఒక సెంటీమీటరు లేదా అంతకంటే కొంత తక్కువగా ఏదో ఒక అద్దాన్ని తీసి ఉంటే గాలి ఆడుతుంది. అద్దాలు కొంత తీసి ఉంచడం వల్ల దుమ్ము, వర్షపునీరు లోనికి వెళ్లకుండా అద్దాల పైన డోర్ వైపర్లను అమర్చుకోవాలి.

# భూ సేకరణలో జాప్యం

రంగశాయిపేట: అంతర్ వలయ రహదారి(ఇన్నర్ రింగురోడ్డు) భూసేకరణ ప్రక్రియలో కదలిక రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రూ.107 కోట్లు విడుదల చేసి రెండు నెలలవుతున్నా.. భూ నిర్వాసితుల ఎంపిక, పరిహారం చెల్లింపు చేపట్టడం లేదు. ఇప్పటి వరకు కేవలం 10-15 మంది పేర్లు సిఫారసు చేశారు. ఇంకా 100 మంది స్థలాల వివరాలు పరిశీలించాల్సి ఉంది. దీంతో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా), వరంగల్ జిల్లా రెవెన్యూ శాఖల మధ్య సమన్వయలోపం ఉందనే విమర్శలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, వరంగల్ జిల్లా కలెక్టర్ చొరవ చూపితేనే సమస్య పరిష్కారం అవుతుందని రైతులు, ప్రైవేటు స్థలాల యజమానులు అంటున్నారు. ఖిలా వరంగల్ మండలం, వరంగల్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, ‘కుడా’ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏడాది నుంచి నిధుల్లేవని సాకులు చెప్పారు, ప్రభుత్వం నిధులు విడుదల చేసినా.. లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయడం లేదనే విమర్శలున్నాయి.

35 ఎకరాలు అవసరం

రంగశాయిపేట నాయుడు పెట్రోల్ పంపు, గవిచర్ల క్రాస్‌రోడ్, దూపకుంట రోడ్, మై మాస్టర్ స్కూల్, ఖిలా వరంగల్ తూర్పు కోట శివారు, స్తంభంపల్లి, గొర్రెకుంట శివారు, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ శివారు వరకు తొలి విడత ఇన్నర్ రింగురోడ్డుకు 130-140 ఎకరాలు కావాలి. సుమారు 100-110 ఎకరాలు సేకరించారు. మరో 35 ఎకరాలు తీసుకోవాలి. భూ నిర్వాసితుల జాబితా ఉంది. దస్తావేజులు, పాత రికార్డులు పరిశీలించి లబ్ధిదారుల పేర్లను రెవెన్యూ శాఖ సిఫారసు చేస్తే ‘కుడా’ అధికారులు చెల్లింపులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఆగిన పనులు

రంగశాయిపేట నాయుడు పెట్రోల్ పంపు కూడలి నుంచి స్తంభంపల్లి శివారు వరకు ఇన్నర్ రింగురోడు పనులు ఆగిపోయాయి. భూసేకరణ పూర్తి చేసి క్షేత్రస్థాయిలో మార్కింగ్ ఇవ్వాల్సి ఉంది. సుమారు 6 కిలో మీటర్ల పరిధిలో చాలా అడ్డంకులున్నాయి. కొంత మంది ప్రైవేటు రోడ్డుకు అడ్డంగా కంచె ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇప్పుడే తగిన సమయమని, వర్షాకాలంలో పనులకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

# ‘హాల్‌మార్క్ విధానంతో వినియోగదారులకు నష్టం’

మట్టెవాడ, బంగారు ఆభరణాల నాణ్యత విషయంలో హాల్‌మార్కు విధానం విఫలమవుతుందని, దీంతో అన్నివర్గాల వినియోగదారులు నష్టపోతున్నట్లు వినియోగదారుల సమన్వయ సమితి జాతీయ కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. సోమవారం వరంగల్ నగరంలోని ఓ వేడుకల మందిరంలో దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సాంబరాజు చక్రపాణి మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు, హైదరాబాద్‌లో 18 హాల్‌మార్కు కేంద్రాల లైసెన్స్‌లు తాత్కాలికంగా రద్దయ్యాయని తెలిపారు. దీనికి కారణం బంగారు ఆభరణాల నాణ్యత విషయంలో ఆయా హాల్‌మార్కు కేంద్రాల నాసిరకం పనులు కారణమని ఆరోపించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిబంధనలు పాటించేలా అధికారులు నిరంతరం తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, భిక్షపతి, రంజిత్‌కుమార్, వివిధ జిల్లాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పంటలను నిండా ముంచిన వర్షం

జనగామరూరల్, జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ దేవరుప్పుల, కొడకండ్ల, లింగాలఘనపురం మండలాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన రైతులకు కన్నీటిని మిగిల్చింది. వడగళ్లు ఈదురుగాలులతో కూడిన వర్షంతో పలు గ్రామాల్లో చేతికొచ్చిన వరిపంట దెబ్బతిన్నది. పొలాల్లోనే ధాన్యం నేల రాలింది మామిడితోటల్లో కాయలు రాలిపోయాయి. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. జనగామలోని వ్యవసాయమార్కెట్‌తో పాటు పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసుకున్న ధాన్యం తడిసి ముద్దయింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట



నేలపాలు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

చేతికందే దశలో వరి, మామిడి

జిల్లాలో ప్రధాన పంట వరిని 1.82 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పటికే 25 శాతం పంట కోతలు పూర్తి కాగా మిగతా పంటను మరో 10 రోజుల్లో కోసేందుకు సిద్ధమయ్యారు. వరికి చివరి నీటి తడులు పూర్తయ్యాయి. సకాలంలో పంట కోతలు చేపట్టకపోవడంతో రైతులు పంటలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికారుల పరిశీలన

జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామారావునాయక్ ఆధ్వర్యంలో మండల, క్లస్టర్ అధికారులు సోమవారం పరిశీలించి ప్రాథమికంగా నష్టాన్ని అంచనా వేశారు. చిల్పూరులో వరి పంట 1010 ఎకరాలు, దేవరుప్పులలో వరి 88 ఎకరాలు, మామిడి-4, జనగామలో వరి 2,291, మామిడి 367, కొడకండ్లలో వరి-74 ఎకరాలు, లింగాలఘనపురంలో వరి-240, మామిడి-125, పాలకుర్తిలో వరి-280, తరిగొప్పులలో వరి-60 ఎకరాల్లో దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేశారు. వీటిలో 50-100 శాతం మేర నష్టం వాటిల్లినట్లు నివేదికలో వెల్లడించారు.

కలెక్టర్ ఆదేశాలు..

వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలపై పూర్తి స్థాయిలో సర్వే చేసి సమగ్ర నివేదిక అందించాలని వ్యవసాయశాఖ జిల్లా, మండల, క్లస్టర్ అధికారులను కలెక్టర్ రిజ్వాన్‌బాషా ఆదేశించారు.

# సర్వే.. సమగ్ర పరిశీలన

రాజపేట, : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాల కోసం ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా.. ఆశించిన మేర విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సర్కారు పాఠశాలల్లో నెలకొన్న సదుపాయాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టనుంది. ఇటీవల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఈ విషయమై ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బీఈడీ, డీఈడీ చదువుతున్న విద్యార్థులతో (ఛాత్రోపాధ్యాయులు) ఈ సర్వే చేపట్టనున్నారు. ఈ విషయమై సోమవారం సదరు ఛాత్రోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారులు జూమ్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్ (డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన సమాచారంపై విద్యాశాఖ తొలిసారిగా థర్డ్‌పార్టీతో సర్వే చేయిస్తుంది. ఈ నెల 15 నుంచి 21 వరకు ఎంపిక చేసిన పాఠశాలల్లో వారు వాస్తవ పరిస్థితులను పరిశీలించి ధ్రువీకరిస్తారు. అత్యంత ప్రామాణికమైన ఈ రిపోర్టు ఆధారంగా పాఠశాలలకు బడ్జెట్‌ను కేటాయిస్తున్నందున ఈ సర్వేకు ప్రాధాన్యం సంతరించుకుంది.

గోప్యంగా.. ప్రామాణికంగా..

యూడైస్‌లో నమోదు చేసే వివరాలు అత్యంత గోప్యంగా, ప్రామాణికంగా ఉంటాయి. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు 'యూడైస్ ప్లస్'లో వివరాలను సమగ్రంగా నమోదు చేస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీల వివరాలు, మౌలిక వసతులు, ఆధార్ అనుసంధానం, మధ్యాహ్నభోజన పథకం, ఏకరూప దుస్తుల పంపిణీ, పాఠ్యపుస్తకాల సరఫరా తదితర వివరాలు ఇందులో నమోదవుతాయి. పాఠశాలలో వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యూల్స్‌గా విభజించి సమాచారం నిక్షిప్తం చేశారు. పాఠశాలలో క్రీడా స్థలం ఉందా, గదులెన్ని, ఇంకా ఏమేం అవసరం, ఫర్నీచర్, ల్యాబ్, ఇతర సదుపాయాలు ఉన్నాయా అమలవుతున్న కార్యక్రమాలు ఇందులో ఉంటాయి.

15 నుంచి 21 వరకు..

పాఠశాల విద్యా వ్యవస్థ ప్రామాణికతను అందించే నివేదిక ఇది. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 15 నుంచి 21 వరకు ప్రతి రోజు రెండు పాఠశాలల చొప్పున వీరు పరిశీలిస్తారు. పాఠశాలల్లో ఉన్న వాస్తవ పరిస్థితులు, వివరాలన్నీ యూడైస్‌లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేశారా..? విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనేది రిపోర్టులో నమోదు చేసిన వివరాల ద్వారా భౌతికంగా పరిశీలన చేసి ధ్రువీకరిస్తారు. తప్పులుంటే సరిచేయాలని ప్రధానోపాధ్యాయులకు రిమార్కు రాసి ఇస్తారు. వాటిని అదే రోజు సీఆర్పీల సహకారంతో సరి చేయాల్సి ఉంటుంది. ఈ సర్వేను జిల్లా విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

సర్వే చేయనున్నపాఠశాలలు : 672

ఛాత్రోపాధ్యాయుల సంఖ్య: 60

# ఎడాపెడా ఉల్లంఘనలు.. రూ.కోట్లలో చలాన్లు



వరంగల్‌క్రైం: ద్విచక్ర వాహనం తీసుకొని బయటకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి చరవాణికి సంక్షిప్త సమాచారం వస్తుంది. తెరచి చూస్తే మీరు ఈ రోడ్డులో ఈ సమయంలో ప్రయాణించారు. వాహనంపై ప్రయాణిస్తున్నప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటించలేదు. శిరస్త్రాణం ధరించలేదు అంటూ చలానా కన్పిస్తుంది. ఇది తరచూ నగరంలో రోడ్లపై తిరుగుతున్న ద్విచక్ర వాహనదారుల ఆవేదన. పోలీసులు మాత్రం ప్రమాదాలను నివారించేందుకు, అవగాహన, అప్రమత్తత పెంచేందుకే చలాన్లు వేస్తున్నామంటున్నారు. అయినా చాలా మందిలో మార్పు రావడం లేదని వారంన్నారు. ప్రతి వాహనంపై సుమారు నాలుగు నుంచి పది చలాన్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో వాహనాలను తనిఖీ చేసిన సమయంలో పోలీసులు పెండింగ్ చలాన్లను కట్టాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. కొంతమంది కడుతున్నారు. మరికొందరు మాత్రం కట్టకుండా వారికి ఉన్న పలుకుబడి ఉపయోగించుకొని తప్పించుకుంటున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం గత మూడు నెలల్లో సుమారు రూ.4.5 కోట్ల మేర చలాన్లు విధించింది.

రాయితీ ఇచ్చినప్పుడు కడదాంలే..

రాష్ట్ర వ్యాప్తంగా చలాన్లపై ప్రభుత్వం రాయితీ ప్రకటిస్తోంది. గతంలో ఇలా ప్రకటించిన సమయంలో చాలా మంది వాహనదారులు పెండింగ్ చలాన్లు చెల్లించారు. తర్వాత చలాన్లు పడినా ప్రభుత్వం రాయితీ ప్రకటించిన సమయంలో తిరిగి చలాన్లను చెల్లించవచ్చనే ధీమాతో ఉంటున్నారు. పోలీసులకు పట్టుబడిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలో ఎక్కువగా శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడిపిన వారే ఎక్కువగా ఉంటున్నారు. దాదాపు నగరంలో అన్ని ప్రధాన ట్రాఫిక్ కూడళ్లలో చాలా మంది పోలీసులు ఫొటోలు తీస్తూ చలాన్లను విధిస్తున్నారు. కాజీపేట నుంచి వరంగల్ వరకు ప్రధాన రహదారిపై శిరస్త్రాణం లేకుండా ప్రయాణిస్తే తప్పకుండా చలానా రావడం ఖాయం. మరోవైపు చరవాణిలో మాట్లాడుతూ.. బండి నడపటం, సిగ్నళ్ల వద్ద ఆపకుండా వెళ్లడం వల్ల కూడా జరిమానాలు పడుతున్నాయి.

# దొంగలొస్తారు.. జర జాగ్రత్త

భువనగిరి నేరవిభాగం, సాధారణంగా వేసవిలో దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు సొత్తు ఎత్తుకెళుతుంటారు. గత ఏడాది ఏప్రిల్ నెలలో జిల్లాలో ఓ ముఠా వరస దొంగతనాలకు పాల్పడింది. తాళం వేసిన ఇళ్లు, ఆరుబయట నిద్రించేవారిని లక్ష్యంగా చేసుకొని ఆభరణాలు దోచుకెళ్లింది. పోలీసులకే సవాలు విసిరిన ముఠా చివరికి చిక్కి జైలు పాలైంది. ఈ వేసవిలోనూ ప్రజలు అప్రమత్తంగా ఉండలాని పోలీసు శాఖ సూచిస్తోంది.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

ఆలేరులో ఈ నెల 5న ఓ మహిళ ఉదయం నడకకు వెళుతుండగా దుండగుడు మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు.

చౌటుప్పల్‌లో ఓ ఏటీఎం కేంద్రాన్ని కొల్లగొట్టారు. రూ.12 లక్షలు నగదు దొచుకెళ్లారు.

ఇటీవల చౌటుప్పల్ మండలంలోని పంతంగి, ఎస్ లింగోటం గ్రామాల్లో దేవాలయాల్లో హుండీలు పగులకొట్టి బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.

మోటకొండూరు, ఆత్మకూరు, భువనగిరి మండలాల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల అయిల్, కాపర్ తీగలను ఎత్తుకెళ్లారు.

నిఘా పెంచితేనే

కరుడుగట్టిన పాత నేరస్థులు, అంతర్ రాష్ట్ర ముఠాలపై పోలీసులు నిఘాను పటిష్ఠం చేయాలి.

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు, పెట్రోలింగ్ మరింతంగా పెంచాలి.

పదే పదే చోరీలకు పాల్పడే దొంగల కదలికలపై దృష్టి సారించాలి.



రాత్రి వేళలో పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ బృందాలను పెంచాలి. సీసీ కెమెరాల పనితీరును సమీక్షించి మరమ్మతులు చేయించాలి.

ఇలా చేయండి

వేసవిలో ఆరు బయట నిద్రించేప్పుడు విలువైన బంగారు ఆభరణాలను ధరించొద్దు. బీరువాలకు తాళం వేసిన తాళం చెవి సురక్షితమైన ప్రాంతంలో ఉంచాలి.

ఇంట్లో లేనప్పుడు విలువైన వస్తువులు సురక్షిత ప్రాంతాల్లో దాచుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంటి బాధ్యత నమ్మకస్తులకు అప్పగించాలి.

రోజుల తరబడి ఊరికి వెళ్లాల్సివచ్చినప్పుడు సంబంధిత ఠాణాలో పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

గ్రామాల్లో స్థానికుల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. చోరీలు జరిగినా నిందితులను తొందరగా పట్టుకునేందుకు నిఘా నేత్రాలు దోహదపడతాయి.

# ఆదాయం.. అంతంతే..

నల్గొండ : ఉమ్మడి జిల్లాలోని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు గడిచిన ఆర్థిక ఏడాదిలో వచ్చిన ఆదాయం నామమాత్రంగానే ఉంది. 2023-24 ఆర్థిక ఏడాదితో పోల్చితే 2024-25 ఏడాదిలో అదనంగా రూ.7 కోట్లు మాత్రమే పెరిగింది. గత ఏడాదిలో రూ.412.37 కోట్లు వస్తే 2024-25లో మార్చి చివరి నాటికి రూ.419.49 కోట్లు వచ్చాయి. ప్రభుత్వానికి ఆదాయం పెరిగినా

FONT SIZE




సంబంధిత శాఖ లక్ష్యానికి చేరువ కాలేకపోయింది. జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా గత ఏడాది 1,43,426 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరగ్గా.. ఈఏడాది 1,38,729 జరిగాయి. రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నా పెరిగిన ధరలతో రూ.7 కోట్లు ఆదాయం వచ్చింది. అత్యధికంగా నల్గొండ, సూర్యాపేట, యాదగిరిగుట్ట, దేవరకొండ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ తరువాత స్థానాల్లో చౌటుప్పల్ భువనగిరి, బీబీనగర్ కోదాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.

అవగాహన పెరిగి..

జిల్లాలో గత ఆర్థిక ఏడాదిలో భూముల క్రయ,విక్రయాలు అనుకున్న స్థాయిలో జరగలేదని సంబంధిత అధికారులు వాపోతున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది వంద గజాల స్థలం కొనుగోలు చేసేవారు కూడా అన్ని విధాలా పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వ భూమి, శిఖం భూమి, ఎఫ్‌టీఎల్, నాన్ ఎఫ్‌టీఎల్ వంటి, వెంచర్ల అనుమతులు, నాలాల అనుమతులతో పాటు ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులపై అన్ని వర్గాల వారిలో అవగాహన పెరిగింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేని భూములను కొనుగోలు చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

వేగవంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ అవినీతికి తావులేకుండా చూస్తున్నాం. మధ్యవర్తులు లేకుండా అధికారులు, సిబ్బందితో పనులు చేయించుకోవాలి. అవినీతికి పాల్పడేవారి సమాచారం ఇచ్చేవారు నేరుగా జిల్లా కార్యాలయంలో సంప్రదించవచ్చు. ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్‌లు త్వరలో అన్ని కార్యాలయాల్లో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

# వ్యాఘ్రం.. రక్షణ శీఘ్రం

తాడ్వాయి, మూడు రోజులుగా ములుగు జిల్లా తాడ్వాయి మండల అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి సంరక్షణకు జిల్లా అటవీశాఖ చర్యలు చేపట్టింది. ఎంతో అనుకూలత వాతావరణం, ఆహారం దొరికే ప్రదేశాల్లోనే పులి సంచరిస్తుంది. ఈ ఏడాది వర్షాకాలంలో సైతం నర్సాపురం, లింగాల ప్రాంత అడవుల్లో వారం పాటు సంచరించింది. దీనిపై దృష్టిసారించిన అధికారులు పెద్ద పులి రక్షణపై దృష్టి సారించారు.

బయ్యక్కపేట అడవుల్లోనే మకాం

భూపాలపల్లి జిల్లా అడవుల నుంచి ఈనెల 11వ తేదీకి ముందు తాడ్వాయి అడవుల్లో పులి ప్రవేశించింది. కాల్వపల్లి, బయ్యక్కపేట అడవుల్లో సంచరిస్తోంది. అదేరోజు ముసలమ్మపెంటకు చెందిన గొత్తికోయగిరిజనుడి ఆవును వేటాడి ఆకలి తీర్చుకొంది. సమీప గ్రామాల ప్రజల సమాచారంతో రంగంలోకి దిగిన అటవీ శాఖ అదేరోజు పులి అడుగులు గుర్తించింది. వేటాడిన ఆవు మృతకళేబరం వద్దకు పులి మళ్లీ వచ్చే అవకాశం ఉండటంతో.. అధికారులు కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశారు. 11, 12 తేదీల్లో కనిపించిన పులి ఆనవాళ్లు 13, 14 తేదీల్లో కనిపించలేదు. అంతేగాక దూర ప్రదేశాలకు వెళ్లిన ఆనవాళ్లు సైతం దొరకలేదు. దీంతో ఇదే ప్రాంతంలో విశ్రాంతి తీసుకొనే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



ఆ ప్రాంతంలోనే కి అనుకూలతలెన్నో..

రోజుకు 40 కి.మీ.కు పైగా దూరం సంచరించే పులి తాడ్వాయి మండలానికి ఎప్పుడు వచ్చినా.. వారం రోజులపాటు ఇక్కడే మకాం వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనికి ప్రధానం కారణం ఈ మండలంలో వేసవిలో సైతం జీవనదుల్లా ప్రవహించే వాగులున్నాయి. దట్టమైన అడవి, ఎత్తయిన గుట్టలు, లోయలు, గుహలున్నాయి. వీటికితోడు ఈ ప్రాంతంలో పులికి ఆహారం సులభంగా దొరికే అవకాశం ఉంది. బయ్యక్కపేటలోని నీలంతోగు, చక్కెరతోగు, తూములవాగు, వట్టివాగు, కాల్వపల్లిలోని తుమ్మలవాగు, మేడారంలోని నేరేళ్లవాగు, నర్సాపురంలోని గౌరారం వాగు, నర్సింహులవాగుల్లో నిత్యం నీటి ప్రవాహం ఉంటుంది.

గత నాలుగైదు రోజులుగా మండలంలో సంచరిస్తున్న పెద్దపులి ఆడ, మగదా అనే చర్చలు సాగుతున్నాయి. అడవుల్లో గాలిస్తున్న అధికారులకు స్పష్టమైన పులి పాదముద్రలు లభించాయి. వీటిని పరిశీలించిన అధికారులు కొందరు ఆడపులిగా పేర్కొంటున్నారు. ఈ ముద్రలు కొంచెం చిన్నగా ఉన్నాయని, ఇది ఆడ పులి కావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతోన్నాయి. మరికొందరు మాత్రం ఆడపులితో పిల్లలు కూడా ఉంటాయని, ఇది మగది అయ్యే అవకాశం ఉంటుందంటున్నారు. దీనిపై పూర్తి స్పష్టత లేదని, పులి కెమెరా ట్రాప్‌లో చిక్కితే వివరాలు తెలుస్తాయని చెబుతున్నారు.

రంగంలోకి 40 మంది అధికారులు

సరిహద్దులు దాటి జిల్లాకు వచ్చిన పులి రక్షణకు 40 మంది అధికారులు కదిలారు. ఏటూరునాగారం ఎఫ్‌డీవోతో పాటు మేడారం, తాడ్వాయి, పస్రా, దూదేకులపల్లి రేంజ్, సెక్షన్, బీట్ అధికారులతో పాటు బేస్ క్యాంపు సిబ్బంది శ్రమిస్తున్నారు. కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశారు. సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి కొంతకాలం పాటు అడవులకు వెళ్లొద్దని సూచిస్తున్నారు. పులి నుంచి పశువులకు నష్టం జరిగితే పరిహారం అందిస్తామని, హాని కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరిస్తున్నారు.

# మరాడేనా..

, నల్గొండ: ధాన్యం మరాడించేందుకు మిల్లర్లు ప్రభుత్వానికి 10 శాతం మేర బ్యాంకు గ్యారంటీ ఇస్తేనే కస్టమ్ రైస్‌మిల్లింగ్(సీఎంఆర్) చేసేందుకు పౌరసరఫరాల శాఖ అనుమతులు ఇస్తుంది. మిల్లర్లు ఈ నిర్ణయంపై పలువిధాలుగా తర్జన భర్జనలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాలను ఆయా సమీపంలో ఉన్న బియ్యం మిల్లులకు గతంలో పౌరసరఫరాల మార్కెటింగ్ శాఖ ఎలాంటి బ్యాంకు గ్యారంటీ లేకుండానే కేటాయించేది. మిల్లర్లు సకాలంలో బియ్యం అప్పగించకపోవడం, అవకతవకలకు పాల్పడటం, దివాళా తీయడం, రీసైక్లింగ్‌కు పాల్పడటం వంటి చర్యల కారణంగా ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీని తప్పనిసరి చేసింది.

సీఎంఆర్‌ను ఎగవేసేందుకు అవకాశం కోసం వేచిచూస్తున్న కొందరు మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను చెల్లించేందుకు ఆసక్తి చూపడం లేదు. పౌరసరఫరాల శాఖ సిబ్బందికి ఆయా స్థానిక ప్రజాప్రతినిధులతో 'ఫోన్లు' చేయించి అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారని తెలిసింది. ప్రభుత్వం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము బ్యాంకు గ్యారంటీని తప్పనిసరి చేశామని అప్పగిస్తేనే ఇస్తామని చెబుతుండటంతో మిల్లర్లు ఖంగుతింటున్నారు.

దీంతో మిర్యాలగూడ, నల్గొండ, నకిరేకల్ ప్రాంతాల్లోని కొందరు మిల్లర్లు ప్రైవేటుగా రైతుల నుంచి సన్నధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 384 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో.. కొనుగోళ్ల ప్రక్రియ ఊపందుకుంది. ఏప్రిల్ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ ముగియనుంది. సేకరించిన ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ సీఎంఆర్ కింద రైస్‌మిల్లులకు ధాన్యం అప్పగించాల్సి ఉంటుంది. ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేయగా.. ఇప్పటి వరకు 70 మంది మిల్లర్లు మాత్రమే గ్యారంటీ అప్పగించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ మార్కెటింగ్ మేనేజర్ హరీశ్ తెలిపారు



# అంతా పంతే చేశాడు

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ , చెన్నై సూపర్ కింగ్స్ కు మధ్య సోమవారం జరిగిన ఉత్కంఠ పోరులో ధోనీ సేన విజయం సాధించింది. హెూరాహెూరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్‌గా అనుభవలేమితో బౌలర్ల ఎంపికలో రిషభ్ పంత్ తీసుకున్న ఓ నిర్ణయం బెడిసి కొట్టింది. చెన్నై చేతిలో లఖ్‌నవూ పరాజయం పాలయ్యేలా చేసింది. చక్కగా బౌలింగ్ చేస్తున్న రవి బిష్ణోయ్‌కు ఆఖరి ఓవర్లలో బంతి ఇవ్వకుండా పంత్ పేసర్ల వైపు మొగ్గు చూపాడు. ఈ వ్యూహాత్మక తప్పిదవే లఖ్‌నవూ పరాజయానికి కారణమైందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. చెన్నై విజయానికి చివరి నాలుగు ఓవర్లలో 44 పరుగులు అవసరమైన వేళ క్రీజులో ఎంఎస్ ధోనీ, శివమ్ దూబే (%వాష్ట్రఅఝుఎ ఐబఎవ%) ఉన్నారు. ఈ సమయంలో కెప్టెన్‌గా రిషభ్‌పంత్ తీసుకున్న నిర్ణయాల్లో ఒత్తిడి, అనుభవలేమి స్పష్టంగా కనిపించింది. అప్పుడు అవేశ్ ఖాన్ ( శార్దూల్ ఠాకూర్‌తో బౌలింగ్ వేయించాడు.

కానీ అప్పటివరకు మూడు ఓవర్లు వేసి కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు నేల కూల్చిన రవి బిష్ణోయ్ (%ఖుజఅ దీఅంష్ట్రఅశీఅ%) చేతికి బంతిని కూడా ఇవ్వలేదు. ఇంతకు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో చెన్నై సూపర్‌కింగ్స్‌కు జరిగిన మ్యాచ్‌లో ధోనీని కేవలం 1 పరుగుకే సునీల్ నరైన్ (తన అద్భుతమైన బంతితో ఎల్‌బీడబ్ల్యూ చేసి పెవిలియన్‌కు పంపాడు. ఈ మధ్య ధోనీ పేస్‌ను ఆడుతున్నంత అలవోకగా స్పిన్‌ను ఎదుర్కోలేకపోతున్నాడు. పంత్ కనీసం ఈ విషయాన్నీ గుర్తించకుండా ఆఖర్లో పేస్ వైపే మొగ్గు చూపాడు. బంతిని రవి బిష్ణోయ్‌కు ఇచ్చిఉంటే మాత్రం ఏదైనా మ్యాజిక్ జరిగి ఉండేదేమో! చక్కటి రిథమ్‌లో బంతులు సంధించిన ఈ లెగ్ స్పిన్నర్‌తో పూర్తి కోటా ఓవర్లు వేయించకపోవడం నిజంగా పంత్ చేసిన పెద్ద తప్పిదమే అని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రవి బిష్ణోయ్ మాట్లాడాడు. 'డెత్ ఓవర్లలో నేను బౌలింగ్ చేస్తాను అని పంత్‌ను అడగలేదు. కానీ కెప్టెన్ నన్ను గమనించి బంతిని నాకు అందించాలనే ఆశతో మధ్యలో రెండుసార్లు పిచ్ వైపు వెళ్లాను. కానీ అది జరగలేదు. పంత్ వేరే ప్రణాళికలతో ఉన్నాడేమో అని అనుకున్నాను. ఇక మహీభాయ్ గురించి ప్రత్యేకంగా చెప్పేది ఏముంది?బంతి అతని రాడార్‌లో ఉంటే, అందులోనూ తనకు కలిసివచ్చిన రోజున అతడు ఆకాశమే హద్దుగా చెలరేగుతాడు' అని రవి బిష్ణోయ్ అన్నాడు.



# వినోద్ కాంబ్లీకి సునీల్ గావస్కర్ సాయం

పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ )కి సునీల్ గావస్కర్ ఆపన్న హస్తం అందించాడు. యూరినరీ ఇన్‌ఫెక్షన్, ఇతర ఇబ్బందులతో వినోద్ కాంబ్లీ గత సంవత్సరం డిసెంబర్‌లో ఆసుపత్రి పాలయ్యాడు. అతడు కొంతకాలంగా చాలా సమస్యలతో అవస్థలు పడుతున్నాడు. 2013లో అతడికి రెండుసార్లు గుండె శస్త్రచికిత్సలూ జరిగాయి. అప్పుడు సచిన్ ఆర్థికసాయం అందించాడు.

ప్రస్తుతం పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వినోద్ కాంబ్లీకి 1983 వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ సభ్యులు సాయం అందిస్తారని సునీల్ గావస్కర్ మాట ఇచ్చాడు. ప్రస్తుతం అతడు తన మాట నిలుపుకొన్నాడు. గావస్కర్ 'ఛాంప్స్' ఫౌండేషన్ తరఫున కాంబ్లీకి సహాయం అందిస్తున్నాడు. వినోద్‌కాంబ్లీకి జీవితాంతం నెలకు 30,000 చొప్పున సాయం లభించనుంది.

ఈ సంవత్సరం జనవరిలో.. కాంబ్లీ, సునీల్ గావస్కర్‌ను వాంఖడే స్టేడియం 50వ వార్షికోత్సవం సందర్భంగా కలిశాడు. అప్పుడు వినోద్ నడవడానికీ ఇబ్బందిపడ్డాడు. అలాంటి పరిస్థితిలోనూ అతడు సునీల్ గావస్కర్ కాళ్లకు నమస్కరించే ప్రయత్నం చేశాడు. ఈ సంఘటన తర్వాత గావస్కర్ వినోద్ కాంబ్లీకి వైద్యం అందిస్తున్న ఇద్దరు డాక్టర్లను కలిసి మాట్లాడాడు. వెంటనే కాంబ్లీ వైద్యానికి సాయం చేయాలని 'ఛాంప్స్' ఫౌండేషన్‌కు దిశానిర్దేశం చేశారు.

# చెన్నై జట్టులో 17 ఏళ్ల అయూష్

చెన్నై: చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో రుతురాజ్ గైక్వాడ్ కీలక ఆటగాడు. పైగా కెప్టెన్! గాయంతో అతడు ఈసారి ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. అతడికి ప్రత్యామ్నాయంగా ఆ జట్టు సీనియర్ బ్యాటర్‌ని తీసుకుంటుందని అనుకున్నారు. కానీ అందరి అంచనాలకు భిన్నంగా 17 ఏళ్ల అయూష్ మాత్రే చెన్నై జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2024 సీజన్లో విజయ్‌హజారే ట్రోఫీలో ముంబయి తరఫున అరంగేట్రం చేసిన ఈ ఓపెనర్ కర్ణాటకపై తొలి మ్యాచ్‌లోనే 78 పరుగులతో అదరగొట్టాడు. తర్వాత నాగాలాండ్‌పై 181.. సౌరాష్ట్రపై 148 పరుగులు చేసి అందరి దృష్టిలో పడ్డాడు. ఈ ఏడాది జనవరిలో మేఘాలయపై అయూష్ తొలి రంజీ మ్యాచ్ ఆడాడు. కానీ మెగా వేలంలో ఈ కుర్రాడిపై ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి చూపించలేదు. రుతురాజ్‌కు గాయం




కావడంతో చెన్నై.. అయూష్‌కు అవకాశం ఇచ్చింది. రూ.30 లక్షల కనీస ధరకు దక్కించుకుంది.

జంపా స్థానంలో రవిచంద్రన్: గాయపడిన లెగ్‌స్పిన్నర్ ఆడమ్ జంపా స్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రవిచంద్రన్ సమరన్‌ను జట్టులోకి తీసుకుంది. కర్ణాటకకు చెందిన 21 ఏళ్ల రవిచంద్రన్ ఎడమచేతి వాటం బ్యాటర్. అతడిని రూ.30 లక్షల కనీస ధరకు సన్‌రైజర్స్ సొంతం చేసుకుంది. ఇప్పటిదాకా 7 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన రవిచంద్రన్.. 64.50 సగటుతో 516 పరుగులు చేశాడు. ఆరు టీ20 మ్యాచ్‌ల్లో 170 పరుగులు సాధించాడు.

# చెన్నై ఎట్టకేలకు..

ఐపీఎల్-18ను ఘనవిజయంతో ఆరంభించి అభిమానుల్లో అంచనాలు పెంచింది చెన్నై సూపర్‌కింగ్స్. ఆ మ్యాచ్ తర్వాత 20 రోజులు గడిచాయి. ఒక్కటంటే ఒక్క విజయం లేదు. వరుసగా అయిదు ఓటములతో పూర్తిగా ఢీలా పడిపోయిందా జట్టు. సోమవారం లఖ్‌నవూతో మ్యాచ్‌లోనూ ఒక దశలో ఆ జట్టు పరిస్థితి ఓటముల్లో డబుల్ హ్యాట్రిక్ కొట్టబోతోందేమో అనిపించింది. కానీ సరైన సమయంలో ధోని మెరుపులు మెరిపించగా.. శివమ్ దూబె కూడా సమయోచితంగా ఆడి జట్టును గెలిపించాడు. మొదట బౌలర్లు సమష్టిగా సత్తా చాటి లఖ్‌నవూకు కళ్లెం వేశారు. ఆంధ్ర కుర్రాడు షేక్ రషీద్ కూడా విలువైన పరుగులతో చెన్నై విజయంలో కీలక పాత్ర పోషించడం విశేషం. సీజన్లో తొలిసారి రాణించిన పంత్.. లఖ్‌నవూను గెలిపించలేకపోయాడు.




ఐపీఎల్-18లో చెన్నై సూపర్‌కింగ్స్ ఎట్టకేలకు ఓటమి బాట వీడింది. అయిదు ఓటముల తర్వాత ఓ విజయం సాధించింది. సోమవారం ఆ జట్టు 5 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్‌ను ఓడించింది. మొదట రిషబ్ పంత్ (63బీ 49 బంతుల్లో 4ఐ4, 4ఐ6) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడంతో లఖ్‌నవూ 7 వికెట్లకు 166 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా (2/24), పతిరన (2/45), అన్షుల్ కాంబోజ్ (1/20), నూర్ అహ్మద్ (0/13) ప్రత్యర్థికి కళ్లెం వేశారు. అనంతరం 'ఇంపాక్ట్ ప్లేయర్' శివమ్ దూబె (43 నాటౌట్‌బీ 37 బంతుల్లో 3ఐ4, 2ఐ6)తో పాటు రచిన్ రవీంద్ర (37బీ 22 బంతుల్లో 5ఐ4), షేక్ రషీద్ (27బీ 19 బంతుల్లో 6ఐ4), ధోని (26 నాటౌట్‌బీ 11 బంతుల్లో 4ఐ4, 1ఐ6) రాణించడంతో చెన్నై 19.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

ధోని వచ్చాకే..: ఛేదనలో చెన్నైకి శుభారంభం దక్కింది. కొత్త ఓపెనర్, ఆంధ్ర కుర్రాడు షేక్ రషీద్ బౌండరీల మోత మోగిస్తూ చెన్నై ఛేదనను ధాటిగా ఆరంభించాడు. మరో ఓపెనర్ రచిన్ రవీంద్ర సైతం నిలకడగా ఆడడంతో చెన్నై 4 ఓవర్లకే 45 పరుగులు చేసింది. కానీ ఊపుమీదున్న రషీద్‌ను అవేష్ తర్వాతి ఓవర్లో ఔట్ చేశాడు. అయినా రచిన్ జోరు కొనసాగించడంతో 7 ఓవర్లకు 67/1తో చెన్నై పటిష్ఠ స్థితిలో నిలిచింది. కానీ పార్ట్‌టైమ్ స్పిన్నర్ మార్‌క్రమ్.. రచిన్‌ను ఔట్ చేసి చెన్నైని కష్టాల్లోకి నెట్టాడు. మరోవైపు రవి బిష్ణోయ్ (2/18), దిగ్వేశ్ రాఠి (1/23) కూడా తమ స్పిన్ మాయాజాలంతో సీఎస్కే బ్యాటర్లను కట్టిపడేశారు. ఓ ఎండ్‌లో శివమ్ దూబె నిలిచినా.. త్రిపాఠి (8), జడేజా (7), విజయ్ శంకర్ (9) పెవిలియన్‌కు క్యూ కట్టేశారు. పరుగుల వేగం తగ్గి.. 15 ఓవర్లకు 111/5తో చెన్నై తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఎల్‌ఎస్‌జీ బౌలర్ల ఊపు చూస్తే చివరి 5 ఓవర్లలో 56 పరుగులు చేయడం చాలా కష్టంగానే కనిపించింది. అయితే ఇలాంటి పరిస్థితుల్లో ఇటీవల తడబడుతున్న ధోని.. ఈ మ్యాచ్‌లో మాత్రం చెలరేగాడు. అవేష్ వేసిన 16వ ఓవర్ చివరి 2 బంతులకు ఫోర్లు కొట్టిన ధోని.. తర్వాత శార్దూల్ బౌలింగ్‌లో సిక్సర్ బాదాడు. మరోవైపు శివమ్ దూబె కూడా సమయోచితంగా షాట్లు ఆడి చెన్నైని లక్ష్యానికి చేరువ చేశాడు. శార్దూల్ వేసిన 19వ ఓవర్లో 19 పరుగులు రావడంతో చెన్నై పని తేలికైపోయింది. ఆఖరి ఓవర్లో 5 పరుగులే అవసరం కాగా.. మూడో బంతికి ఫోర్ కొట్టి దూబె పని పూర్తి చేశాడు.

నిలిచిన పంత్: మొదట కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లఖ్‌నవూను చెన్నై బౌలర్లు బాగానే కట్టడి చేశారు. ఈ సీజన్లో దూకుడైన బ్యాటింగ్‌కు పేరుపడ్డ ఈ మ్యాచ్‌లో మాత్రం ధాటిగా ఆడలేకపోయింది. నిలకడగా రాణిస్తున్న మార్‌క్రమ్ (6).. ఖలీల్ వేసిన తొలి ఓవర్లోనే త్రిపాఠి పట్టిన అద్భుత క్యాచ్‌కు వెనుదిరగడం.. ఉన్నంతసేపు విధ్వంసం సృష్టించే పూరన్ (4) విఫలమవడంతో లఖ్‌నవూ ఇన్నింగ్స్ నత్తనడకన సాగింది. అయితే వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న రిషబ్ పంత్ చివరి వరకు నిలిచి కీలక ఇన్నింగ్స్‌తో జట్టుకు పోరాడే స్కోరు సాధించిపెట్టాడు. మార్‌క్రమ్, పూరన్ త్వరగా ఔటయ్యాక మార్ష్ (30బీ 25 బంతుల్లో 2ఐ4, 2ఐ6) తో కలిసి పంత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. చెన్నై బౌలర్ల క్రమశిక్షణ వల్ల మార్ష్ సైతం సహజ శైలిలో చెలరేగలేకపోయాడు. అతను ప్రమాదకరంగా మారుతున్న దశలో జడేజా బౌల్డ్ చేశాడు. తర్వాత బదోని (22), సమద్ (20)ల సహకారంతో పంత్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కానీ బ్యాటర్లు మరీ ధాటిగా ఆడే అవకాశం చెన్నై బౌలర్లు ఇవ్వలేదు. అయితే 18, 19 ఓవర్లలో కలిపి నాలుగు సిక్సర్లు (పంత్ 3, సమద్ 1) రావడంతో స్కోరు 160 దాటింది. పతిరన వేసిన చివరి ఓవర్లో ఎల్‌ఎస్‌జీ 3 వికెట్లు కోల్పోయి 11 పరుగులే చేసింది.

మనోడు అదుర్స్

ఐపీఎల్‌లోకి మరో ఆంధ్రా కుర్రాడు ఐపీఎల్‌లో అడుగుపెట్టాడు. ఈ సీజన్లో ఇప్పటికే సత్యనారాయణ రాజు ముంబయి తరఫున అరంగేట్రం చేయగా.. సోమవారం గుంటూరు కుర్రాడు షేక్ రషీద్ చెన్నై తరఫున తన తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడాడు. అరంగేట్ర మ్యాచ్‌లో అతను విలువైన ఇన్నింగ్సే ఆడాడు. ఛేదనలో రచిన్ రవీంద్రతో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన రషీద్.. చకచకా బౌండరీలు కొట్టి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. రషీద్ ఉన్నంతసేపు స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. చెన్నై తరఫున ఐపీఎల్‌లో ఓపెనింగ్ చేసిన అత్యంత పిన్న వయస్కుడు రషీదే. అతడి వయసు 20 ఏళ్లే. సామ్ కరన్ (22 ఏళ్లు)ను అతను అధిగమించాడు.

లఖ్‌నవూ ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) త్రిపాఠి (బి) ఖలీల్ 6బీ మార్ష్ (బి) జడేజా 30బీ పూరన్ ఎల్బీ (బి) కాంబోజ్ 8బీ పంత్ (సి) ధోని (బి) పతిరన 63బీ బదోని (స్టంప్డ్) ధోని (బి)జడేజా 22బీ సమద్ రనౌట్ 20బీ మిల్లర్ నాటౌట్ 0బీ శార్దూల్ (సి) రషీద్ (బి) పతిరన 6బీ ఎక్స్‌ట్రాలు 11 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 166బీ వికెట్ల పతనం: 1-6, 2-23, 3-73, 4-105, 5-158, 6-158, 7-166బీ బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-0-38-1బీ అన్షుల్ కాంబోజ్ 3-0-20-1బీ జేమీ ఓవర్టన్ 2-0-24-0బీ జడేజా 3-0-24-2బీ నూర్ అహ్మద్ 4-0-13-0బీ పతిరన 4-0-45-2

చెన్నై ఇన్నింగ్స్: రషీద్ (సి) పూరన్ (బి) అవేష్‌ఖాన్ 27బీ రచిన్ రవీంద్ర ఎల్బీ (బి) మార్‌క్రమ్ 37బీ రాహుల్ త్రిపాఠి (సి) అండ్ (బి) రవి బిష్ణోయ్ 9బీ జడేజా (సి) మార్‌క్రమ్ (బి) రవి బిష్ణోయ్ 7బీ శివమ్ దూబె నాటౌట్ 43బీ విజయ్ శంకర్ (సి) అవేష్‌ఖాన్ (బి) దిగ్వేశ్ 9బీ ధోని నాటౌట్ 26బీ ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (19.3 ఓవర్లలో 5 వికెట్లకు) 168బీ వికెట్ల పతనం: 1-52, 2-74, 3-76, 4-96, 5-111బీ బౌలింగ్: శార్దూల్ ఠాకూర్ 4-0-56-0బీ ఆకాశ్‌దీప్ 1-0-13-0బీ దిగ్వేశ్ రాఠి 4-0-23-1బీ అవేష్‌ఖాన్ 3.3-0-32-1బీ రవి బిష్ణోయ్ 3-0-18-2బీ మార్‌క్రమ్ 4-0-25-1

# ధీరజ్‌కు మరో పతకం

దిల్లీ: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ మరో పతకం సాధించాడు. ఇప్పటికే తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్‌లతో కలిసి పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో రజతం గెలిచిన ధీరజ్.. వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెలిచాడు. 23 ఏళ్ల ధీరజ్.. కాంస్యం కోసం జరిగిన పోరులో 6-4తో ఆండ్రీన్ టెమినో (స్పెయిన్)పై విజయం సాధించాడు. మ్యాచ్ ఆరంభంలో 2-4తో వెనుకబడి కూడా ధీరజ్ గొప్పగా పుంజుకున్నాడు. టోర్నీలో భారత్ మొత్తం నాలుగు పతకాలు సాధించింది. రిషబ్ యాదవ్‌తో కలిసి తెలుగమ్మాయి జ్యోతి సురేఖ మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్ స్వర్ణం గెలవగా.. పురుషుల కాంపౌండ్ టీమ్ కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే.






# బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు.. సెన్సెక్స్ 1500౦, 23,300 ఎగువకు నిఫ్టీ

ముంబయి: వివిధ దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలను తాత్కాలికంగా వాయిదా వేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను ఆ సుంకాల జాబితా నుంచి తొలగిస్తూ చేసిన ప్రకటన మార్కెట్లలో కొత్త ఉత్సాహం నింపింది. అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 1500 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 500 పాయింట్లు పైకెగసింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్క రోజులో రూ.8.7 లక్షల కోట్లు పెరిగి రూ.410.24 లక్షల కోట్లకు చేరింది.

అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 76,852.06 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,157.26) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 76,907.63 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1577.63 పాయింట్ల లాభంతో 76,734.89 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 500 పాయింట్లు లాభపడి 23,328.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.77గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,242 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

కారణాలు ఇవీ..

స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను ప్రతీకార సుంకాల నుంచి మినహాయిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయం మార్కెట్లో కొనుగోళ్ల మద్దతుకు కారణమైంది.

హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నేడు 3 శాతం మేర రాణించాయి. సెన్సెక్స్ 1577 పాయింట్లు రాణించడంలో ఈ రెండు బ్యాంకులే దాదాపు 638 పాయింట్ల మేర దోహదపడ్డాయి.

ఆటో సెక్టార్‌కు కూడా టారిఫ్‌ల నుంచి మినహాయింపు లభిస్తుందన్న అంచనాలతో నిఫ్టీ ఆటో ఇండెక్స్ నేడు 3 శాతం మేర లాభపడింది. సంవర్ధనా మదర్‌సన్, భారత్ ఫోర్జ్, టాటా మోటార్స్ షేర్లు రాణించాయి.

నిన్నటి అమెరికా మార్కెట్లతోపాటు నేడు ఆసియా మార్కెట్లు రాణించడమూ మన మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపింది. జపాన్, హాంకాంగ్, షాంఘై మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.

అమెరికా డాలర్ ఇండెక్స్ బలహీనపడడం మన లాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు కలిసొస్తోందని నిపుణులు చెబుతున్నారు. విదేశీ పెట్టుబడులు తరలిరావడం వల్ల రూపాయి మీద కూడా ఒత్తిడి తగ్గుతుంది.

# వడ్డీ రేట్లు తగ్గిస్తున్న బ్యాంకులు




హైదరాబాద్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజాగా రెపో రేటును 0.25% తగ్గించడంతో, బ్యాంకులూ ఆ ప్రయోజనాన్ని రుణగ్రహీతలకు బదిలీ చేస్తున్నాయి. దీంతోపాటు పలు బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) రేట్లనూ తగ్గించడం ప్రారంభించాయి.

ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 'రెపో ఆధారిత గృహరుణ వడ్డీ రేటు'ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు సోమవారం తెలిపింది. గృహరుణ కొత్త వడ్డీ రేట్లు 8.25% నుంచి ప్రారంభం కానున్నాయి. ఈబీఎల్ఆర్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.65 శాతానికి తీసుకొచ్చింది.

డిపాజిట్ రేట్ల కోత: వివిధ కాలావధి డిపాజిట్లపై వడ్డీని 10-25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. రూ.3 కోట్ల లోపు ఎఫ్‌డీలపై 1-2 ఏళ్ల వ్యవధికి 6.70%, 2-3 ఏళ్లకు 6.90%, 3-5 ఏళ్ల వ్యవధికి 6.75%, 5-10 ఏళ్ల వ్యవధి డిపాజిట్లపై 6.50% వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపింది. సీనియర్ సిటిజన్లకు దీనిపై అర శాతం వడ్డీ అధికంగా లభిస్తుంది.

తన ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం 'అమృత్ వృష్టి'ని తిరిగి తీసుకొచ్చినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. ఈ పథకం వ్యవధి 444 రోజులు. దీనిపై 7.05% వడ్డీ ఇస్తున్నట్లు పేర్కొంది. సీనియర్ సిటిజన్లకు 7.55%, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.65% వార్షిక వడ్డీ ఇస్తామంది.

కొత్త వడ్డీ రేట్లన్నీ ఈనెల 15 నుంచి అమల్లోకి వస్తున్నట్లు బ్యాంకు తెలిపింది.

బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) గృహరుణాలపై వడ్డీని 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. వాహన, వ్యక్తిగత, తనఖా, విద్యా రుణాలు, స్టార్ రివర్స్ మార్టిగేజ్ రుణాలకూ ఇది వర్తిస్తుంది. ఇప్పటికే బ్యాంకులో గృహరుణం తీసుకున్న వారికి, కొత్తగా తీసుకునే వారికీ 7.90% నుంచీ వార్షిక వడ్డీ రేటు ప్రారంభమవుతుంది. ఈ వడ్డీ రేటు క్రెడిట్ స్కోరు ఆధారంగా ఉంటుంది. వివిధ వ్యవధుల డిపాజిట్లపైనా వడ్డీ రేటును 0.25% తగ్గించింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) రెపో ఆధారిత రుణ వడ్డీ రేట్లను 0.25% తగ్గించింది. దీంతో బ్యాంకు వడ్డీ రేటు 9.05% నుంచి 8.80 శాతంగా మారింది. గృహరుణాలు 7.85% నుంచి, వాహన రుణాలు 8.20% నుంచి ప్రారంభం అవుతాయని బ్యాంకు పేర్కొంది.

ప్రైవేటు రంగ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పొదుపు ఖాతా నిల్వపై వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. కొత్త వడ్డీ రేటు 2.75 శాతంగా పేర్కొంది. ప్రస్తుతం ప్రైవేటు బ్యాంకుల్లో ఇది అత్యల్పం. రూ.50 లక్షలకు మించిన నిల్వ ఉండే ఖాతాదారులకు వడ్డీ రేటు 3.50% నుంచి 3.25 శాతానికి తగ్గింది. ఈనెల 12 నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి.

గమనిక: ఈనాడు.నెట్‌లో కనిపించే వ్యాపార ప్రకటనలు వివిధ దేశాల్లోని వ్యాపారస్తులు, సంస్థల నుంచి వస్తాయి. కొన్ని ప్రకటనలు పాఠకుల అభిరుచిననుసరించి కృత్రిమ మేధస్సుతో పంపబడతాయి. పాఠకులు తగిన జాగ్రత్త వహించి, ఉత్పత్తులు లేదా సేవల గురించి సముచిత విచారణ చేసి కొనుగోలు చేయాలి. ఆయా ఉత్పత్తులు / సేవల నాణ్యత లేదా లోపాలకు ఈనాడు యాజమాన్యం బాధ్యత వహించదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి తావు లేదు.

# స్టోర్ కెళ్లకుండానే చేతికి ఎయిర్‌టెల్ సిమ్ కార్డ్... 10 నిమిషాల్లోనే డెలివరీ




ప్రముఖ టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్ ( క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్‌తో జట్టుకట్టింది. కేవలం 10 నిమిషాల్లోనే సిమ్ కార్డును యూజర్లకు అందించేందుకు భాగస్వామ్యం కుదుర్చుకుంది. తొలి దశలో హైదరాబాద్, ఢిల్లీ, గురుగ్రామ్, ముంబయి, లఖ్‌నవూ, కోల్‌కతా వంటి 16 ప్రధాన నగరాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నట్లు ఎయిర్‌టెల్ ఓ ప్రకటనలో పేర్కొంది. దశలవారీగా మిగిలిన నగరాలు, పట్టణాలకు ఈ సేవలను విస్తరించనున్నామని తెలిపింది.

కేవలం రూ.49 నామమాత్రపు రుసుము చెల్లించి సిమ్ కార్డు పొందొచ్చని ఎయిర్‌టెల్ తెలిపింది. సిమ్‌కార్డు డెలివరీ అయిన తర్వాత ఆధార్ కేవైసీ సాయంతో సిమ్‌కార్డును యాక్టివేట్ చేసుకోవచ్చు. ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్‌లో దేన్నయినా యూజర్లు ఎంచుకోవచ్చు. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ ద్వారా ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లోకి రావాలనుకునే వారు సైతం ఈ సేవలను వినియోగించుకోవచ్చు. ఏదైనా సహకారం కావాల్సి వస్తే ఎయిర్‌టెల్ థ్యాంక్స్ ద్వారా పొందొచ్చు. సిమ్ కార్డు డెలివరీ అయిన 15 రోజుల్లో యాక్టివేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని ఎయిర్‌టెల్ తెలిపింది.

ఎయిర్‌టెల్ కస్టమర్లకు సులువైన మార్గంలో సేవలందించడంలో భాగంగా బ్లింకిట్‌తో జట్టుకట్టినట్లు ఎయిర్‌టెల్ మార్కెటింగ్ డైరెక్టర్ సిద్ధార్థ్ శర్మ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 16 నగరాల్లో ఈ సేవలు ప్రారంభించామని, త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించనున్నామని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా కస్టమర్ల సమయం చాలా వరకు ఆదా అవుతుందని బ్లింకిట్ సీఈఓ అల్బిందర్ దిండ్సా పేర్కొన్నారు.

# ఊహించని ధరకు మోటో నుంచి ఎడ్జ్ 60 స్టైలస్.. ఫీచర్లు ఇవే



ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ మోటోరొలా దూకుడు పెంచింది. ఎడ్జ్ ఫోన్స్‌తో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను క్రియేట్ చేసుకున్న ఈ కంపెనీ.. ఎడ్జ్ 60 సిరీస్‌లో ఫోన్లను ఒక్కొక్కటిగా విడుదల చేస్తోంది. తాజాగా అందుబాటు ధరలో ఎడ్జ్ 60 స్టైలస్‌ను విడుదల చేసింది. సాధారణంగా శాంసంగ్ వంటి కంపెనీలు ప్రీమియం ఫోన్లలో స్టైలస్ సదుపాయాన్ని ఇస్తుంటాయి. మరి మోటో తీసుకొచ్చిన ఈ కొత్త ఫోన్ ధర, ఇతర వివరాలు చూద్దాం.

మోటో ఎడ్జ్ 60 స్టైలస్ 6.7 అంగుళాల 1.5%ఎ% పీఓఎల్ఈడీ, 120%ఓ% రిఫ్రెష్ రేటు కలిగిన డిస్‌ప్లేతో వస్తోంది. హెచ్‌డీఆర్ 10౦ సపోర్ట్ చేస్తుంది. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్2 ప్రాసెసర్‌తో వస్తోంది. ఔటాఫ్ ది బాక్స్ ఆండ్రాయిడ్ 15తో ఈ ఫోన్ పనిచేస్తుంది. రెండేళ్ల పాటు సాఫ్ట్‌వేర్, మూడేళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇవ్వనున్నట్లు కంపెనీ తెలిపింది. ఇక వెనుక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా ఇచ్చారు. 13 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఉంది. 32 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 68%ఔ% ఫాస్ట్ ఛార్జర్‌కు సపోర్ట్ చేస్తుంది. బాక్సులోనే ఛార్జర్‌ను ఇస్తున్నారు. 15%ఔ% రివర్స్ ఛార్జింగ్‌కు కూడా సపోర్ట్ చేస్తుంది. ఐపీ68 రేటింగ్, వైఫై6, డ్యూయల్ స్టీరియో స్పీకర్స్‌తో పాటు 3.5 ఎంఎం జాక్ వంటి సదుపాయాలు ఉన్నాయి.

ఇక స్టైలస్ విషయానికొస్తే ఫోన్‌లోనే ఇన్‌బిల్ట్‌గా ఉంటుంది. దీన్ని బయటకు తీయగానే నోట్స్ ఓపెన్ అవుతుంది. దీంట్లో మీకు కావాల్సిన విషయాలు రాసుకుని నోట్స్‌లో సేవ్ చేసుకోవచ్చు. స్కెచ్ లు ఇమేజ్ ఆప్షన్ ద్వారా మీరు డ్రాయింగ్ వేసి దానికి ఇమేజ్ రూపం ఇవ్వొచ్చు. చిన్న చిన్న మ్యాథ్‌మెటిక్ ప్రాబ్లమ్స్‌ను కూడా ఇది పరిష్కరిస్తుంది. సింగిల్ వేరియంట్‌లో ఈ ఫోన్‌ను తీసుకొచ్చారు. 8జీబీ256 జీబీ వేరియంట్ ధరను రూ.22,999గా కంపెనీ నిర్ణయించింది. యాక్సిస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ లేదా ఎక్స్ఛేంజ్ బోనస్ ద్వారా రూ.1000 తగ్గింపు పొందొచ్చు. ఏప్రిల్ 23 నుంచి ఫ్లిప్‌కార్ట్, మోటో వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లలో కొనుగోలు చేయొచ్చు.

# వ్యయ నియంత్రణపై డాక్టర్ రెడ్డీస్ దృష్టి?

అగ్రశ్రేణి ఔషధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఖర్చులు తగ్గించుకునే యత్నాల్లో నిమగ్నమైంది. ఇందులో భాగంగా ఉద్యోగుల సంఖ్యనూ తగ్గించుకోవాలనే ఆలోచన చేస్తున్నట్లు ఒక ఆంగ్ల పత్రిక తెలిపింది. ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకాన్ని అమలు చేయాలనే ఆలోచన సంస్థ యాజమాన్యానికి ఉందని సదరు పత్రిక వివరించింది. పెద్దగా పనిలేని కొన్ని విభాగాలను మూసివేయడం, మరికొన్ని విభాగాల పరిమాణం తగ్గించడం వంటి ప్రణాళికలు కూడా ఉన్నట్లు పేర్కొంది. డిజిటల్ థెరప్యూటిక్స్ విభాగం, న్యూట్రాస్యూటికల్స్ విభాగం ఇందులో ఉన్నాయని తెలిపింది. ఈ చర్యలతో ఉద్యోగులకు సంబంధించిన వ్యయాలు నాలుగో వంతు వరకు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. 26,000 మంది ఉద్యోగులు: కంపెనీ వార్షిక నివేదిక ప్రకారం డాక్టర్ రెడ్డీస్‌లో 26,000 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. ఇందులో దాదాపు 20,000 మంది శాశ్వత ఉద్యోగులు కాగా, మిగిలిన వారు తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారు. సగటున ఒక్కో ఉద్యోగిపై జీతభత్యాల రూపంలో కంపెనీ రూ.6 లక్షలు ఖర్చు చేస్తోంది. 2023-24లో ఉద్యోగులపై కంపెనీ రూ.5,030 కోట్లు ఖర్చు చేసింది. ఉద్యోగుల శిక్షణ కార్యక్రమాలకు మరో రూ.39 కోట్లు వెచ్చించింది.

# రూ.6,499కే 32 ఎంపీ కెమెరాతో రెడ్‌మీ ఎంట్రీ లెవల్ ఫోన్




: షావోమికి చెందిన సబ్‌బ్రాండ్ రెడ్‌మీ ఎంట్రీ లెవల్‌లో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. కొన్నిరోజుల క్రితం గ్లోబల్‌గా ఎంపిక చేసిన మార్కెట్లలో ఇప్పటికే లాంచ్ రెడ్‌మీ ఏ5 ను తాజాగా భారత్‌కు తీసుకొచ్చింది. గో ఎడిషన్‌తో ఈ ఫోన్ పని చేస్తుంది. 4జీకి మాత్రమే సపోర్ట్ చేస్తుంది. ఎవరైతే ఫీచర్ ఫోన్ నుంచి స్మార్ట్‌ఫోన్‌కు మారాలనుకుంటారో వారికి ఉపయుక్తంగా ఉంటుంది. సెకండరీ ఫోన్‌గానూ వాడుకోవచ్చు.

ఇక ఫీచర్ల విషయానికొస్తే.. రెడ్‌మీ ఏ5 ఆండ్రాయిడ్ గో ఎడిషన్‌తో పనిచేస్తుంది. 6.88 అంగుళాల హెచ్‌డీ౦ డిస్‌ప్లే, 120%ఓ% రిఫ్రెష్ రేటుతో వస్తోంది. ఆక్టాకోర్ టీ7250 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. వెనకవైపు 32 ఎంపీ కెమెరా ఉంది. ముందువైపు 8ఎంపీ కెమెరా ఇచ్చారు. వైఫై, బ్లూటూత్, యూఎస్‌బీ టైప్-సి పోర్ట్, 3.5 ఎంఎం హెడ్‌ఫోన్ జాక్ ఉన్నాయి. సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంది. 5,200 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. 15%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఈ ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 3జీబీ 64జీబీ వేరియంట్ ధర రూ.6,499గా కంపెనీ నిర్ణయించింది. 4జీబీ128జీబీ వేరియంట్ రూ.7,499కు లభిస్తుంది. మైక్రోఎస్‌డీ కార్డ్ సాయంతో 1టీబీ వరకు మెమొరీని పెంచుకోవచ్చు. షావోమీ, ఫ్లిప్‌కార్ట్ వెబ్‌సైట్లలో ఏప్రిల్ 16 నుంచి వీటి విక్రయాలు ప్రారంభం అవుతాయి.

# మహేశ్ నటించిన ఆ సినిమా నేను ఎడిట్ చేస్తే బాగుండేది: నాగ్ అశ్విన్

దర్శకుడిగా తన అనుభవాలను పంచుకున్నారు నాగ్ అశ్విన్ ( తాజాగా కాలేజ్ స్టూడెంట్స్‌తో ముచ్చటించిన ఆయన ఇండస్ట్రీలో తన అనుభవాలను పంచుకున్నారు. వారితో కొన్ని ఆసక్తికర విషయాలను చెప్పారు.



ఇండస్ట్రీలో కొనసాగాలి అంటే ఏది ముఖ్యం?

నాగ్ అశ్విన్: చేసే వర్క్ ఏదైనా వందశాతం కష్టపడాలి. షార్ట్ ఫిల్మ్, సినిమా ఏదైనా ఇదే చివరిది అని భావించి తీయాలి. నేను బుక్స్ బాగా చదువుతాను. సినిమాల కంటే పుస్తకాలు మనపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. పరిశ్రమలో కొనసాగాలంటే పుస్తకాలు చదవడం కూడా ముఖ్యమే. మనం అనుకున్న కథను ప్రేక్షకులకు అర్థం అయ్యేలా రాయగలగాలి. ఒక సామాన్య కథను కూడా ఆసక్తిగా రాయాలి. 'కల్కి'లో ప్రతి సన్నివేశానికి బ్యాక్‌గ్రౌండ్‌లో ఎంతో వర్క్ చేశాం. తెరపై చూశాక అది ఫైటింగ్ సీన్ అంటారు. కానీ, దాని వెనక ఎంతో కష్టం ఉంటుంది''

'కల్కి' లాంటి పెద్ద సినిమా తీసేటప్పుడు ఒత్తిడిగా అనిపించిందా?

నాగ్ అశ్విన్: ఆ సినిమా వెనక నా ఒక్కడి కష్టం మాత్రమే లేదు. అది ఒక టీమ్ కష్టం. టీమ్‌లోని అందరి సలహాలు వింటాను. చిన్నప్పటి నుంచి మహాభారతం గురించి తెలుసు. దాని ఆధారంగా సినిమా తీయాలంటే కొంచెం భయపడ్డాను.

సినిమాల విషయంలో ఎడిటింగ్‌పై మీ అభిప్రాయం ఏంటి?

నాగ్ అశ్విన్: నేను కొన్ని ప్రాజెక్ట్‌లకు ఎడిటర్‌గా కూడా వర్క్ చేశాను. సినిమా బాగా రావడానికి ఎడిటింగ్ ప్రధానం.

హీరో కోసం కథ రాస్తారా? కథ రాశాక హీరోను ఎంపిక చేసుకుంటారా?

నాగ్ అశ్విన్: మొదట స్టోరీ రాసుకుంటాను. అందులోని పాత్రల ఆధారంగా నటీనటులను ఎంపిక చేసుకుంటాను. కల్కిలో పాత్రలు రాసిన తర్వాత మొదట అమితాబ్ బచ్చన్‌ను, తర్వాత ప్రభాస్‌ను సెలక్ట్ చేసుకున్నాను.

మీపై సినిమా తీస్తే ఏం టైటిల్ పెడతారు?

నాగ్ అశ్విన్: నేను సుబ్రహ్మణ్యం.

ఈ సినిమా నేను డైరెక్ట్ చేస్తే బాగుండేది అని ఎప్పుడైనా అనిపించిందా?

నాగ్ అశ్విన్: ఇది నేను డైరెక్ట్ చేస్తే బాగుండేది అని ఏ సినిమాకు అనిపించలేదు. కానీ, 'ఖలేజా' , 'డియర్ కామ్రేడ్' సినిమాలను నేను ఎడిట్ చేసి ఉంటే బాగుండేది అనిపించింది. నాకు కామెడీ సినిమాలు అంటే ఇష్టం. ముఖ్యంగా జంధ్యాల సినిమాలు నచ్చుతాయి.

కొత్త కథలు రాయాలంటే కష్టంగా అనిపిస్తుందా?

నాగ్ అశ్విన్: అవును. నేను ఏదైనా రాసుకున్న తర్వాత రెండు నెలలకు అదే ఐడియా వేరే సినిమా ట్రైలర్‌లో కనిపిస్తుంది. దీంతో దాన్ని పక్కన పెట్టాల్సి వస్తుంది. 2008లో ఒక కథ రాసుకున్నాను. జ్ఞాపకాలు, కలలు ఈ రెండు అంశాలతో రాశాను. ఇదే కాన్సెప్ట్‌తో వచ్చిన హాలీవుడ్ సినిమా 'ఇన్‌సెప్షన్' ట్రైలర్ చూశాక వారం రోజులు డిప్రెషన్‌లోకి వెళ్లాను. ఎంతో కష్టపడి కొత్తగా ఒక కథను రాస్తే గుర్తించే వారికంటే.. గతంలో వచ్చిన లవ్‌స్టోరీనే మరోసారి తెరకెక్కిస్తే దాని గురించి మాట్లాడేవారు ఎక్కువమంది ఉంటారు. అందుకే ఎప్పుడూ కొత్తగా రాసుకోవాలి. ఎక్కడా రాని పాయింట్ గురించి సినిమాలు తీయాలి.

# నేను వాళ్లను జడ్జ్ చేయను.. పూరి జగన్నాథ్ సినిమాపై విజయ్ సేతుపతి కామెంట్

విజయ్ సేతుపతి ( హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాను ప్రకటించినప్పటినుంచి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. పూరి ఫామ్‌లో లేరని ఆయన స్క్రిప్ట్‌ను ఎందుకు ఎంచుకున్నారంటూ విజయ్ సేతుపతిని ట్యాగ్ చేస్తూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా దీనిపై ఈ హీరో స్పందించారు. దీనికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు.



పూరితో సినిమాను ఎందుకు అంగీకరించారు?

విజయ్ సేతుపతి: పూరి జగన్నాథ్‌తో నేను చేయనున్న సినిమా షూటింగ్ జూన్‌లో ప్రారంభం అవుతుంది. గతంలో వారు చేసిన సినిమాల ఫలితాల ఆధారంగా దర్శకులను జడ్జ్ చేయను. స్క్రిప్ట్ నచ్చితే సినిమా చేస్తాను. పూరి చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. అందుకే అంగీకరించాను. ఇలాంటి కథ ఇప్పటివరకూ చేయలేదు. నేను ఎప్పుడూ కొత్త వాటికి ప్రాధాన్యం ఇస్తాను. గతంలో చేసిన స్టోరీలు రిపీట్ కాకుండా చూసుకుంటాను.

టబుతో కలిసి వర్క్ చేయనున్నారు.. ఎలా అనిపిస్తోంది?

విజయ్ సేతుపతి: ఈ సినిమాలో టబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె గొప్ప నటి. టాలెంటెడ్ కోస్టార్. గతంలో ఎప్పుడూ ఆమెతో కలిసి స్క్రీన్ పంచుకోలేదు. ఈ సినిమాలో ఆమెతో కలిసి నటించడం ఆనందంగా ఉంది.

ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో కష్టమైనది ఏది?

విజయ్ సేతుపతి: నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో 'మహారాజ' నాకు ప్రత్యేకమైనది. అందులోని పాత్ర కష్టమైనది. పిల్లలపై జరుగుతోన్న అఘాయిత్యాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వాటిలో నటించేటప్పుడు వణికిపోయాను. 'సూపర్ డీలక్స్', 'ఉప్పెన'లోని పాత్రలు కూడా కష్టమైనవే. కానీ 'మహారాజ' నా హృదయాన్ని హత్తుకుంది. ఎందుకంటే నేను నిజజీవితంలోనూ ఒక కుమార్తెకు తండ్రినే కదా.

సినిమాల విషయంలో మీ బలం ఏమిటి?

విజయ్ సేతుపతి: నేను బలమైన సందేశం ఉన్న సినిమాలు ఎంచుకుంటాను. అదే నా బలం. పూర్తిగా వినోదాత్మక చిత్రాలలో నటించకూడదని కాదు.. వినోదంతో పాటు సందేశం కూడా ఉండాలి.

రాబోయే ప్రాజెక్ట్ గురించి చెబుతారా?

విజయ్ సేతుపతి: పూరి సినిమాతో పాటు మరో రెండు తమిళ ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. మిస్కిన్ దర్శకత్వంలో 'ట్రైన్' చిత్రంలో నటిస్తున్నాను. ఇది యాక్షన్ చిత్రం. దీనితో పాటు మరో మర్డర్ మిస్టరీలో నటిస్తున్నాను.

# కాలభైరవుడే నాతో రాయించాడని నమ్ముతున్నా

"ఓ ప్రేతాత్మకు పంచాక్షరి మంత్రానికి మధ్య జరిగే యుద్ధమే 'ఓదెల 2" ) అన్నారు దర్శకుడు సంపత్ నంది ఆయన పర్యవేక్షణలో తమన్నా ప్రధాన పాత్రధారిగా అశోక్ తేజ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమే 'ఓదెల 2'. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్.సింహ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 17న థియేటర్లలోకి రానుంది.




''ఓదెల'లో ఒక దుష్టశక్తి అంతమయ్యాక అది ఆత్మగా మారుతుంది. దీంతో దాన్ని అడ్డుకోవడానికి మరో గొప్ప శక్తి రావాల్సిన అవసరం ఏర్పడుతుంది. అలాంటప్పుడు శివశక్తి లాంటి పాత్ర కథలోకి వస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన నుంచి పూర్తి స్క్రిప్ట్‌ను సిద్ధం చేశా. నిజానికి మా నాన్నమ్మ కూడా శివశక్తిగానే జీవించారు. ఆమె 98ఏళ్లు బతికారు. చిన్నప్పుడు మా ఊరి చుట్టు పక్కల అలాంటి వాళ్లను చాలా మందిని చూశా. ఈ శివశక్తులే నాగసాధువులుగా మారతారని.. వాళ్లే శివాలయాల్ని పునరుద్ధరణ చేస్తారని నా పరిశోధనలో తెలుసుకున్నా. అలా ఈ అంశాలతోనే తమన్నా పాత్రను తీర్చిదిద్దుకున్నా. ఆమె కూడా ఈ కథ వినగానే బాగా నచ్చి చేస్తానని చెప్పారు".

'అరుంధతి'తో పోలిక ఉండదు..

"ట్రైలర్ చూసి చాలా మంది దీన్ని 'అరుంధతి'తో పోలుస్తున్నారు. కానీ, ఆ చిత్రానికి మా సినిమాకి ఏ పోలిక లేదు. రెండూ వేటికవే ప్రత్యేకమైన చిత్రాలు. ఈ చిత్రంలో విజువల్స్ అన్నీ చాలా కొత్తగా ఉంటాయి. దాదాపు 150మంది వీఎఫ్ఎక్స్ నిపుణులు ఆరు నెలల పాటు దీనికోసం కష్టపడ్డారు. క్లైమాక్స్ ఫైట్‌ను రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్ వేసి చిత్రీకరించాం. అదీ చిత్రానికి ఆకర్షణగా నిలుస్తుంది. దీనికి కొనసాగింపుగా 'ఓదెల 3' ఉంటుందని చెప్పాం. కాకపోతే ఇలాంటి చిత్రాలకు మనం ఏదీ ప్లాన్ చేయలేం. అవన్నీ దేవుడు ప్లాన్ చేయాలనే భావిస్తా. 'ఓదెల 2'ని కాలభైరవుడే రాయించాడని నమ్ముతున్నా".

శర్వానంద్ సినిమా కథ ఇదే..

"భవిష్యత్తులో శివుడిపై నేను మరో సినిమా చేస్తా. అది నేను నమ్మే సిద్ధాంతాలతో ఉంటుంది. ప్రస్తుతం నేను శర్వానంద్‌తో చేయనున్న సినిమా వాస్తవ సంఘటనలతో అల్లుకున్న కథగా ఉంటుంది. మహారాష్ట్ర - ఆదిలాబాద్ సరిహద్దుల్లో ఓ గ్రామం ఉంది. 1960ల్లో ఆ ప్రాంతంలో అక్కడ జరిగిన కొన్ని సంఘటనల్ని ఫిక్షన్‌గా మార్చి ఈ సినిమా చేస్తున్నాం".

పాత్ర కోసం.. తమన్నా నియమాలు!

"ఈ చిత్రం కోసం తమన్నా ఎన్నో నియమాలు పాటించారు. చిత్రీకరణ జరిగినన్ని రోజులు చెప్పులు వేసుకోలేదు. పూర్తిగా శాకాహారిగా మారిపోయారు. ఆమె ఎండలో చెప్పులు లేకుండా నటించడం వల్ల సాయంత్రానికి తన కాళ్లు బొబ్బలు ఎక్కాయి. మా టీమ్ మొత్తం కూడా చిత్రీకరణ జరిగినన్ని రోజులు ఈ నియమాల్ని పాటించింది. అయితే మా అందరికంటే తమన్నా ఎక్కువ శ్రమించారు.

# ఎన్టీఆర్ ఎందుకు సన్నగా అయ్యారు.. కల్యాణ్ రామ్ ఏమన్నారంటే

FONT SIZE



ప్రస్తుతం వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హీరో కల్యాణ్ రామ్ ఆయన ప్రధానపాత్రలో నటించిన 'అర్జున్ వైజయంతి' ఏప్రిల్ 18న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ గురించి కల్యాణ్ రామ్ మాట్లాడారు. తారక్ ఎందుకు సన్నగా అయ్యారు మీరేమైనా ట్రైనింగ్ ఇచ్చారా? అనే ప్రశ్నకు సమాధానమిచ్చారు.

"ఎన్టీఆర్ (ఒక సూపర్ స్టార్. ఆయన మార్కెట్ ఇప్పుడు పాన్ ఇండియా స్థాయికి చేరింది. దేశంలోనే అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో సినిమా చేస్తున్నాడు. వాళ్లిద్దరికీ నేను సలహాలు ఇస్తానా? నేను, తారక్ ఏం చేసినా సినిమా కోసమే" అని చెప్పారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్ 'వార్ 2'లో నటిస్తున్నారు. దీనితో పాటు ఏప్రిల్ 22 నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. ఇటీవల ఆయనకు సంబంధించిన కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. అందులో తారక్ సన్నగా కనిపించారు.

ఇక 'అర్జునవైజయంతి' విషయానికొస్తే.. ప్రదీప్ చిలుకూరి దీన్ని తెరకెక్కించారు. ఇందులో విజయశాంతి కీలకపాత్రలో కనిపించనున్నారు. తల్లీ కుమారుడి సెంటిమెంట్‌తో ఇది రూపొందింది. ఇటీవల దీని గురించి దర్శకుడు మాట్లాడుతూ.. "కొంత వయసు వచ్చాక అమ్మ తనకు సంబంధించిన విషయాలు మర్చిపోతుంది. ఆ విషయాలు మనం గుర్తుపెట్టుకోవడం ఎంత ముఖ్యమో ఇందులో చూపించాం. అమ్మ పుట్టినరోజు చుట్టూ కథ తిరుగుతుంది'' ఇదే పాయింట్‌తో దీన్ని రూపొందించాం అని తెలిపారు.

# లారెన్స్ వదులుకున్నారు... విజయ్‌సేతుపతి అందుకున్నారు

ఒకరు నటించాల్సిన పాత్రను మరొకరు పోషించడమనేది చిత్ర పరిశ్రమలో సాధారణం. ఒక్కొక్కరూ ఒక్కో కారణం వల్ల తమ దగ్గరకు వచ్చిన అవకాశాలను తిరస్కరిస్తారు. వేరొకరు ఆ ఛాన్స్ సద్వినియోగం చేసుకుంటారు. ఆ జాబితాలోకే వస్తారు రాఘవ లారెన్స్ (, విజయ్ సేతుపతి . అది ఏ పాత్రంటే? 'విక్రమ్' చిత్రంలోని సంతానం.

కమల్‌హాసన్ ( హీరోగా లోకేశ్ కనగరాజ్ (%ాశీనివంష్ట ఖుఅఖుస్త్రుతీఖుయ%) తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. ఏజెంట్ అరుణ్‌కుమార్ విక్రమ్‌గా కమల్, ఏజెంట్ అమర్‌గా ఫహద్ ఫాజిల్, సంతానం క్యారెక్టర్‌లో విజయ్ సేతుపతి ఒదిగిన తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. విభిన్నమైన మ్యానరిజంతో సేతుపతి సర్‌ప్రైజ్ చేశారు. నెగెటివ్ ఛాయలున్న ఆ క్యారెక్టర్‌కు సేతుపతి తప్ప మరొకరు న్యాయం చేయలేరేమో అని అనిపించేంతగా యాక్ట్ చేశారు. ఇదే రోల్ లారెన్స్ ప్లే చేసుంటే ఎలా ఉండేదో ఊహించుకోండి. ఎందుకంటే..?

సంతానం పాత్ర కోసం దర్శకుడు లోకేశ్ ముందుగా లారెన్స్‌నే సంప్రదించారు. అదే సమయంలో.. ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండడం, డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో లారెన్స్ నటించడం కుదరదని చెప్పారు. దాంతో, లోకేశ్.. విజయ్ సేతుపతిని తీసుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో ఈ విశేషాలు పంచుకున్న లారెన్స్.. "నేనూ లోకేశ్ ఎప్పటి నుంచో కలిసి పనిచేయాలనుకుంటున్నాం. భవిష్యత్తులో అది జరగొచ్చు. ప్రస్తుతానికి లోకేశ్ రాసిన ఓ కథలో నేను నటించబోతున్నా. దానికి అతడి అసిస్టెంట్ దర్శకత్వం వహించనున్నాడు" అని తెలిపారు.



# బీపీ తగ్గాలా... ఈ ఎక్సర్‌సైజ్ చేస్తే సరి

అధిక రక్తపోటు తగ్గటానికి వ్యాయామం తోడ్పడుతుందన్నది తెలిసిన విషయమే. కానీ ఎలాంటి వ్యాయామం మేలు చేస్తుంది? ఇంగ్లాండ్ పరిశోధకులు దాన్నే గుర్తించారు.

వ్యాయామాలు బోలెడు. అధిక రక్తపోటు తగ్గటానికి ఏదో ఒక వ్యాయామాన్ని ఎవరైనా సూచిస్తే బాగుండునని చాలాసార్లు అనిపిస్తుంటుంది. ఇలాంటివారి కోసమే ఇంగ్లాండు పరిశోధకులు సూక్ష్మంలో మోక్షంలా ఓ వ్యాయామాన్ని గుర్తించారు. అదే ఐసోమెట్రిక్ ఎక్సర్‌సైజ్. కదలకుండా ఒకే స్థితిలో ఉంటూ కండరాలను వంచి చేసే వ్యాయామాన్ని ఐసోమెట్రిక్ ఎక్సర్‌సైజ్ అంటారు. ఉదాహరణకు– గోడ కుర్చీ. దీన్ని వేసినప్పుడు శరీరమేమీ కదలదు. ఆ స్థితిలో అలాగే ఉండటానికి కడుపు, కాళ్లు, శరీర పైభాగం కండరాలు సంకోచిస్తుంటాయి. కానీ కండరాల పొడవేమీ మారదు. స్థిరంగా అలాగే ఉంటాయి. చాలారకాల యోగాసనాలు కూడా ఐసోమెట్రిక్ వ్యాయామం కోవలోకే వస్తాయని చెప్పుకోవచ్చు. ఇలాంటి వ్యాయామంతో సిస్టాలిక్ రక్తపోటు (పై సంఖ్య) 8.24 ఎంఎం హెచ్‌జీ మేరకు, డయాస్టాలిక్ రక్తపోటు 2.5 ఎంఎం హెచ్‌జీ మేరకు తగ్గుతున్నట్టు తేలింది.

గతంలో నిర్వహించిన 270 అధ్యయనాలను సమీక్షించి పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు. గుండె, శ్వాస వేగాన్ని పెంచే పరుగు, సైకిల్ తొక్కటం వంటి ఏరోబిక్ వ్యాయమాలు.. బరువులను ఎత్తటం, బ్యాండులను లాగటం వంటి రెసిస్టెన్స్ వ్యాయామాలు.. మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ కాసేపు అతి వేగంగా చేసే ఇంటర్వెల్ ట్రెయినింగ్ వంటి వాటితో పోలిస్తే ఐసోమెట్రిక్ వ్యాయామంతో రక్తపోటు ఇంకాస్త ఎక్కువగా తగ్గుతుండటం గమనార్హం. అధిక రక్తపోటు ) నార్మల్‌గా ఉన్నవారి దగ్గరి నుంచి ఎక్కువగా ఉన్నవారి వరకూ అందరికీ ఇది మేలు చేస్తోందని పరిశోధకులు చెబుతున్నారు.


ఎలా మేలు చేస్తాయి?



మనలో చాలామంది ఐసోమెట్రిక్ వ్యాయామాలు చేస్తూనే ఉంటాం. కానీ అవి చేస్తున్నామనే సంగతి తెలియదు. ఉదాహరణకు– మోచేతిని వంచి చేత్తో టెన్నిస్ బంతిని 30 సెకండ్ల పాటు నొక్కి పట్టి ఉంచారనుకోండి. కొంతసేపు అలాగే ఉన్నప్పుడు చేయి కండరాలు బిగుసుకుంటాయి. దీంతో వాటి చుట్టుపక్కల రక్తనాళాలు సంకోచిస్తాయి. అప్పుడు పాక్షికంగా రక్త ప్రసరణ బిగుసుకుపోయి, ఆక్సిజన్ సరఫరాను అడ్డుకునే పదార్థాలు (అనరోబిక్ మెటబలైట్లు) పోగవుతాయి. దీన్ని శరీరం ఇష్టపడదు. బంతిని నొక్కటం ఆపగానే రక్త ప్రసరణ మామూలు స్థితికి వస్తుంది. మణికట్టు వద్ద ఏర్పడిన అయోమయ పరిస్థితిని చక్కబడే క్రమంలో ఒక్క ఉదుటున రక్త ప్రసరణ పుంజుకుంటుంది. అప్పుడు ఎర్ర రక్తకణాలు రక్తనాళాల గోడల మీద ఒత్తిడిని కలగజేసి.. నైట్రిక్ ఆక్సైడ్ విడుదలను ప్రేరేపిస్తాయి. రక్తనాళాలు విప్పారటానికి నైట్రిక్ ఆక్సైడ్ తోడ్పడుతుంది. ఫలితంగా రక్తపోటూ తగ్గుముఖం పడుతుంది.

ఐసోమెట్రిక్ వ్యాయామం ఏదో ఒక్క భాగానికే పరిమితమైనదే అయినా అధిక రక్తపోటు విషయంలో శరీరమంతా ప్రభావం చూపుతుండటం విశేషం. ఒక కాలును చాచటం, పిడికిలి బిగించటం, గోడ కుర్చీ.. ఈ మూడు వ్యాయామాలనే అధ్యయనంలో విశ్లేషించారు. అయితే మిగతా ఐసోమెట్రిక్ వ్యాయామాలకూ అధ్యయన ఫలితాలు వర్తిస్తాయని చెబుతున్నారు. వీటిని పదే పదే చేసినప్పుడు ఎక్కువగా నైట్రిక్ ఆక్సైడ్ విడుదలై రక్తపోటు తగ్గుతుంది. అలాగని బరువులు ఎత్తటం, పరుగెత్తటమూ తక్కువేమీ కాదు. ఇవీ కాసేపు రక్తనాళాలను బిగువుగా పట్టి ఉంచి, రక్తపోటు తగ్గటానికి తోడ్పడతాయి.

# మడమ నొప్పికి వ్యాయామ చికిత్స



ఉదయం నిద్రలేచి మంచం మీది నుంచి దిగాలంటే భయం. పాదం కింద పెట్టగానే భరించలేనంత నొప్పి. అడుగు తీసి అడుగు వేయటమే కష్టం. రెండు మూడు గంటల పాటు ఇదే పరిస్థితి. కొందరికైతే రోజంతా మడమ నొప్పే. ప్లాంటార్ ఫేషియైటిస్ సమస్య ఇలాగే వేధిస్తుంది. పరుగెత్తేవారు, రోజులో ఎక్కువసేపు నిలబడే పనులు చేసేవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది. దీనికి మూలం పాదం అడుగున ఎముకలకు అతుక్కొని ఉండే బిగుతైన పొర 'ప్లాంటార్ ఫేషియా' వాపు. ఈ పొర పాదం వెనక, ముందు వేళ్ల ఎముకలకు అతుక్కొని ఉంటుంది. కానీ పాదం మధ్యలో ఎక్కడా అతుక్కోదు. ఊబకాయం, కదలకుండా ఉండటం, అతి వాడకం, చదును పాదాలు, పల్చటి చెప్పుల వాడకం వంటి రకరకాల కారణాలతో అక్కడక్కడా చిరుగుతూ, మళ్లీ అతుక్కుంటూ వస్తుంటుంది. క్రమంగా దృఢంగా ఉండాల్సిన తంత్రులు క్షీణిస్తాయి. దీంతో పాదం వెనక ఎముక దగ్గర అతుక్కునే చోట వాపు తలెత్తి, నొప్పి మొదలవుతుంటుంది. దీని బారినపడ్డవారు మందులు వాడుతున్నా కొన్ని వ్యాయామాలు చేయటం మంచిది. ఇవి పిక్క, పాదం కండరాలు సాగేలా, బలోపేతమయ్యేలా చేసి.. నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

బంతితో రుద్దటం

కుర్చీలో కూర్చొని లేదా నిల్చొని పాదం కింద చిన్న బంతిని పెట్టుకోవాలి.

నెమ్మదిగా పాదాన్ని ముందుకూ వెనక్కూ 10 సార్లు కదిలించాలి. కాసేపు ఆగి మళ్లీ చేయాలి. దీంతో పాదానికి మంచి మర్దన లభిస్తుంది.

బంతికి బదులు గుండ్రటి బాటిల్‌నూ వాడుకోవచ్చు. చల్లటి నీటిని నింపిన బాటిలైతే ఇంకా మంచిది.

జాగ్రత్త: పాదం నొప్పి పుట్టనప్పుడే దీన్ని చేయాలి. బంతిని లేదా బాటిల్‌ను తగినంత ఒత్తిడితో అదమాలి. కానీ నొప్పి పుట్టేలా నొక్కకూడదు.

మడమ దించటం

వేళ్లు, పాదం మధ్య భాగం మెట్టు మీద ఆనించి.. మడమలు గాల్లో తేలుతూ ఉండేలా నిల్చోవాలి.

నెమ్మదిగా మడమలను మెట్టు అంచు కిందికి వచ్చేలా కిందికి దించాలి. ఈ సమయంలో పిక్క కండరాలు సాగుతున్న భావన కలుగుతుంది. తర్వాత నెమ్మదిగా మడమలను పైకి లేపాలి.

ఇలా పది సార్లు చేసి, విశ్రాంతి తీసుకోవాలి. మరోసారి ఇలాగే చేయాలి.

జాగ్రత్త: దీన్ని చాలా నెమ్మదిగా, కదలికలను నియంత్రణలో ఉంచుకొని చేయాలి. తూలకుండా చూసుకోవాలి. మెట్ల పక్కన రెయిలింగ్‌ను పట్టుకోవాలి.

మడమ తిప్పటం

నేల మీద కూర్చొని, కాళ్లు తిన్నగా చాచాలి. ఎడమ కాలును కుడి కాలు మీద మోపాలి. కుడికాలుకు రబ్బరు బ్యాండును కట్టి, దాన్ని ఎడమ పాదం వెనక నుంచి తేవాలి. రబ్బరు బ్యాండును చేత్తో గట్టిగా పట్టుకోవాలి.

కుడి పాదాన్ని నెమ్మదిగా ముందు వైపునకు చాచాలి. ఈ సమయంలో పాదం వెలుపలి వైపునకు సాగేలా చూసుకోవాలి. కాసేపు అలాగే ఉండి, యథాస్థితికి రావాలి.

దీని పది సార్లు చొప్పును రెండు పర్యాయాలు చేయాలి.

జాగ్రత్త: పాదం మరీ ఎక్కువగా నొప్పి పుట్టకుండా చూసుకోవాలి.

కాలి వేళ్లతో తువ్వాలు చుట్టటం

కుర్చీలో తిన్నగా కూర్చోవాలి. నేల మీద తువ్వాలు పరచి, దాని మీద ఒక పాదాన్ని పెట్టాలి.

కాలి వేళ్లతో తువ్వాలును పట్టుకొని, కుర్చీ వైపు మడవటానికి ప్రయత్నించాలి. దీన్ని 10 సార్ల చొప్పున రెండు పర్యాయాలు చేయాలి.

జాగ్రత్త: పాదం మొత్తం నేలకు ఆనించి ఉంచాలి. కేవలం వేళ్లతోనే ఈ వ్యాయామం చేయాలి.

పాదం పొర సాగదీత

కుర్చీలో కూర్చొని, ఒక కాలును మోకాలు మీదికి తీసుకురావాలి.

ఒక చేత్తో మడమను, మరో చేత్తో వేళ్లను పట్టుకోవాలి. నెమ్మదిగా వేళ్లను వెనక్కి లాగాలి. ఈ సమయంలో పాదం అడుగు భాగం సాగుతున్న భావన కలుగుతుంది.

వేళ్లను 20 సెకన్ల పాటు అలాగే పట్టుకొని, విశ్రాంతి తీసుకోవాలి. దీన్ని మూడు సార్లు చేయాలి. జాగ్రత్త: నెమ్మదిగా వేళ్లను సాగదీయాలి. ఎక్కువగా నొప్పి పుట్టకుండా చూసుకోవాలి.

పిక్క సాగదీత

చేతులకు అందేంత దూరంలో గోడకు ఎదురుగా తిన్నగా నిల్చోవాలి. గోడ మీద చేతులను ఆనించాలి.

రెండు పాదాలు నేల మీద సమతలంగా ఉండాలి. ఒక కాలును ముందుకు తెచ్చి, చేతులతో గోడను నొక్కుతూ ముందుకు వంగాలి.

ఈ సమయం లో పిక్క భాగం సాగుతున్న భావన కలుగుతుంది. 20 సెకన్ల పాటు అలాగే ఉండి, యథాస్థితికి రావాలి. రెండో కాలుతోనూ ఇలాగే చేయాలి.


జాగ్రత్త: ముందుకు వంగినప్పుడు వెనక కాలు, నడుం తిన్నగా ఉండాలి. మడమ నేల మీది నుంచి పైకి లేవకూడదు.

# ప్రోస్టేట్ ఉబ్బితే?

మగవారిలో 50 ఏళ్లు దాటాక ప్రోస్టేట్ గ్రంథి ఉబ్బటం చూస్తుంటాం. మూత్రాశయం దిగువన, మూత్రనాళం చుట్టూ కరచుకొని ఉండే ఇది చాలామందిలో క్రమంగా సైజు పెరుగుతూ వస్తుంటుంది. మూత్రాశయం, మూత్రనాళం మీద ఒత్తిడి కలగజేస్తుంది. దీంతో మూత్రం ధార సన్నబడటం, ధార రెండుగా పడటం, పూర్తిగా విసర్జన కాకపోవటం, తరచూ బాత్రూమ్‌కు వెళ్లాల్సి రావటం వంటి ఇబ్బందులు మొదలవుతుంటాయి. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. కొన్ని పరీక్షలతో సమస్యను గుర్తించి, పరిష్కార మార్గం చూపుతారు. ఒక్క మందులే కాదు.. కొన్ని తేలికైన ప్రవర్తన మార్పులతోనూ ప్రోస్టేట్ ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందొచ్చు.

రాత్రి పడుకోవటానికి ఒకట్రెండు గంటల ముందు నీరు, ద్రవాలు తీసుకోవటం మానెయ్యాలి.

బయటికి ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు ద్రవాలు మితంగానే తాగాలి.



మూత్రం వస్తున్నట్టు అనిపించగానే బాత్రూమ్‌కు వెళ్లాలి. బలవంతంగా ఆపొద్దు.

మూత్ర విసర్జనకు వేళలను నిర్ణయించుకోవాలి. మూత్రం రాకపోయినా కూడా ఆ సమయంలో విసర్జన చేయాలి.

బాత్రూమ్‌కు వెళ్లినప్పుడు మూత్రాశయం పూర్తిగా ఖాళీ అయ్యేంతవరకు విసర్జించాలి. దీంతో తరచూ బాత్రూమ్‌కు పరుగెత్తాల్సిన అవసరం తప్పుతుంది.

అలర్జీ, ముక్కుదిబ్బడ తగ్గటానికి సొంతంగా కొనుక్కొని వాడే కొన్ని మందులతోనూ మూత్రం ధార నెమ్మదించొచ్చు. మూత్రాశయం పూర్తిగా ఖాళీ కాకపోవచ్చు. కాబట్టి ఇలాంటి మందులు వాడేటప్పుడు జాగ్రత్త అవసరం.

# శ్వాసకు మత్స్యాసనం

కొన్ని ఆసనాలు కొన్ని జబ్బుల ఉపశమనానికి తోడ్పడతాయి. మత్స్యాసనం ఇలాంటిదే. గాఢంగా ఊపిరి తీసుకునేలా చేసే ఇది శ్వాసకోశ జబ్బుల లక్షణాలు తగ్గటానికి సాయం చేస్తుంది. అంతేకాదు, పీయూష గ్రంథినీ ఉత్తేజితం చేస్తుంది. ఛాతీ, మెడను సాగదీస్తుంది. మెడ, భుజాల్లో ఒత్తిడిని తగ్గిస్తుంది. మరి దీన్నెలా వేయాలి?


వెల్లకిలా పడుకోవాలి. పాదాలు తాకించి ఉంచాలి. చేతులను రెండు పక్కలా తిన్నగా చాచాలి. చేతులను పిరుదుల కిందికి తేవాలి. అరచేతులు నేలకు తాకేలా చూసుకోవాలి. మోచేతులు శరీరానికి అంటి ఉండాలి. శ్వాస తీసుకొని తల, ఛాతీని పైకి లేపాలి. ఛాతీని పైకెత్తుతూ తలను వెనక్కు వంచి, నేలకు తాకించాలి. మోచేతులతో నేలను గట్టిగా అదుముతూ తల మీద ఎక్కువ భారం పడకుండా చూడాలి. తొడలు, కాళ్లతో నేలను నొక్కుతూ ఛాతీని పైకి లేపాలి. వీలైనంత సేపు అలాగే ఉండాలి. నెమ్మదిగా గాఢంగా శ్వాస తీసుకొని, వదలాలి. తర్వాత తలను పైకి లేపి, ఛాతీని కిందికి దించాలి. యథాస్థితికి రావాలి. కాసేపు విశ్రాంతి తీసుకోవాలి.



జాగ్రత్త: అధిక రక్తపోటు, రక్తపోటు పడిపోవటం, పార్శ్వనొప్పి, నిద్రలేమి, మెడ నొప్పి, నడుం నొప్పితో బాధపడేవారు దీన్ని చేయరాదు.

# బద్ధకం బంధిస్తే?

వయసు మీద పడినవారిలో మలబద్ధకం ఎక్కువ. సాధారణంగా వారానికి మూడు కన్నా తక్కువసార్లు విరేచనం కావటాన్ని మలబద్ధకంగా భావిస్తుంటారు. అయితే ఎన్నిసార్లు విసర్జనకు వెళ్తున్నారనేది వ్యక్తులను బట్టి మారిపోతుంది. కొందరు రోజులో చాలాసార్లు విసర్జనకు వెళ్లొచ్చు. కొందరికి వారానికి ఒకట్రెండు సార్లే విరేచనం కావొచ్చు. తీరు ఏదైనా గానీ మునుపటి కన్నా తక్కువసార్లు విరేచనం అవుతున్నా, విసర్జనకు కష్టపడుతున్నా, మలం గట్టిగా, పొడిగా వస్తున్నా, నొప్పి పుడుతున్నా, పూర్తిగా విసర్జన కాలేదని అనిపిస్తున్నా సమస్యగానే పరిగణించాల్సి ఉంటుంది.



ఏంటీ సమస్య?

మలబద్ధకానికి మూలం పెద్దపేగు మలంలోని నీటిని మరీ ఎక్కువగా సంగ్రహించుకోవటం. మనం తిన్న ఆహారం జీర్ణకోశంలోకి ముందుకు సాగుతున్నప్పుడు పేగులు నెమ్మదిగా పోషకాలను గ్రహించుకుంటాయి. పాక్షికంగా జీర్ణమైన ఆహారం చిన్నపేగుల్లోంచి పెద్దపేగులోకి వెళ్లి, మలంగా ఏర్పడుతుంది. పెద్దపేగు దీనిలోని నీటిని గ్రహించుకొని, మరింత గట్టిపడేలా చేస్తుంది. మలబద్ధకం గలవారిలో జీర్ణకోశం నుంచి ఆహారం నెమ్మదిగా కదులుతుంది. దీంతో నీటిని సంగ్రహించుకోవటానికి పెద్దపేగుకు ఎక్కువ సమయం లభిస్తుంది. ఫలితంగా మలం పొడిగా, గట్టిగా అవుతుంది.

ఎందుకీ బద్ధకం?

మలబద్ధకానికి జీవన విధానం, మందులు, జబ్బుల వంటి అంశాలెన్నో కారణమవుతాయి.

ఆహారంలో తగినంత పీచు పదార్థం లేకపోవటం.

సరిపడినంత నీరు తాగకపోవటం.

వ్యాయామం, శారీరక శ్రమ అంతగా చేయకపోవటం.

దినచర్య మారటం.. అంటే ప్రయాణాలు చేయటం, భోజనం చేయకపోవటం, నిద్రించే వేళలు మారటం వంటివి.

మానసిక ఒత్తిడి.

విరేచనం అయ్యేట్టు అనిపించినా ఆపటం.

నొప్పి, కుంగుబాటు, ఛాతీ మంట, అలర్జీ తగ్గించే మందులు. ఐరన్ మాత్రలు. క్యాల్షియం ఛానెల్ బ్లాకర్ల వంటి కొన్నిరకాల అధిక రక్తపోటు మందులు. మానసిక జబ్బులు, మూర్ఛ మందులు.

హైపోథైరాయిడిజమ్, మధుమేహం, రక్తంలో క్యాల్షియం ఎక్కువగా ఉండటం, పెద్దపేగు క్యాన్సర్, పేగు పూత, పెద్దపేగులో తిత్తుల వంటి జబ్బులు.

తగ్గించుకునే మార్గమేది?

వృద్ధుల్లో మలబద్ధకం ఎక్కువే అయినా కొన్ని జాగ్రత్తలతో దీన్ని నివారించుకోవచ్చు.

తగినంత నీరు తాగటం చాలా ముఖ్యం. వృద్ధులు రోజుకు కనీసం 8–10 గ్లాసుల నీరు, ద్రవాలు తీసుకోవటం మంచిది. మలం గట్టిగా వస్తుంటే ఇంకాస్త ఎక్కువ నీరు తాగాలి. దీంతో మలం మెత్తబడి, సాఫీగా విరేచనం అవుతుంది.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy